
అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక 308

సంపుటి: 38 సంచిక: 1 నవంబరు 2014
పేజీలు: 44 వెల: రు. 15



కాల కాలానికీ ఒక తెర వేలాడి ఒక దృశ్యాన్ని వెల్పార్చి వెళుతుంది
మాయా తెర వీక్షకులెపుడూ చిలకలే
తాము పంజరంలోనే ఉన్నామని తెలియని చిలకలు
మాయ తెర వీక్షకులెప్పుడూ ముగ్ధలే
తెరమీద నుండీ ఆదేశమందుకున్న
విషయమే గుర్తించలేని మంత్రముగ్ధులే!

ప్రకటన :

వీరవరం ఆదివాసుల ఆందోళన పోలీసు ప్రేరితం

విప్లవోద్యమం నుంచి ఆదివాసులను వేరు చేసే కుట్రలో భాగమే కా. వరవరరావు ఇంటి ముందు ధర్నా

నిన్న (19 నవంబర్) ఉదయం 8 గంటలకు హైదరాబాదులో విరసం వ్యవస్థాపక సభ్యుడు కామ్రేడ్ వరవరరావు ఇంటి ముందు 70 మందికిపైగా ఆదివాసులు తమకు మావోయిస్టుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ఆందోళన చేశారు. వీళ్లు విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతంలోని బలపం మండలం వీరవరం గ్రామస్తులు. తమ సమస్యలను వినాలని, పరిష్కరించాలని ప్రజా సంఘాలను కోరే హక్కు ప్రజలందరికీ ఉంటుంది. కానీ వీరవరం ఆదివాసులను పోలీసులు ప్రేరేపించి ఈ ఆందోళనకు తరలించుకొని వచ్చారు. చింతపల్లి అడవుల నుంచి హైదరాబాదు నగరానికి అంత మంది వచ్చి వరవరరావు ఇల్లు కనుక్కొని మరీ అక్కడికి వెళ్లి ఆందోళన చేశారంటే... దాని వెనుక పోలీసులు తప్పక ఉంటారని ఎవరైనా ఊహించవచ్చు.

పోలీసులు ఈ కుట్ర పూరితమైన ఆందోళన లేవదీయానికి కొంచెం నేపథ్యం ఉంది. గత నెల 20 తేదీన సంత జరుగుతున్న రోజు వీరవరం గ్రామంలో రెండు ఘటనలు జరిగాయి. ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడని మావోయిస్టులు ఒక ఆదివాసీని చంపేశారు. దీనికి ప్రతీకారంగా గ్రామస్తులు దాడి చేశారు. ఇందులో ఇద్దరు మావోయిస్టులు చంపినట్లు ప్రచారమవుతున్నది. అప్పటి నుంచి వీరవరం, ఆ చుట్టుపక్కల రెండు మూడు గ్రామాల ఆదివాసులు తమకు మావోయిస్టుల నుంచి రక్షణ కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలోని పౌరహక్కుల సంఘం నాయకుల ఇండ్ల ముందుకెళ్లి తమకు మావోయిస్టుల నుంచి రక్షణ కల్పించాలని ఆందోళన చేశారు.

అయితే మావోయిస్టు పార్టీ ఆ ప్రాంత కమిటీ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఈ ఘటనలపై పూర్తి భిన్నమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తాము చంపిన వ్యక్తి ఇన్‌ఫార్మరేనని, అందువల్లే శిక్షించాల్సి వచ్చిందని చెబుతూ తమపై ప్రజలు తిరుగుబాటు చేయలేదని, సంత రోజు కాబట్టి జన సమర్దం నుంచి పోలీసులే తమ కామ్రేడ్స్‌ను చంపేశారని ఆరోపించారు.

పోలీసులు పోరాట ప్రజల మధ్య చీలిక తీసుకరావడం, ఉద్యమ పార్టీలకు ప్రజలకు మధ్య వైరుధ్యాలు తీసుకొని రావడం, విప్లవకారులపై ప్రజలు తిరగబడ్డారని ప్రచారం చేయడం పరిపాటే. ఇలాంటి ఘటనలు గతంలో కూడా చూశాం. ఎక్కడైనా విప్లవకారుల నుంచి ఒకటి అరా పొరబాట్లు జరిగినప్పుడు వాటిని ఆసరా చేసుకొని పోలీసులను, ప్రజల్లో కొందరిని రెచ్చగొట్టి, ప్రలోభపెట్టి ఉద్యమానికి వ్యతిరేకంగా నిలబెట్టడం కూడా గతంలో జరిగాయి. తమ వైపు నుంచి పొరబాట్లు జరిగినప్పుడు విప్లవకారులు ఆ సంగతి అంగీకరిస్తూ పోలీసుల కుట్రలను బహిర్గతపరిచి చిత్తశుద్ధితో, రాజకీయ చైతన్యంతో తిరిగి ప్రజలను ఐక్యం చేసి, ఉద్యమంలో నిలబెట్టుకున్న సందర్భాలు ఉన్నాయి.


ఈ నేపథ్యంలో వీరవరం ఘటన, విశాఖలో, హైదరాబాదులో ప్రజా సంఘాల నేతల ఇండ్ల ముందుకు ఆదివాసీ ప్రజలను తరలించడం పూర్తిగా పోలీసు ప్రేరితం. పోరాట ప్రజలను ప్రజా సంఘాల మీదికి ఉసిగొల్పే కుట్ర ఇందులో ఉంది. వీరవరం ఘటనకు కొనసాగింపుగా పోలీసులు చేపట్టిన ఈ ఉద్యమ వ్యతిరేక కేంపెయిన్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలే బాధ్యత వహించాలి. బంగారు తెలంగాణ, నవ్యాంధ్ర నిర్మాణాల గురించి ఊదరగొడుతున్న రెండు రాష్ట్రాల ప్రభుత్వాలే బాధ్యత వహించాలి.

గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలు రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగమే పోలీసులు చేపట్టిన ఈ విప్లవోద్యమ వ్యతిరేక కేంపెయిన్. పోరాట ప్రజలనే విప్లవోద్యమం మీదికి ఉసిగొల్పడం, విప్లవోద్యమాన్ని, ప్రజా పోరాటాలను సమర్థిస్తున్న మేధావులు, రచయితలు, ప్రజా సంఘాల నేతల ఇండ్ల ముందు ఆందోళన చేసేలా ప్రేరేపించడం ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగమే. ఇలాంటి కుట్రపూరిత పోలీసు ప్రాయోజిత ఆందోళనల్లోని వాస్తవాలు తెలుసుకొని ఓడించేందుకు ముందుకు రావాలని ప్రజాస్వామికవాదులకు విరసం విజ్ఞప్తి చేస్తోంది.

20-11-2014, హైదరాబాద్

నవంబర్ 7న సారస్వత పరిషత్ హాల్, బొగ్గులకుంట, హైదరాబాద్‌లో సాయంత్రం 5 గంటలకు జరిగిన కామ్రేడ్ ఎం.టి.ఖాన్, కామ్రేడ్ విజయ్‌కుమార్‌ల సంస్మరణ సభ దృశ్యాలు





308

అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

సంపాదకుడు
చలసాని ప్రసాద్
వర్కింగ్ ఎడిటర్
డి.వి. రామక్రిష్ణారావు
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500 040.
*కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
ఇ-మెయిల్ ద్వారా
arunatara1977@gmail.com కూ
పంపవచ్చు
సంపాదకవర్గం :
ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్
చందాలు పంపాల్సిన చిరునామ
మేనేజర్
ఎస్. రవికుమార్
5-1307, దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.
సెల్ : 9866021257
విరసం కార్యదర్శి చిరునామా
పి. వరలక్ష్మి
5-1820, గీతాశ్రమం వీథి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.
డి.టి.పి. అండ్ లే అవుట్
ఆర్. భాగ్యలక్ష్మి
1, 4 కవర్ డిజైన్
పి. వరలక్ష్మి, క్రాంతి
2, 3 కవర్ డిజైన్
ఆర్. భాగ్యలక్ష్మి
2, 3 కవర్ ఫొటోలు
క్రాంతి, సంగ్రామ్
http://www.facebook.com/arunatara.virasam
Virasam website : www.virasam.in
ఈ సంచిక వెల : రు. 15/-

సంపాదక లేఖ...

సంపుటి : 38 ◈ సంచిక : 1 ◈ నవంబర్, 2014

దేశ దేశాలన్నీ తిరిగి నరేంద్ర మోదీ పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాడు. దేశాభివృద్ధికి పెట్టుబడే ఏకైక మార్గమని భారత పాలకవర్గాలు ఎన్నడో రూఢి చేసిన విషయాన్ని మోదీ మరింత ముందుకు తీసికెళ్తున్నాడు. ఆయన ఎక్కడికి వెళ్లినా భారత్‌లో పెట్టుబడులకు ఉండే భద్రతను, భారత జాతీయ ఔన్నత్యాన్ని ఊదరగొట్టడమే పరమ లక్ష్యం. దేశ ప్రజలందరికీ స్వచ్ఛ భారత్ అనే ఏకైక కార్యక్రమం ఇచ్చి.. మెప్పు పొందిన నేతగా కూడా ఆయన రాబోయే రోజుల్లో స్థిరపడిపోయినా ఆశ్చర్యపోనక్కర లేదు.

పెట్టుబడి విస్తరణ వల్ల కులం, మతం వంటివి బలహీనపడిపోవాలి కదా? అనే వాదన చేసే వాళ్లు 'మోదీ ప్రభ'ను విశ్లేషించుకుంటే చాలు. దేశీ, విదేశీ పెట్టుబడులు, మతతత్వం జోడుగుర్రాలుగా పరుగులు తీస్తున్న కాలం ఇది. అందుకే మోదీ హిందుత్వవాదులకు ఎంత నచ్చుతాడో, 'అభివృద్ధి కాముకుల'కూ అంతగా నచ్చుతాడు. ఈ ఫార్ములా మోదీ సృష్టి అనుకుంటే పొరబాటే. జాతీయవాదం పేరుతో వేళ్లూనుకున్న విషవృక్షమిది. దానికి ఈ రుతువులో మోదీ చిగురించాడు అంతే.

మోదీకి ముందు నుంచే సాగుతున్న ఈ అభివృద్ధి స్వభావాన్ని అంచనా వేయకుండా ముంచుకొస్తున్న ప్రమాదాన్ని ఎదుర్కోవడం సాధ్యం కాదు. పెట్టుబడికి, మతానికి సంబంధం ఉందని చెప్పడంతో సరిపోదు. అది ఉన్నదే. ఆ రెంటిలో ఏది దేనికి ఊతాన్నిస్తుందో, దేని వల్ల ఏది బలోపేతమవుతున్నదో విశ్లేషించుకోవాల్సి ఉంది. దశాబ్దాల పాలక రాజకీయాలకు కొనసాగింపుగానే మోదీ తనదైన నుడికారాన్ని ఎంచుకున్నాడు. అందువల్ల మరింత ప్రమాదకరమైన సందర్భంలో దేశ ప్రజలు నిలబడి ఉన్నారు. ఇవాళ మోదిత్వనుగానీ, శరవేగంగా విస్తరిస్తున్న భారత రాజకీయార్థిక వ్యవస్థను గానీ విశ్లేషించాలంటే కొత్త పరికరాలు కూడా అవసరమే.

అందువల్ల ఈ కాలం మన నుంచి చాలా గంభీరమైన సిద్ధాంత కృషిని కోరుకుంటున్నది. నరేంద్రమోదీ విధానాలను, ఆయన చేస్తున్న పనులను, ప్రకటనలను ఏ రోజుకారోజు విమర్శించుకుంటూ పోవడం వల్ల మాత్రమే పెద్దగా సాధించేది ఏమీ ఉండకపోవచ్చు. ఆ పని కూడా చేయవచ్చు. ప్రగతిశీల విప్లవ శిబిరం మోదీ అనే పాలకుడిని భారత పాలకవర్గాల తాజా ప్రతినిధిగా, వాళ్లు పరిరక్షిస్తున్న, లేదా రూపొందిస్తున్న రాజకీయార్థిక వ్యవస్థ స్వభావాన్ని గురి చూడాల్సి ఉంది. ఆ పని ఎంతో కొంత జరుగుతూనే ఉన్నది. అయితే సరిపోదు. ఈ గోదాములోకి ఇంకా దిగాల్సే ఉన్నది. ఇదంతా ఏదో సాంస్కృతిక సంబంధమైన వ్యవహారంగా, మైనార్టీ మతస్థుల సమస్యగా చూడ్డానికి లేదు. హిందుత్వకు, పెట్టుబడికి, సామ్రాజ్యవాదానికి సంస్కృతీ కోణం కూడా ఉన్నదిగాని మౌలిక స్థాయిలోనే అధ్యయనం చేయాల్సిన అంశాలెన్నో ఇందులో ఉన్నాయి.

నిత్యం ఈ సమస్యపై కలిసి వచ్చే శక్తులతో విశాల ఐక్య సంఘటన ప్రాతిపదికపై ఆందోళనలు నిర్మిస్తూనే లోతైన రాజకీయ, సిద్ధాంత కృషికి ప్రగతిశీల, విప్లవ శక్తులు సిద్ధం కావల్సిన తరుణమిది.

సంచిక - 308

విరసం సాహిత్యాన్ని కరపత్రాలను, స్టేట్‌మెంట్లను, అరుణతార పత్రికను **www.virasam.in** వెబ్‌సైట్‌లో చూడవచ్చు. అలాగే వివిధ సాహిత్య పత్రికల బ్లాగులు, సైట్‌ల లింకులను కూడా చూడవచ్చు.

అరుణతార చదవండి! చదివించండి! చందాదారులు కండి!

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.
విడి సంచిక వెల - రు. 15; సంవత్సర చందా - రు. 180;
రెండు సంవత్సరాల చందా - రు. 350; మూడు సంవత్సరాల చందా - రు. 500;
ఐదు సంవత్సరాల చందా - రు. 800; దశాబ్ది చందా - రు. 1600/-

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!
పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి.డి.ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),
మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం.ఎస్. భాషాలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు
ఈ-మెయిల్ : **arunatara1977@gmail.com**
http://www.facebook.com/arunatara.virasam

గాంధీ పటేల్ నమో

- వరలక్ష్మి

సర్దార్ వల్లభాయ్ పటేల్ అనే ఒక కాంగ్రెస్ నాయకుడి అతి పెద్ద విగ్రహాన్ని బీజేపీ అధినాయకుడు నిర్మించి పార్టీలకతీకమైన దేశభక్తిని చాటుకుని, ఆరువందల అడుగుల భారీ కీర్తిని, రికార్డును అందుకున్నాడు. అందుకని శతాబ్దో, ద్విశతాబ్దో కాకుండా అంత ఆకర్షణ లేని సంఖ్య అయినా 138వ జన్మదినం హఠాత్తుగా జాతీయ ప్రాధాన్యత సంతంరించుకొని దేశమంతా అట్టహాసంగా వేడుకలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ కుటుంబ పాలన కావాలనే పక్కకు పెట్టిన మహానేతకు మోడీ పుణ్యమా అని ఇప్పటికి సముచిత గౌరవం లభించిందని మీడియా యధావిధిగా ఉడతా భక్తి ప్రచారం చేసింది. ఇప్పటిదాకా గుజరాత్‌లో విశేష పూజలందుకుంటున్న నాయకుడు దేశముఖచిత్రం మీదికొచ్చాడు.

ఈ పరిణామం గురించి ఉదార ప్రజాస్వామిక వాదులు పటేల్‌కు, హిందూ ఫండమెంటలిజానికి చాలా దగ్గర సంబంధం ఉందని విశ్లేషించారు. ఆరెస్సెస్ కాంగ్రెస్‌లో విలీనం కావాలన్నది ఆయన చిరకాల అభిలాష అని, కాబట్టి ఆరెస్సెస్సే ఆయన్ను విలీనం చేసుకుందని అన్నారు. కరెన్సీ నోట్ల మీద నవ్వే గాంధీ ఇప్పుడు మోడీ స్వచ్ఛ భారత్ లోగోలోకి చేరుకున్నాడు. ఆరెస్సెస్ హిందూ జాతీయవాద రాజకీయాలకు శక్తివంతమైన ప్రతినిధిగా ఎదిగి వచ్చిన నరేంద్ర మోడీ ఆ పరివారానికి కంటగింపుగా ఉన్న గాంధీని లోగో చేసుకోవడం కొంతమందికి వైరుధ్యంగా కనిపించవచ్చు. అందుకని ఇది రాజకీయ అవకాశవాద ఎత్తుగడ అని కూడా అనుకోవచ్చు. మోడీ రాజకీయ పూర్వీకులు గాంధీ శరీరంలోకి బులెట్లు దించి ఆయనను "అమరుడ్ని" చేస్తే ఇప్పుడాయన గాంధీ బొమ్మను దేశమంతా, ఇంకా చెప్పాలంటే ప్రపంచమంతా ఊరేగిస్తున్నాడు. స్వయంగా గాంధీ అనువదించిన భగవద్గీతను ఒబామాకు బహూకరించి వచ్చాడు. మొత్తం మీద దేశీయ ఆలోచనల్ని నియంత్రించే జాతిపితను ప్రతిష్టించడంలోనూ, భక్తి ప్రచారం చేయడంలోనూ కాంగ్రెస్‌కు ధీటుగానే హిందుత్వ పరివారం శ్రమపడుతోంది. అయితే ఇందులో వైరుధ్యం లేదు. సంఘపరివార్ హిందూ జాతీయవాదానికి, గాంధీకి వైరుధ్యం లేదనే విషయాన్ని కొందరు భారత వామపక్ష మేధావులకన్నా మోడీ బాగా అర్ధం చేసుకున్నాడు.

బంకించంద్ర చటర్జీనో, సావర్కరో హిందూ జాతీయవాదానికి బీజం వేసి ఉండవచ్చు గాని గాంధీ దానిని ఎంతగా పాపులర్ చేశాడంటే అది అన్ని స్థాయిల్లోనూ సాఫ్ట్ హిందుత్వగా భారతదేశ ఆలోచనావిధానంలో జీర్ణించుకుపోయిందని ఇటీవల విడుదలైన "ది ఇండియన్ ఐడియాలజీ" పుస్తకంలో పెరి ఆండర్‌సన్ విశ్లేషించాడు. లౌకికవాదాన్ని మూలాల నుండి భ్రష్టుపట్టించిన కాంగ్రెస్ దొంగ సెక్యులర్ నాటకాలతో మోసపోవడం కన్నా నేరుగా కరడుగట్టిన ఫాసిస్టు శక్తులతో తలపడటంలో స్పష్టత ఉంటుందని, ఎప్పటికైనా ఆ చివరకు చేరడం తప్పదని అంటాడాయన.

ఇప్పుడు బిజేపీ లౌకికవాదం గురించి మాట్లాడుతోంది. లౌకికవాదం హిందూ మతంలోనే అంతర్భాగంగా ఉందని చెప్పిన గాంధీగాక వాళ్ళకు ఇంకెవరు బాగా పనికొస్తారు? చరిత్రను, శాస్త్రాలను తమకిష్టం వచ్చినట్లు వ్యాఖ్యానించుకోడానికి మతం వెసులుబాటునిస్తుంది. బ్రిటీష్ వాళ్ళు రాకముందే, వేల సంవత్సరాల క్రితమే భారతదేశమంతా ఒకే జాతిగా ఉందన్నాడు గాంధీ. రామరాజ్యం గురించి కలలు కన్నాడు. హిట్లర్‌ను ఆరాధించాడు. కులవ్యవస్థ హిందూ సమాజ ఔన్నత్యాన్ని కాపాడుతున్నదన్నాడు. భారతదేశంలో సనాతన కాలం నుండీ ఒక అద్వితీయమైన ఏకత ఉందని నెహ్రూ కూడా అంటాడు. ఊహాజనిత సత్యం, సనాతన ధర్మం కలిపి చిర కాలం ఉపకరించేలా ఒక సిద్ధాంతాన్ని భారత పాలకవర్గాలకు గాంధీ తయారుచేసి ఇచ్చాడు. అనాటి బ్రిటీష్ సామ్రాజ్యవాదుల నుంచి ఈనాటి హిందుత్వ పాలకుల వరకూ అందరికీ ఉపయోగపడే విగ్రహం అది.

తరచి చూస్తే మోడీ తీసుకున్న విగ్రహ మూర్తులు ఇద్దరూ గుజరాత్ వ్యాపార, భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తూ జాతీయోద్యమం తెరమీదికి వచ్చారు. గాంధీ ఎట్లైతే రైతాంగ, కార్మిక ఉద్యమాలను నీరుగార్చాడో, పటేల్ అట్లా విచ్ఛిన్నం చేశాడు. జాతీయ సమైక్యతాదినంగా ప్రకటించిన వల్లభాయ్ పటేల్ పుట్టిన రోజు సందర్భంగా పత్రికలు, మీడియా ఇండియన్ యూనియన్ 562 సంస్థానాలను విలీనం చేసుకోవడం వెనక ఆయన చొరవను వీరగాథగా ప్రస్తుతించాయి.

అక్కడితో ఆగలేదు. ఉదారవాది అయిన నెహ్రూ స్థానంలో పటేల్ ప్రధానమంత్రి అయి ఉంటే భారతదేశ స్వరూపమే వేరుగా ఉండేదన్నాయి. నిజమే కావొచ్చు. కనీసం భారతదేశంలో వామపక్షాలకయినా నెహ్రూ సోషలిజం భ్రమలు ఉండకపోవునేమో. అదట్లా ఉంచి జాతీయ సమైక్యత అన్నప్పుడు ఎవరికైనా సమైక్యాంధ్ర ఉద్యమం తళక్కున మెరుస్తుంది. పాలకవర్గాలు సమైక్యత అన్నప్పుడల్లా బలవంతంగా కలుపుకోవడమనేదే సాధారణ అర్ధం. ఆనాడు ఇండియన్ యూనియన్‌లో కలవడమా, పాకిస్తాన్‌లో కలవడమా, స్వతంత్ర్యంగా ఉండటమా నిర్ణయించుకునే స్వేచ్ఛ ఆ సంస్థానాలకు ఉండిరది. నయానో భయానో బలహీనులను లొంగిపోయేలా చేసి, కాదన్న కశ్మీర్, హైదరాబాద్, జునాగఢ్ సంస్థానాలను బలవంతంగా ఆక్రమించుకున్న ఉక్కు మనిషి దేశభక్తికి, జాతి సమైక్యతకు ప్రతినిధి అయ్యాడు. తమకు అనుకూలంగా ఓట్లు పడతాయనుకున్న జునాగఢ్‌లో ప్లెబిసైట్ నిర్వహించి, అనుకూలంగా లేని కశ్మీర్‌లో ప్లేటు ఫిరాయించిన భారత ప్రభుత్వం ఇప్పటికీ సైన్యంతో జాతి సమైక్యత కోసం కష్టపడుతూనే ఉంది. కశ్మీర్‌నూ, భారత ఈశాన్య

ప్రాంతంలో ఉన్న జాతుల పోరాటాలను అణిచి ఉంచడానికి ఇప్పటికి కొన్ని లక్షల మందిని చంపేసింది ఇండియన్ ఆర్మీ. హైదరాబాద్ సంస్థానంపై సైనిక చర్య అనే దురాక్రమణ యుద్ధం చేసి వేలాది ముస్లింల నెత్తురు పారించారు. కమ్యూనిస్టులపై, వారి ప్రభావంలో ఉన్న గ్రామాలపై ప్రయోగించిన హింసవల్ల ఉక్కుమనిషి పవర్ తెలంగాణ, ఆంధ్రలో కూడా తెలిసిందే. ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్దదయిన సమైక్యతా ప్రతిమ దేశ ప్రజల కళ్ళు చెదిరేలా నిలబడి ఉంది.

అది జాతి గురించి, జాతీయత గురించి మాట్లాడుతుంది. అది అభివృద్ధి గురించీ మాట్లాడుతుంది. రైతుల భూములు, అడవులూ, తీరప్రాంతాలు సులభంగా ఎట్లా అభివృద్ధిలో విలీనం చేయాలో మాట్లాడుతుంది. ఆర్టికల్ 370 గురించి సరికొత్తగా, దేశ సమగ్రత గురించి గట్టిగా మాట్లాడుతుంది.

అందరూ అనుకుంటున్నట్లు అది మోడీ నిర్మించిన విగ్రహం కాదు. దాని శంకుస్థాపన జాతీయోద్యమంలోనే జరిగిపోయింది. గాంధీ మొదలుకొని నిన్నటి వరకు దేశాన్నేలిన కాంగ్రెస్ నాయకుల దాకా దేశమంతా తిరిగి దానికి ఇనుమును సేకరించారు. దానికో ఫినిషింగ్ ఇచ్చాడు మోడీ. సావర్కర్, గోల్వాల్కర్ కన్నా గాంధీని అన్వయించుకోవడంలో ఉన్న సౌకర్యం ఆయనకు తెలిసిపోయింది. అటు సనాతన ధర్మం, గాంధీయిజం సామ్రాజ్యవాద మార్కెట్ తీరాన్ని చేరుకున్నట్లుగా సింబాలిగ్గా ఒబామాకు భగవద్గీత బహూకరించాడు. ఎంత కవితాత్మకంగా ఉందో కదా.

రిపోర్టు:

కామ్రేడ్ ఎం.టి.ఖాన్, కామ్రేడ్ విజయ్‌కుమార్‌ల రాజకీయాచరణను ముందుకు తీసుకుపోదాం వారి స్మరణను అర్థవంతం చేద్దాం

ఇటీవల అమరులైన తొలితరం నక్సల్బరీ విప్లవ మేధావులు కామ్రేడ్ ఎం.టి.ఖాన్, కామ్రేడ్ విజయ్‌కుమార్‌లను స్మరించుకుంటూ నవంబరు 7వ తేదీన హైదరాబాదులోని సారస్వత పరిషత్‌లో విరసం సభ జరిగింది. ఆ ఇరువురి త్యాగ నిరతిని, సమున్నత మానవీయ విలువలను, విప్లవోద్యమ రాజకీయాల పట్ల వారి అచంచల విశ్వాసాన్ని గుర్తుచేసుకున్నది. నవంబరు 7కు చరిత్రలో గొప్ప ప్రాధాన్యత ఉంది. ప్రపంచ కార్మికవర్గ విప్లవం కీలక మలుపు తీసుకున్న రోజు. బోల్షవిక్కులు పెట్రోగ్రాడ్‌లో ప్రభుత్వాన్ని కూలదోసి అధికారాన్ని హస్తగతం చేసుకున్న రోజు. సోవియట్ విప్లవం ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు స్ఫూర్తిని ఇనుమడింపజేసింది. భారత కమ్యూనిస్టు పార్టీ 1925లోనే ఏర్పడినా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతోనే అది స్పష్టమైన పంథా తీసుకుంది. ఆనాటి కమ్యూనిస్టు రాజకీయాల కాలం నుండే కామ్రేడ్ ఎం.టి. ఖాన్ వ్యక్తిత్వం రూపుదిద్దుకుంది. తెలంగాణ ఉద్యమం నాయకత్వ విద్రోహానికి గురైనాక మళ్ళీ భారత విప్లవోద్యమం నక్సల్బరీ వసంత మేఘ గర్జనతో దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను స్వీకరించింది. ఎంటీ ఖాన్ విప్లవ జీవితం ఆ పోరాట కాలంలో వికసించి చివరంటా విస్తరించింది. కామ్రేడ్ విజయ్‌కుమార్. విద్యార్థి దశలో విప్లవ రాజకీయాల్లోకి వచ్చాడు. ఈ ఇద్దరిని నేడు తలచుకోవడం అంటే అటు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సంప్రదాయం నుండి తర్వాత తొలితరం నక్సల్బరీ రాజకీయాల నుండి పెంపొందిన ఆదర్శాలను, విలువలను ఎత్తిపట్టడమే అంటూ సభ ఆ ఇద్దరు కామ్రేడ్స్‌కు జోహార్లు అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించింది.

కా.ఎం.టి. ఖాన్ జీవిత విశేషాలు, ఆయన సహచరుల జ్ఞాపకాలతో విరసం రూపొందించిన "లాల్ ముసాఫిర్" డాక్యుమెంటరీ సీడీని నిఖిలేశ్వర్, ఎం.రంగనాథం ఆవిష్కరించారు. తర్వాత దానిని ప్రదర్శించడం జరిగింది. తదనంతరం వక్తలు ప్రసంగించారు. ఖాన్ సాబ్‌తో కలిసి పిలుపు పత్రికను వెలువరించిన ఎం.రంగనాథం విప్లవ రాజకీయాల పట్ల ఆయన నిబద్ధతను, వ్యవస్థపై రాజీలేని పోరాటాన్ని కొనియాడారు. నిఖిలేశ్వర్, నగ్నముని విద్యుల్లత విజయ్‌కుమార్‌తో తాము కలిసి పనిచేసిన కాలాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రఖ్యాత హిందీ రచయిత లోహితాశ్వ ఎం.టి.ఖాన్ సాహిత్య అభినివేశాన్ని విశ్లేషించారు. ఎం.టి.ఖాన్‌కు ఉర్దూ, పార్సీ, మరాఠీ, తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ప్రావీణ్యం ఉంది. ఆయన ఆర్ట్ క్రిటిక్ కూడా. ప్రముఖ చిత్రకారుడు ఎం.ఎఫ్.హుస్సేన్ ఆయనను కలవడానికి ఒక మీటింగుకు వెతుక్కుంటూ వచ్చిన సన్నివేశాన్ని కా.వివి గుర్తు చేసుకున్నారు. సియాసత్‌లో ఆయన విలువైన రచనల గురించి ఆ పత్రిక ఎడిటర్ జహీర్ అలీఖాన్ మాట్లాడారు. ఆయన మహోన్నత వ్యక్తిత్వాన్ని జ్ఞాపకం చేసుకున్నారు. యునైటెడ్ రైటర్స్ సొసైటీ జనరల్ సెక్రటరీ ఫరీద్ జువాయీ ఎం.టి.ఖాన్‌తో తనకున్న పరిచయాన్ని, అనుభవాలను పంచుకున్నారు. పౌరహక్కుల ఉద్యమంలో ఎం.టి.ఖాన్ కృషిని పౌరహక్కుల సంఘం సురేష్ సభకు వివరించారు. కష్టకాలంలో ఏపిసిఎల్‌సిని ఆయన నడిపించారని, జీవితాంతం పౌరహక్కుల ఉద్యమంలో నడిచారని అన్నారు. మానవ హక్కుల వేదిక జీవన్ కుమార్ ఖాన్‌సాబ్‌తో తనకున్న వ్యక్తిగత పరిచయాన్ని ఆయన పంచిన ప్రేమాభిమానాల్ని తలుచుకున్నారు.

శ్రీకాకుళ ఉద్యమాన్ని తెలంగాణకు, ముఖ్యంగా కరీంనగర్‌కు పరిచయం చేసిన విజయ్‌కుమార్ విప్లవోద్యమం కోసం, విప్లవ సాహిత్యోద్యమ ప్రచారం కోసం ఎన్నో కష్టాలను, రాజ్యం చేతిలో చిత్రహింసలను ఎదుర్కున్న కామ్రేడ్ విజయ్‌కుమార్ విరసం ఆవిర్భావంలోనూ పోషించిన కీలక పాత్రను గురించి కా.వివి మాట్లాడారు. తర్వాతి కాలంలో జర్నలిస్టుగా ఆయన ప్రజా ఉద్యమాల పక్షాన నిలబడ్డాడని, ఎన్‌కౌంటర్ల సందర్భంలోనూ, తీవ్ర నిర్బంధంలోనూ కరీంనగర్ పోయిన ప్రజాసంఘాల కార్యకర్తలకు ఆయన అందించిన సహకారం మర్చిపోలేనిదని గుర్తుచేసుకున్నారు. కా.ఎం.టి.ఖాన్, కా.విజయ్ కుమార్‌లను గుర్తుచేసుకోవడం అంటే వారి రాజకీయాలను గురించి మాట్లాడటమేనని, విప్లవోద్యమ రాజకీయాలను ముందుకు తీసుకుపోవడమే వారి స్మరణను అర్థవంతం చేయడమన్నారు. సభకు అధ్యక్షత వహించిన విరసం కార్యదర్శి వరలక్ష్మి కా.ఎం.టి.ఖాన్ రచనలను, కా.విజయ్‌కుమార్ సంపాదకత్వంలో వెలువడిన విద్యుల్లత సంచికలను, ఆయన జ్ఞాపకాలను మిత్రుల సహకారంతో విరసం రికార్డు చేస్తుందని కొత్త తరానికి వారి స్ఫూర్తిని అందిస్తుందని చెప్తూ ముగించారు. ఈ సభలో కామ్రేడ్ విజయ్‌కుమార్ సహచరి కామ్రేడ్ సవిత, కామ్రేడ్ ఎం.టి. ఖాన్ కుమారులు ఆషీష్‌ఖాన్, అసీంఖాన్‌లు పాల్గొన్నారు.

విప్లవమా నీకు జయము జయమమ్మా

- తంగెళ్ల సుదర్శనం

క్రాంతికార్ జనతన సర్కారు నడిపెరా
భారత ప్రజలకు పోరు మార్గమాయెరా ॥క్రాంతి॥

నక్సల్బరీ నడకనెన్నడాపలేదురా
దేశమంత అడుగులేస్తు కదులుతుండెరా
పీడిత ప్రజల విముక్తి ప్రతినబూనెరా
దోపిడి పాలననంతం జేయబూనెరా ॥క్రాంతి॥

దొర గడీల మెడలు వంచి భూస్వాములనెండగట్టి
పాలెగాళ్ళ ఆటలకు చరమగీతములు పాడి
తాడిత పీడిత జనము ఏకమయ్యెరా
ప్రాణ త్యాగమే ఇరుసుగా సాగుతుండెరా ॥క్రాంతి॥

భూమి భుక్తి విముక్తికై పోరాటం సాగిస్తూ
ముండ్లవనం నరికివేస్తూ విప్లవతోటలు పెంచుతూ
ఎర్రమల్లె తీగెలు పల్లెలనల్లెనురా
ఎర్రకోట మీద ఎర్ర జెండ ఎగురురా ॥క్రాంతి॥

జయము జయము విప్లవమా నీకు జయము జయమమ్మా
భారత ప్రజల స్వప్నమా నీకు జయము జయమమ్మా
వందనమమ్మా నీకు వందనమమ్మా
వేలవేల పీడిత జన వందనమమ్మా

మృత్యుంజయులు

- దామరపల్లి నర్సింహారెడ్డి

దారి దారిలో - పోరుదారిలో...
పోరాట దారిలో - తెలంగాణ పోరులో...
వీర యోధులు - అమరవీరులు
మృతవీరులు - మృత్యుంజయులు
తెలంగాణ భూమి పుత్రులు ॥దారి దారిలో॥

జిల్లా జిల్లాలో - నల్లగొండలో...
ఎర్రగొండలో - పోరుగొండలో...
నిజాం నిరంకుశ పాలనపై - తిరుగుబాటు చేసారో
పల్లె పల్లెలో - వీర తెలంగాణలో
విరబూసిన - వీరజాజులు ॥దారి దారిలో॥

నాగేటి చాళ్లల్లో - విత్తనాలు చల్లి
జిల్లా జిల్లాలో - పోరుగల్లులో
ఓరుగల్లులో - పోరాట ఖిల్లలో
కడివెండిలో - కదనాల పల్లెలో
విసునూరు - దేశ్‌ముఖ్‌లను తరిమికొట్టినారో ॥దారి దారిలో॥

త్యాగాల చిరునామా - బైరాన్‌పల్లి, రేణికుంట
ఏ పల్లెనడిగిన - వీరగాథలు చెప్పెదరూ
ఏ తల్లిని కదిలించిన - కన్నీటి గాథలే
వీర యోధులను - వీర వనితలను
ప్రజల ఆకలి తీర్చుటకై - తెలంగాణ తల్లి కన్నదో
॥దారి దారిలో॥

కత్తుల వంతెన కరీంనగర్ - పోరునగరులో
రజాకార్లపై రణం సాగించిన వీరుడు
గాలిపల్లిలో - గాలి అరిల్వు
తెలంగాణంతటా సుడిగాలై వీచారో
త్యాగధ్వనులై స్ఫూర్తినిచ్చారో ॥దారి దారిలో॥

కొలనుపాకలో - నిప్పులకొలిమై
అపర రాణి రుద్రమ్మ - ఆరుట్ల కమలమ్మ
పాలకుర్తి - పౌరుషాల గడ్డ
భూమి కోసం - భుక్తి కోసం
సాయుధ పోరులో - సమరభేరియై
సాయుధ వీరనారి - చాకలి ఐలమ్మ ॥దారి దారిలో॥

తెలంగాణలో వేలాది మంది
అమరవీరుల రక్తంతో - ఎరుపెక్కినాదో
ప్రతి ఇంటి ముందులో - పువ్వుల చెట్లమై
ఎర్రని మల్లె మొగ్గలై వికసించారో
పసిబిడ్డలుగానూ - మా ఇంట్లో పుట్టారో ॥దారి దారిలో॥

అక్కలు సెల్లెలు అందరూ కలిసి
చీమల దండై కదిలిన వాళ్ళు
ప్రజా తెలంగాణకై ప్రాణమిచ్చినారు
రేపటి తెలంగాణకై - కోటి కలలు కన్నవారు
ఆకుపచ్చని తెలంగాణకై అమరులయ్యారో ॥దారి దారిలో॥

(సెప్టెంబర్ 17, తెలంగాణ విమోచన దినం సందర్భంగా)

తీసేసుకోవడం..

- పాణి

చెట్లు విరగ్గాశాక బరువైనవన్నీ రాలిపోతాయి
ఏరు పొంగాక కట్టలు తెంచుకున్న నీళ్లన్నీ పంట పొలాల్లోకి పారిపోతాయి
ఒక్కొక్క రాత్రికే ఎదిగి వచ్చే వెన్నెల కళలు
అనుభవించే వాళ్ల ఊసుల్లోకి ఇంకిపోతాయి

ఎవరు ఇచ్చారు
ఎవరు తీసుకున్నారు

బంధమంటే ఇవ్వడం, తీసుకోవడమే

తీసేసుకోవడం సులభమేగాని
ఎవరి నుంచి తీసుకున్నామో గుర్తించడం కష్టం
బదులు ఏమిస్తామో హామీ పడటం మరీ కష్టం

* * *

ఈ భాషను ఎవరి నుంచి తీసుకున్నట్టు
ఈ రాత ఎవరు వచ్చి నేర్పించినట్టు
గంభీరమై స్వరంలోంచి
వరదగూడు వలె వికసించే ఈ ఆలాపనకు ఎవరు శిక్షణ ఇచ్చినట్టు
పద పదానికి మేఘాలు పలికినట్టు
ఈ కరతాళ సవ్వడి ఏ గుంపు కళా సిద్ధిలో పొదిగినట్టు

ఇంతకూ నలుగురి మధ్యలోకి ఈ వెలుగుతో ఎలా చేరినట్టు

ఏదో పోగొట్టుకున్నట్టు ఏకరువు పెట్టడం సులభమే
పొందినవి గణించుకోవడమే అనితర సాధ్యం
కొన్ని ఇబ్బందులు, మరి కొన్ని కష్టాలు వంటరిగా రావు
వెంట గుర్తింపును తీసుకొని వస్తాయి
అదే విచిత్రం..!

గడియ నిద్ర కూడా దూరమైపోయిన
ఒక తల్లి అలా నిరీక్షిస్తూనే ఉంటుంది
కలలోనైనా కొడుకు అడుగుల సవ్వడి వినిపిస్తుందని
నుదిటిపై నులి వెచ్చగా స్పృశించే చేయి కూడా ఉండదు
అంతా ఇచ్చేశాక మిగిలిన శూన్యంలో ఆమె అలా..

ఇవ్వడమంటే మాటలు కాదు
వదులుకోవడమంటే చేజేతులా రద్దు చేసుకోవడమే
అందరి మధ్యా ఉంటూ ఎవ్వరికీ కనిపించకుండా పోవడమే
ఇంతకూ ఎవరికి ఎంత ఇస్తాం..
ఎవరి నుంచైనా ఏం తీసుకుంటాం
జీవితమంత ఎడతెగని ప్రశ్న.

మీతో పంచుకోవాలనుందక్కా...

- ఎస్.ఎస్.ఆర్.

అక్కా!
మా బక్క గుండెల్లో రూపమా
మాకు దూరం చేయబడ్డ మా భాగ్యమా
ఆ మాయలోడికి మాచర్ల మాయా బజారయితే
మహబూబ్ నగర్ పాతాళ గుహయ్యింది
మా నుంచి నిన్ను దూరం చేశాడే కాని
నీవు ఎప్పటికీ మా కళ్ళ వెలుగులో
- ప్రతిఫలిస్తూనే ఉంటావు
నిన్ను చూడాలని
ఆ చూపుల్లో మా రోదన పోవాలని
నీతో మాట్లాడాలని
ఆ మాటల్లో మా వేదన మాసి పోవాలని
మళ్ళీ మళ్ళీ కలుద్దామంటూ
నీవు చేయి కలిపితే ఆ చేతి స్పర్శ
మాతృత్వపు మమకారమై
మా గుండె దిగులును తీసివేయాలనుంది
అక్కా మనం మళ్ళీ కలుస్తామనో
ఒకరినొకరం కళ్ళ చూసుకుంటామనో
ఆశయితే లేదు కానీ
అద్భుతమేదయినా జరిగి నీ నోటి మాట వినాలని
తీయని కలకంటే
ఆ కలలోనయినా నీవు వచ్చి
మా కన్నీరు తుడుస్తావని ఆశక్కా
అక్కా..! ఓ మా కామ్రేడా!
నీకో మంచి కబురు చెప్పాలనుంది
మమ్మల్ని బందీలను చేసి
మా బతుకులతో చెర్లాడిన పులి
ఓడిపోయి చేతులెత్తేసింది
మా బతుకుల్లో ఎనిమిది
వసంతాలను మింగిన చట్టం
ఏడుపు మొఖంతో బోనెనక్కి నక్కింది
మీరు వెదజల్లిన ఎర్ర విత్తనాలు
మాకు రక్షణ కవచమయ్యాయి
ఇక్కడ మన విజయపతాకం
ఎగురుతుంటే పులి తన ఆట కట్టి
కాలికింద కప్పలా బెకబెకలాడింది
దాని బెకబెకలింటూ
మేం పకా పకా నవ్వితే

మా కళ్ళల్లో కన్నీళ్ళుబికినయి
ఈ వార్త మీ చెవిన పడాలని
మీరున్న చెరసాల కూలిపోవాలని
మీరు వడి వడిగా అడుగులేస్తూ
మము చేరితే మా ఆనందాన్ని
మీతో పంచుకోవాలనుందక్కా..!

1990 నాటి సారాయి వ్యతిరేక క్యాంపెయిన్ టీమ్‌పై పెట్టిన టాడా కేసు మే, 17, 99న కొట్టివేసిన సందర్భంగా కామ్రేడ్ మహితక్కను గుర్తు చేసుకుంటూ రాసినది. కామ్రేడ్ మహిత గత ఏడాది అనారోగ్యంతో అమరురాలైంది)

2 జూన్ 2014

- వరవరరావు

ఎన్నాళ్ల కల నిజమైంది
నా జ్ఞానంతో మొదలైన కల
నా చైతన్యంతో వికసించిన స్వప్నం
నలభై అయిదేళ్ల ఆకాంక్ష
ప్రజా వెల్లువలో లెనిన్‌ను చూసిన పారవశ్యం

తెలంగాణ కోసమేనా ఈ తెలంగాణ కోసమేనా

ప్రతి ఒక్క యువకుడూ, విద్యార్థీ
ఊరూ పేరూ కూడ
ఎక్కడా చరిత్రకెక్కకుండా పోరాడి
పోలీసు తుపాకి గుండ్లకు గుండెలిచ్చి
అమరులైన ఆశయం

ఏ ఆశలు చెలరేగి అప్పుడే అణగారి
ఆత్మహత్యలు చేసుకున్నారో గానీ
అందరూ దళితులూ బడుగువర్గాలు

వాళ్లు ఏలుకోవాల్సిన తెలంగాణ

ఎవ్వరూ లేరు
కాళోజీ, జయశంకర్, జనార్దన్
విశ్వజ్యోతి, శాస్త్రిగారు, ఎంఆర్ కిషన్
సోషలిస్ట్ యూత్ లీగ్, ఆర్‌విబి శర్మ
నరసింహస్వామి జ్వాల
రెజిడెబ్రె భావాలు, పట్టణ గెరిల్లా యుద్ధం
కాక్‌టెవ్ మాల్టవ్‌లు బ్యారికేడ్లు
ఫ్రెంచి విప్లవ విద్యార్థి ఉద్యమం
పోలీసు స్టేషన్లపై కేంద్ర కార్యాలయాలపై దాడులు
కె.ఎన్, ఎస్.ఎం, చెక్కిళ్ల ఐలయ్య

కొల్లిపర రామనర్సింహరావు

అవును నిజమే తెలంగాణ దగ్గరే
ఆగిపోయేవాళ్లు కాదు

ప్రత్యేక తెలంగాణ నుంచి గెరిల్లా జోన్ నుంచి
ప్రజాస్వామ్య తెలంగాణ దాక రూపకల్పన చేసిన
శ్యాం, మహేశ్, మురళి, కిషన్‌జీ, ఆజాద్
ఆర్‌కె, సోమన్న, పువ్వర్తి అమరులు
ఇంకా పలువురు
ఎవ్వరూ లేరు

బెల్లి లలిత, ఐలన్న, నల్లా వసంత్, సుదర్శన్
రవీందర్ రెడ్డి, కనకాచారి, గంటి ప్రసాదం
ఆకుల భూమయ్య
ఎవ్వరూ లేరు
రాజ్‌భవన్‌లో సరే
పరేడ్ గ్రౌండ్స్‌లోనూ ఎవ్వరూ కనిపించలేదు

పోలిక వలసయితే పోరాటమూ అటువంటిదే
ఫలితమూ అటువంటిదేనా
భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లకు
ఉరికంబాలే తప్ప స్వాతంత్ర్యం లేదా

దళిత హంతకులు నిర్దోషులని చెప్పే
తెలంగాణ తీర్పు?!
చదువడిగిన ఆదివాసీ బడుగు విద్యార్థులను
రస్టికేట్ చేసే హైదరాబాదీ మహిళ
బిఎస్ఎఫ్ కాల్పుల్లో ముగ్గురు ముస్లిం యువకుల మరణం

నిషేధాల తెలంగాణ! నిర్బంధాల తెలంగాణ!
ఆంక్షల తెలంగాణ!
చివరకేదు ఆదివాసీ మండలాలు
కోల్పోయిన తెలంగాణ!

మునిగిపోయే భూభాగం
ఏ రాష్ట్రంలో ఉంటేనేమిటి!?
ఎవరికిపుట్టిన బిడ్డని ఏడ్చేము
అడవి బిడ్డల కోసం

మన సంబురాలు మన తెల్లబట్టలు
మన బుక్కా గులాలు
మన బాణసంచా

అర్ధరాత్రి అంబరాన్ని తాకిన ఉత్సాహం
హుస్సేన్‌సాగర్ ఎక్కిళ్లు పెట్టిన

నెక్లెస్ రోడ్డు సాక్షిగా
రెండు రాష్ట్రాల శాసనసభల ముందరి
తెలంగాణ అమరుల స్థూపం సాక్షిగా

సూరపనేని, బాబూరావు, సముద్రుడు, శాకమూరి
సుగుణ, కౌముది
అంతా అడుగున పడిపోయారా?

ఏదో సిద్ధించిన కొత్తమాయ మనల్ని ఆవరించిందా?
ఎవరి గజ్జెల రవళివే నీవు మంజీర?!
ఎవరి కజ్జల బాష్పధారవే నీవు మంజీర?

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ గురించే మాట్లాడుతున్నం
ప్రజలపై యుద్ధం గ్రీన్‌హంట్ ఆపరేషన్ గురించే మాట్లాడుతున్నం
పచ్చకామర్లు అనడానికి లేదు
మనకిప్పుడు పసుపంటే ఒళ్లుమంట
ఇపుడు ఇది ఒక పార్టీ జెండా అయిపోయింది

నవాబు ముందు సాయెబు గోడకు కొట్టిన
గులాబీ అత్తరు
గుబాళింపులలో మైమరచామా

అభివాదం చేస్తే బదులు లేదు
పరస్పరాలు లేవు ఆదేశాలే
దొరకు దండం పెట్టి వీపు చూపకుండా
వెనక్కి వెనక్కి రావల్సిందే
ఆవేశపడితే వీపు మీద కాదు
కడుపు మీద కొడతారు

భూమి కోసం, నీళ్ల కోసం, వనర్ల కోసం గదా
నీ చదువులు చదివి,
నీ కొలువులు కొలవడానికి కాదు గదా -
తెలంగాణ 'స్వపరిపాలన'లో
సామాన్యుడు ఎక్కడ

'ఈనాడు' సమ్మె నుంచి
స్టూడియో ఎన్ సమ్మె దాకా
పత్రికా స్వాతంత్ర్యం అంటే పాఠకుల స్వాతంత్ర్యం అని
వర్కింగ్ జర్నలిస్టుల స్వాతంత్ర్యమని
ఎన్ని 'నిజాల' కోసం పోరాడాం మనం

గులాబీ భావ స్వాతంత్ర్యం
గులామీ ముళ్లతో హెచ్చరిస్తున్నదా

డిసెంటును రద్దు చేసే చరిత్రా
తెలంగాణ కోసం గుండెల్లో గుండ్లు మోసినవాళ్లను

బహిరంగ సభా వేదికల కింద బాంబులు పెడతామన్నా
తెలంగాణ కోసం లక్షలాది మందిని కదిలించిన వాళ్లను
తెలంగాణ కోసం దప్పు మీద దరువేసిన వాళ్లను
తెలంగాణ కోసం భుజాల మీద జాక్‌ను మోసిన వాళ్లను
ముందొచ్చిన చెవుల్ని మరచిన
వెనుకొచ్చిన కొమ్ముల పాలన

చరిత్ర తెలియడమే ఒక నేరమైపోయింది
ప్రజలు నిర్మించిన చరిత్రలో భాగం కావడం

నిజాం కాలేజి కాంగ్రెస్ తెలంగాణ సభ
తెలంగాణ సాకారంలో సారాన్ని నీరుకార్చింది
రాజ్యసభ ఆఖరిరోజు చర్చ
రాజ్య స్వభావాన్ని దాచలేకపోయింది
వెంకయ్య చంద్రబాబు నాయుడులతో
జైరాం రమేశ్ ముప్పేట వేసుకున్న ముడి
'పోలవరం' లో విప్పాడు
సీతారామ్ ఏచూరి మ్యాచ్ ఫిక్సింగ్ అని జారుకున్నాడు
మన మౌనం అన్నిటికీ అర్ధాంగీకరామైంది

హైదరాబాదు అర్ధ సింహాసనంపై
పోలీసు గవర్నర్ అడుగులకు మడుగులొత్తాలి మనం
పక్కలో బల్లెం - నెత్తిపై కత్తితో
తెలంగాణ ప్రజలు పదేళ్ల పాటు
అగ్నిగుండంలో నడవాలి
ఎవర్ని నమ్ముకుందాం
గుజరాత్ నుంచి ముజఫర్‌నగర్ దాకా
పారిన ముస్లింల రక్తంలో వికసించిన కమలాన్నా?
తెలుగు జాతి ఐక్యతను కాదు
ఐదేళ్లలో మళ్లీ తెలంగాణను
కలిపేసుకుంటానన్న చంద్రబాబునా?

అరవయ్యేళ్లు దగా చేసిన చెయ్యి
పక్షవాతం వచ్చి పడిపోయింది
నెహ్రూ ఇందిరా సోనియాల దాకా నమ్మిన జనం
తెలంగాణ ఇచ్చినా నమ్మనంత విసిగిపోయారు

ఒకే ఒక్కడు హీరో అయితే
విగ్రహానికే కాదు విధానాలకు కాజాలడు
కారులో వాళ్ల నలుగురికే స్థలముంటుంది
నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు
నడవాల్సిన దూరం చాలా ఉంది.

అరెస్టు ఒక అభాస!

- రివేరా

ఒక భగ్నకాలం గురించి
పదేపదే మాట్లాడటం ఏమీ హాయి!
జెండా గుడ్డకు
కత్తిని, ఊపిరి తిత్తిని సమర్పించుకొని
సభకు ముందే నిష్క్రమించడం ఏమీ అనుభవము!

కసికేసి తోమినా
మసిపోని గిన్నెనే దాచుకుంటాం
ఎంతకీ రాని ప్రేమ పిలుపుని
ఎక్కడా లొంగని వయసు నాగుని
డెమొక్రటిక్ అరణ్యంలోని
సంచారుల ఆవిరి అడుగులనే
పదిలపరుచుకుంటాం
ఐనా..కంచె దాటేశాక కథేముంటుంది?
కసిగా ఉమిసిన ఉమ్ము
ఏ ఉష్ణ గదుల్లోనో ఆరిపోవచ్చుగానీ,
కాలే కల మాటేమిటి?

నిజానికి, జరగని సభల్లోనే
సందేశం సూటిగా ఉంటుంది
వెనక్కి తోసేస్తూ,
వ్యాన్‌లోకి విసిరేస్తూ ఉండగానే
సభా వేదిక తయారయిపోతుంది
వాడు వేదికని చుట్టుముడతాడుగానీ,
అప్పటికే సభ అయిపోయింది
ఫుల్ చార్జ్‌తో జనం వెనుదిరుగుతుంటారు.

అరెస్టు ఒక అభాస!!

మాయా తెర వీక్షకులు 2014

- జి. వెంకటకృష్ణ

కాల కాలానికీ ఒక తెర వేలాడి
ఒక దృశ్యాన్ని వెల్చార్చి వెళుతుంది
దృశ్యం లోపలి దృశ్యం
ఏ కాలానికి ఒకటేనని
వీక్షకులకు తెలిసేలోపు
తెర మీద దృశ్యం అదృశ్యమవుతుంది
మళ్లీ ఒక తెర కొత్తగా వెలసి
వీక్షకుల మతికి విస్మృతిని వేలాడదీస్తుంది

మాయా తెర వీక్షకులెప్పుడూ చేపలే
గాలానికి చిక్కామని గాలంలోపడి
గిలగిలలాడుతున్నా తెలియని చేపలు-గాలంలోని జాలమిది
దృశ్యమెప్పుడూ దృశ్యం వెనకలి విషయాన్ని అదృశ్యం చేస్తుంది

మాయా తెర వీక్షకులెపుడూ చిలకలే
మాయగాడు నేర్పిన పాఠాన్ని
పదే పదే వల్లె వేసేటప్పుడు
తాము పంజరంలోనే ఉన్నామని తెలియని చిలకలు
పంజరంలోని ప్రలోభమది
దృశ్యమెపుడూ దాని ముందటి దృశ్యాన్ని అదృశ్యం చేస్తుంది

మాయా తెర వీక్షకులెప్పుడూ ముగ్ధలే
ఓటు యంత్రమ్మీద ఏ మీట నొక్కాలో
తెరమీద నుండీ ఆదేశమందుకున్న
విషయమే గుర్తించలేని మంత్రముగ్ధలే
ఓటులోని చేటువది

దృశ్యమెప్పుడూ మనో దృశ్యాల మీద ఆధిపత్యం చేస్తుంది.

మీతో..

- శాఖమూరి రవి

నేను బాల్యాన్ని

ముడ్డిమీద చెడ్డేసుకోలేని
మురిపాల ధారని
మాసాయిపేట విషాదానికి
తెగిపోయిన చనుబాలకుతిని

నేను బాల్యాన్ని
తొలకరి చినుకుల మట్టివాసనలో
'వానా వానా వల్లప్పంటూ' తిరగాల్సిన అల్లిబిల్లిని
'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్' పరుగు పందెంలో
తెగిపడ్డ రాలిన చుక్కను

నేను బాల్యాన్ని
జ్ఞానవిత్తున్నై
భవిష్యత్ చిత్రాన్ని చెక్కాల్సిన శిల్పిని
శకలాలుగా రాలిపడ్డ శిథిలాన్ని

తప్పెవరిదైతేనేం
తల్లిడిల్లే నా తల్లి పుత్రశోకం ఆపేదెవరు
వల్లకాడైన నా పల్లె దుఃఖాన్ని తీర్చెదెవరు.

కథ

'ఫిర్‌మిలేంగే'

- నేహ

ఉదయం 5:00 గంటలకు నేను, భాస్కర్, శేఖర్ హౌరా రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారమ్ మీద అడుగుపెట్టాం. అప్పటికే నిద్రలేచిన కోల్‌కతా సిటీ జనమంతా ఎవరి పనుల్ల వాళ్లు బిజీ బిజీగా ఉన్నరు. ఎక్కడ చూసినా రోడ్లు నిండిన జనమే! చాయ్, కాఫీలు అమ్మేవాళ్లు, సామాన్లు మోసే కూలీలు, వచ్చే పోయే రైళ్లతో చాల రద్దీగా ఉంది రైలు స్టేషన్. రెండు రోజులు వరుసగా రైల్లో కూచున్నందుకు నా కాళ్లు నీరు పట్టి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేక దిగిన దగ్గరి నుంచీ ఇబ్బంది పెడుతున్నాయి. ఎటూ కదలలేని పరిస్థితిలో ప్లాట్‌ఫారమ్ పైన ఉన్న కూర్చీలో కూర్చుండిపోయాను.

రైలు ప్రయాణం మొదలైనప్పటి నుండి భాస్కర్, శేఖర్‌లను అడుగుతున్నాను. 'మన ప్రయాణం ఎక్కడికి? ఏ ఊరు వెళుతున్నామని?' ఎన్ని సార్లు అడిగినా చెప్పడం లేదు. అది అంతా 'సర్‌ప్రైజు' అంటారు. నాకు మాత్రం ఎక్కడికి పోతున్నమో? ఎందుకు? ఏ పని కోసం పోతున్నమో తెలుసుకోవాలనే కుతూహలం. రెండు రోజులుగా అడిగి అడిగి చివరికు అలసిపోయాను. వాళ్లు చెప్పనందుకు కోపంతో వాళ్లతో మాట్లాడడమే మానేశాను. నేను కూర్చొని ఉన్న పక్క కుర్చిలో శేఖర్ కూర్చుంటూ 'ఏంటమ్మా కోపం తగ్గిందా! లేదా! సరే గాని కోల్‌కతాలో లెమన్ టీ చాలా ఫేమస్, తాగుతావా?' అని నా కోపాన్ని పెంచే జోకులు వేస్తున్నాడు. అంతలోనే మూడు కప్పులు పట్టుకొని భాస్కర్ వచ్చి నా చేతిలో ఒక కప్పు పెడుతూ 'ముందు టీ తాగు రిలీఫ్‌గా ఉంటుంది' అన్నాడు. టీ తాగిన తర్వాత నా మూడ్ తేలికైంది. మారిన నా మూడ్ చూసి భాస్కర్ చిన్నగా చెవిలో మేం పోతున్న పని గురించి గోప్యంగా చెప్పాడు. 'రెండు రోజుల తర్వాతే మన ప్రయాణం ఉంటుంది. అంతవరకు ఇక్కడ కోల్‌కతాలో ఉండాల్సిందే! సాయంత్రం బయటకు పోయి ఏదైనా హోటల్ రూమ్ తీసుకుందాం!' అన్నాడు నడుస్తూ.

ఈలోగా బయటకు పోయిన శేఖర్ తిరిగి వచ్చి 'పదండి వెళ్దాం భాస్కర్' అన్నాడు. మా లగేజ్ అంతా పట్టుకుని బయటకు నడిచాము. కొద్ది దూరంలో తన ఒంటి నిండా వెలుతుర్లు చిమ్మే లైట్లతో నిలబడి చూస్తున్నా హౌరా బ్రిడ్జి, దాని మీద తిరుగుతున్న వాహనాలు, ఇంటికి చేరాలనే పరుగులాంటి నడకతో చీమల దండులా జనం. వారిలో మేం చేరిపోయాం. ముందు నడుస్తున్న శేఖర్ భాస్కర్, నేను అనుసరిస్తున్నాం. పెద్ద పెద్ద రోడ్లు, బిల్డింగులు, రోడ్డుపై నడిచే బస్సులు, టాక్సీలు, ట్రామ్‌లు దాటుతూ జనాన్ని తోసుకుంటూ పట్నవాసుల్లా నడుస్తున్నాం. భాస్కర్ చెయ్యి పట్టుకునే నడుస్తున్నా కానీ నా మనసు నిండా చరిత్రలో చదువుకున్న కలకత్తా వీధులు, శ్రీకాకుళం కొండలు, నక్సల్బరీ పోరాటాలు రీళ్లలా తిరుగుతున్నాయి. విప్లవ పార్టీ పుట్టుక, పెరుగుదల, చారు బాబు వీరోచిత చరిత్రనంతా నెమరువేసుకుంటూ నడుస్తున్నాను. భాస్కర్ సడెన్‌గా అగడంతో నా ఆలోచనలకూ బ్రేకు పడి జనంలోకి వచ్చాను. ఒక హోటల్ ముందు ఆగి శేఖర్ చూస్తున్నాడు. తన వెనకాలే నేను, భాస్కర్ ఆగిపోయాం. 'ఇదే హోటల్' అంటూ శేఖర్ దారితీశాడు. కౌంటర్‌లో ఉన్న రిజిస్టర్ తీసుకొని మా అడ్రస్‌లు రాస్తున్నాడు. కౌంటర్‌లో కూచున్న యువకుడు మా వివరాలు అడుగుతూ నా వంక చూశాడు. 'ఆమె నా చెల్లి, ఆయన మా బావ' అంటూ శేఖర్ హిందీలో ఆ చూపులకు సమాధానంగా చెప్పాడు. వెంటనే ఆ యువకుడు 'తుమారే బహెన్‌కీ కపర్ సింధూర్ సహీ బర్‌నా?' అంటూ ముఖం చిట్లిస్తూ ప్రశ్నించాడు.

'మేము మరాఠి జాతివాళ్లం సింధూర్ సహీ బర్‌తా?' అన్నాడు శేఖర్ సౌమ్యంగా అన్నాడు.

'సచిన్ తెండూల్కర్ కా పత్నీ సింధూర్ లగాతే హైనా' అన్నాడు.

ఆయన మాటలను పట్టించుకోకుండానే మా రూం నంబర్ వెతుక్కుంటూ మేం ముందుకు నడిచాం. సర్వర్ తాళం తీయడంతోనే రూమ్ లోపలికి పోయి అలసటతో కూర్చీలో కూర్చున్నాను.

శేఖర్ నా వాలకం చూసి 'ఆకలిగా ఉందా? అన్నం తిందామా? ఏమిటి బాధపడుతున్నావా? అసలు నేనే మర్చిపోయానురా, బెంగాలీ వాళ్లకు ఆచారాలు కొద్దిగా ఎక్కువే! ముందే నీకు నేను గుర్తు చేయాల్సి ఉండిందిరా. సారీ బాధపడకమ్మా' అన్నాడు శేఖర్. 'పదండి! భోజనం చేసి వద్దాం' అంటూ భాస్కర్ తొందర చేశాడు.

'శేఖర్! నేను బయటకు రాను, మీరు తిని రండి' అన్నాను.

'సరే! నీవు రెస్ట్ తీసుకో' అంటూ వాళ్లు భోజనానికి పోయారు.

ఎన్నో సంవత్సరాలుగా సమాజంలో కొనసాగుతూ ఉన్న సంప్రదాయాలు, ఆచారాలలో ఏదీ మర్చిపోకూడదు. ఈ రోజు నా నుదుట కుంకుమ లేకపోవడంతో హోటల్ వారి దృష్టిలో పడ్డాను. నాపై నాకే క్షణకాలం కోపం కలిగింది. ఆ వెంటనే బాధేసింది. అయినా విప్లవోద్యమ రహస్య జీవితంలో ఇలాంటి మాటలు వినీ వినీ మనసుకు అన్నీ అలవాటు అయిపోయాయి. ఈ కుళ్లిన సమాజంపై చేస్తున్న పోరాటం ఎన్నెన్ని కాలంచెల్లిన సంప్రదాయాలతో పోరాడిల్సి ఉంటుందో!

ఈ లోగా తలుపు కొట్టిన శబ్దంతో లేచి తలుపు తీశాను. శేఖర్, భాస్కర్లు లోపలికి వస్తూ 'నిద్రపోయావా? టేబుల్‌పై అన్నం పార్సిల్ ఉంది, తిను! ఉదయమే మన ప్రయాణం' అన్నారు. భాస్కర్ తన బేబు నుండి తీసిన సింధూర్ డబ్బా నా చేతిలో పెట్టాడు.

* * *

ఉదయం రూం ఖాళీ చేసి బస్టాండుకు పోయి టికెట్ కౌంటర్ వద్ద కూర్చున్నాం. పరిచయం ఉన్న ఒక వ్యక్తి వచ్చి శేఖర్‌ను పలకరించాడు. శేఖర్ నవ్వుతూ, మా వైపు తిరిగి మమ్మల్ని ఆయనకు పరిచయం చేస్తూ 'భాస్కర్, లత' అన్నాడు, ఈ ఇద్దరూ కూడా మనతో వస్తారు అంటూ పరిచయం పూర్తి చేశాడు. వచ్చిన వ్యక్తి తన పేరు ప్రేమ్‌దాస్ అని చెప్పాడు. అందరం కలిసి మిద్నపూర్ బస్సులో కూర్చున్నాం. భాస్కర్, నేను ఒక సీట్లో, ప్రేమ్‌దాస్, శేఖర్ మా ముందు సీట్లో కూర్చున్నారు. బస్సు కదిలింది. ఇక మా బాధ్యతంతా ప్రేమ్‌దాస్ తీసుకున్నాడు. మధ్యాహ్నం కావస్తూండడంతో బస్సు ఒక హోటల్ వద్ద ఆగింది. అందరం దిగి భోజనాలు ముగించుకోవడంతో తిరిగి బస్సు వెంటనే బయలుదేరింది. సాయంత్రానికల్లా బస్సు మేం దిగాల్సిన ఒక ఊరు చేరింది. ప్రేమ్‌దాస్ వెనుక మేం అందరం బస్సు దిగి కొద్ది దూరం కాలినడకతో వెళ్లి ఊరు చేరుకున్నం. అప్పటికి సమయం రాత్రి 9 గంటలు దాటింది. ఊరంతా నిశ్శబ్దంగా ఉంది. ఊరి చివరికి పోయి ఒక ఇంటి ముందు ఆగిపోయాం. ప్రేమ్‌దాస్ తలుపు తడుతూ 'దీదీ దీదీ' అంటూ పిలిచాడు.

తలుపు తెరిచిన దీదీ 'లోపలికి రండి!' అని ఆహ్వానించింది. 'జల్ కాబే' అంటూ బంగ్లాభాషలో అడిగింది.

దీదీ మాటలు అర్థంకాని భాస్కర్ పక్కనే ఉన్న శేఖర్ ముఖం చూశాడు. ఆ దీదీ మాటలకు జవాబుగా ప్రేమ్‌దాస్ 'జల్ కాబి', 'బాత్ కాబి' (నీళ్లు తాగుతాము, అన్నం కూడా తింటాము) అన్నాడు.

మా ఆకల్ని అర్థం చేసుకున్న దీదీ వంట చేయడం మొదలుపెట్టింది. చలికాలం కావడంతో ఆ ప్రాంతంలో చలి ఎక్కువగానే ఉంది. ఇల్లు వ్యవసాయ కుటుంబంలా ఉంది. ఇంటి దీదీ అప్పటికే పనులన్నీ పూర్తి చేయడంతో ఇంటివాళ్లంతా పెందలాడే తిని పడుకున్నట్లున్నారు. వంట చేస్తూ నాతో బంగ్లాలో ఆమె కబుర్లు మొదలుపెట్టింది. సగం మరాఠి, సగం బంగాలి వేషధారణలో ఉన్న నన్ను గమనిస్తూ 'నామ్ కి దీదీ' అని అడిగింది. బెంగాలి రాని నేను శేఖర్ వైపు చుశాను. 'నీ పేరు అడుగుతుందమ్మా, చెప్పు' అన్నాడు, 'లత' అని చెబుతూ, 'మరి మీ పేరు దీదీ' అని అడిగాను. తన పేరు 'దుర్గాదేవి' అని చెప్పింది. తనకు ఇద్దరు పిల్లలు అంటూ బేల, రవి అని చెప్పి, తన భర్త ఉన్నారనీ చెప్పింది. దీదీకి హిందీ రాదు. కాని నా హిందీ తనకు అర్థమవుతోంది. తన బంగ్లా నాకు కష్టంగానే ఉంది. మా ఇద్దరి కబుర్లు వింటూ మిగతా వాళ్లు కూర్చున్నారు. వంట పూర్తి చేసిన దీదీ అందరినీ భోజనానికి పిలిచింది. నలుగురికి వేడి వేడిగా అన్నం, పప్పు వడ్డించింది. అన్నం తినగానే నాకు మాత్రం నిద్ర ముంచుకు వచ్చింది.

ఉదయం నేను నిద్ర లేచేసరికి దుర్గా దీదీ కూతురు బేల అప్పటికే ఇంటి పనులు చేస్తోంది. మేము బయటకు వచ్చి వాకిట్లో చెట్ల కింద కూర్చున్నాం. అమ్మాయి పనులు చేస్తూనే మాతో హిందీలో మాట్లాడుతున్నది. 'బయటకు రా దీదీ! మా తోట చూద్దువు గానీ!' అంటూ నా చేయి పట్టుకొని బయటకు తీసుకుపోయింది.

దుర్గా దీదీ ఇల్లు మట్టితో కట్టిందే కానీ చాలా శుభ్రంగా ఉంది. నేల సిమెంట్ చేసినట్లుగానే ఉంది. ఇంటి ముందు పెద్ద వాకిలి, పక్కకు మంచి నీళ్ల బావి ఉంది. బావి పక్కనే మారేడు చెట్టు ఉంది. కాయలు తాటి పండు సైజులో ఉన్నాయి. (బెంగాలీలు చాలా ఇష్టంగా మారేడు పండ్ల రసం తాగుతారు. బేలో వృక్ష్ అంటారు). పెరట్లో అలు, క్యారెట్, క్యాబేజి ఉన్నాయి. తోటంతా తిరిగి కూరకు అవసరమైన కూరగాయలు కోసుకొని లోపలికి వచ్చాము. అప్పటికి దుర్గా దీదీ స్నానం పూర్తి చేసుకొని పూజ చేసి బయటకు వచ్చింది. నేను రూంలోకి తొంగి చూశాను. అందులో నిలవెత్తు కలకత్తా కాళీ మాత విగ్రహం ఉంది. నల్లటి రూపం, రక్తవర్ణిత నాలుక బయటకు చాచి, మెడ నుండి కాళ్ల వరకు వేళ్లాడుతున్న పుర్రెల దండ వేసుకొని ఉన్న విగ్రహాన్ని ఒక్కసారిగా చూస్తే భయమేసే విధంగానే ఉంది. గిర్రున వెనక్కి తిరిగి బయటకు వచ్చాను. బయట చెట్టు కింద రాలిన ఆకులు కుప్పగా చేసి మంట పెట్టిన ప్రేమ్‌దాస్, శేఖర్, భాస్కర్లు 'లెమన్ టీ' తయారు చేస్తున్నారు. కప్పులు తీసుకువచ్చిన బేల వాటిలో టీ పోసి అందరికి ఇచ్చింది.

టీ తాగుతూ శేఖర్ నాతో 'మీరిద్దరూ ఇక్కడే ఉండండి! నేను, ప్రేమ్‌దాస్ బయటకు పోయి మనం లోపలికి పోయే ప్లానింగ్ చేసి వస్తాను. తర్వాత అందరం కలిసి పోదాం! దీదీ చాలా మంచిది. భాస్కర్, నీవూ టిఫిన్ చేసి తయారుగా ఉండండి. నేను భోజనానికి తిరిగి వస్తానని' అంటూ శేఖర్ ప్రేమ్‌దాస్‌తో బయటకు వెళ్లిపోయాడు. భాష రాని మేం ఇద్దరం ఒకరి ముఖం ఒకరు చూసుకొని నవ్వుకున్నాం.

శేఖర్ వెళ్లిన తర్వాత భాస్కర్ ఇంటావిడ కొడకు రవి (రబి)ని తీసుకొని పెరట్లోకి పోయాడు. వంట చేస్తున్న దుర్గా దీదీకి పనిలో ఏమైనా సహాయం చేద్దామని నేను వంటింట్లోకి పోయి కూర్చున్నాను. దుర్గా దీదీ చిన్నగా మాటలు కలుపుతూ 'మిమ్మల్ని ఎవరు పంపించారు? బడాదా నా (కిషన్‌జీ) దాదా మా ఊరికి వస్తే మా అందరికి పండగ లాగుంటుంది. చాలా మంచివాడు. మీరు కూడా డికె నుంచి వచ్చినవారేనా? దాదా మాకు అక్కడి పోరాటాల గురించి ఎన్నో విషయాలు చెప్తుంటాడు. మా బెంగాల్ అలా తయారు కావాలని మా అందరి కోరిక! బడా దా వచ్చిన తర్వాతనే చాలా పద్ధతులు నేర్చుకున్నాము. నా భర్త కూడ ముందు నన్ను చాలా ఇబ్బంది పెట్టేవాడు. కష్టపడి సంపాదించిన డబ్బు కల్లు తాగి తగలేసేవాడు. అడిగితే కొట్టేవాడు. బడా దా చాలాసార్లు ఆయన్ని కూర్చోబెట్టి అర్థం చేయించాడు. తర్వాత తనలోన చాలా మేరకు మార్పు వచ్చింది. ఇల్లు కట్టుకొని వ్యవసాయం చేసుకొని మంచిగా బతుకుతున్నాం. బడా దా నా జీవితాన్ని మార్చినట్లుగా ఈ సమాజాన్ని మార్చాలని నా కోరిక. నా భర్త నేను, నా పిల్లలు బడా దా చెప్పిన పార్టీ పనులు చేస్తుంటాం. పార్టే మా ప్రాణం' అంటూ వచ్చిన మాట రాకుండా ఏకధాటిగా ఎంతో ఉత్సాహంగా చెబుతూనే పనిచేస్తోంది. (నాకు రాయడంలో ఉన్న సమస్యతో పూర్తిగా రాయలేకపోతున్నాను. కాని వంట చేస్తున్నంతసేపూ దుర్గా దీ ఎన్ని సార్లు బడాదాను గుర్తు చేసిందో లెక్కలేదు) వారి కుటుంబమంతా ఎప్పుడూ పార్టీ పనులు చేయడానికి తయారుగా ఉంటుందని చెప్పింది. ఆ సమయంలో ఆమె భర్త పార్టీ పనులపై వెళ్లాడని చెప్పింది. మమ్మల్ని తీసుకొని

వచ్చిన ప్రేమ్‌దాస్ కూడా వాళ్ల బావ గారి కొడుకే అని నాన్‌స్టాప్‌గా మాట్లాడుతూనే ఉంది. దుర్గా దీ మాటల ద్వారా 'బడా దా'ను చూడాలనే కుతూహలం నాలో మరింత పెరిగింది.

పెరట్లో నుండి లోపలికి వచ్చిన బాస్కర్ 'టిఫిన్ అయిందా! ఆకలి దంచుతోంది. దుర్గా దీదీని అడిగి చూడు లత' అన్నాడు, దీదీకి హిందీ రాదు. నాకు బంగ్లా రాదు. వంట అయితే తయారు చేసింది. కాని పెట్టడం లేదు. ఎందుకో మాకు అర్థం కావడం లేదు. బెంగాలిలో ఆమె ఏమో అంటోంది. కాని మాకు అర్థం కావడం లేదు. సమయానికి శేఖర్ కూడా లేరు. ఏమి చేయాలి అనుకుంటూ ఉన్నాం.

దుర్గా దీ నాకు బట్టలు, సబ్బు ఇచ్చింది. అప్పుడు మా ఇద్దరికి అర్థమైంది. అంటే స్నానం చేస్తే కాని టీఫిన్ దొరకదని బంగ్లాలో చెప్పిందేమో అనుకుని ఇద్దరం వెంటనే సాన్నం చేసి వచ్చి కూర్చున్నాం. మా ఇద్దరి ముందు ప్లేట్ నిండా మూడి (మరమురలు) పెట్టింది. పక్కకు పెద్ద చెంబుతో మంచి నీళ్లు. ఆలు చొక్క (ఆలుగడ్డలు, ఉడికించి పొట్టు తీసి ఉల్లిగడ్డలు, పచ్చి మిర్చి, కొత్తిమిరతో కలిపి పిసికి చేసిన ముద్ద) పెట్టింది. చాలా ఆకలితో ఉన్న భాస్కర్ ముడి నోట్లో పోసుకొని ఆలు చొక్క నంజుకుంటున్నాడు. నాకు మాత్రం అవి తినడం అంటే పొడి పొడి ముడి, చప్పచప్పగా ఆలు చొక్క సమస్యగానే ఉంది. భాస్కర్ ముఖం చూస్తున్నాను. 'ఏమో బాబు, ఈ బంగాలీ తిండి' అని మనసులో అన్పించిన మాటలు ఆయనతో బయటకే అనేశాను.

అంతలో దుర్గా దీ వచ్చి మా పరిస్థితి చూసి నవ్వింది. ఆమె ఒక ప్లేట్ తెచ్చుకొని మాతో పాటు కూర్చొని మూడిలో మంచినీళ్లు పోసి అంతా ఒకసారి పైపై కడిగి మూడిని ముద్దగా చేసి హాయిగా తిన్నది. ఆ తినడం చూసిన మేం ఇద్దరం వెంటనే ప్రజలే గురువులనుకుంటూ ఫాలో అయ్యాం.

మధ్యాహ్నం శేఖర్ వచ్చిన తర్వాత దుర్గా దీదీ మా తిండి గోసంతా చెప్పుకుంటూ పడి పడి నవ్వింది. 'ముందు మా ప్రాంతం వచ్చిన బడాదా కూడా ఇలాగే ఇబ్బంది పడ్డాడు. కాని ఇప్పుడు చూడు మాలో ఒకడిలా కలిసిపోయాడు. చిన్న చిన్న విషయాలు కూడా నేర్చుకున్నాడు. ఆయన బెంగాలి మనిషి కాదు అంటే ఎవ్వరూ నమ్మరు. మా తిండి, మా భాష, మా ఆచారాలు అన్ని అలవాటు చేసుకున్నాడు.' అలా చెబుతూనే లోపలికి పోయింది.

భాస్కర్ నవ్వుకుంటూ శేఖర్ వద్దకు పోయాడు. ఆయన వెనుకనే నేనూ పోయి శేఖర్ బడాదా ఎవరు మీకు తెలుసా? ఎక్కడి వ్యక్తి అని అడిగాను. మధ్యలో భాస్కర్ కలుగజేసుకొని 'ఆయన మన కామ్రేడ్! నీవు ఆయన్నే కలువబోతున్నవు ఓపిక పట్టు కొద్దిగా! ఎందుకు అంత తొందర!' అన్నాడు. ఎందుకో కాని నాకు తెలియకుండానే అప్పటికే నా మనసులో ఆయన్ని చూడాలనే బలమైన కోరిక కూర్చుండిపోయింది. దుర్గా దీ మాటల్లో ఆయన్ని ఎన్ని సార్లు చూశానో!

రెండు రోజుల తర్వాత మళ్లీ ప్రయాణం. దుర్గా దీ, ఆమె పిల్లలతో మేం సెలవు తీసుకొని రోడ్డు వైపు నడిచాం. చాలా దూరం వరకు దుర్గా దీ వచ్చి సాగనంపింది. అంతలోనే ఓ మినీ బస్సు వచ్చింది. అందులోకి కష్టంగా ఎక్కి రెండు గంటల తర్వాత దిగిపోయాం. 'మనల్ని తీసుకుపోవడానికి మనవాళ్లు ఇక్కడికే వస్తారు. ఆ లోపు ఏమైనా తీసుకుంటారా' అన్నాడు ప్రేమ్‌దాస్. 'వద్దులే' అన్నాడు భాస్కర్. 'ఊరికి పోతున్నం కదా బడా దా ఎప్పుడు ఈ ఊరికి వెళ్లినా చిన్న పిల్లలకు స్వీట్లు తీసుకుపోతాడు. అందుకే అడిగి గుర్తు చేశాను' అన్నాడు ప్రేమ్‌దాస్. అది విన్న భాస్కర్ 'సరే! అయితే నీవే వెళ్లి ఏమైనా తెస్తే బాగుంటుందని' అంటూ ప్రేమ్‌దాస్‌ను పంపించాడు. ప్రేమ్‌దాస్ వెళ్లి రెండు బాక్సుల రసగుల్లాలు తీసుకొని వచ్చాడు. (రసగుల్ల అంటే బెంగాలీలకు పరమ ఇష్టం) అందరం ఒక దగ్గర ఉండకుండా నేను భాస్కర్, శేఖర్, ప్రేమ్‌దాస్ అటూ ఇటూ తిరుగుతూ మూడు గంటలు గడిపాం. తర్వాత ఇద్దరు మనుషులు మోటార్ సైకిల్‌పై వచ్చి ప్రేమ్‌దాస్‌ను కలిసి మాట్లాడారు. మరో మోటార్ సైకిల్ తీసుకొచ్చి మమ్మల్ని లోపలికి తీసుకుపోయారు. దాదాపు నాలుగు గంటల ప్రయాణం తర్వాత మా గమ్యం చేరుకున్నాం.

ఊరిలోకి సాయంత్రం చేరుకున్న మాకు ఊరి ప్రజలు 'లాల్‌సలామ్, జోహార్' అంటూ చేతులు కలిపి పలకరించారు. ఊరంతా పార్టీకి అనుకూలంగానే ఉంది. మమ్మల్ని ఒక ఇంట్లోకి తీసుకుపోయారు. కుటుంబం అంతా వచ్చి మాకు జోహారు చెప్పి కూర్చున్నారు. శేఖర్ హిందీ, బంగ్లా కలిపి ముచ్చట్లు పెడుతున్నాడు. అంతలోనే చిన్న పిల్లలు వచ్చి మా ముందు గుంపుగా నిలబడి 'బడా దా ఎక్కడ ఉన్నాడు?' అని ప్రశ్నించారు. ప్రేమ్‌దాస్ 'దాదా రాలేదు' అన్నాడు. 'ఎందుకు రాలేదు?' మొన్న చెప్పారు కదా? ఎందుకు రాలేదు' అంటూ పిల్లల గోల. బెంగాలిలో వాళ్లు అడిగేది శేఖర్‌కు అర్థమై నవ్వాడు. భాస్కర్‌కు కంటితో సైగ చేశాడు. కనుసైగ అర్థం చేసుకున్న భాస్కర్ రసగుల్లలు వారికి పంచాడు. అది చూసిన పిల్లలందరూ చాలా సంతోషంగా తీసుకొని తింటూ మళ్లీ అడుగుతున్నారు 'బడా దా ఎప్పుడు వస్తాడు? ఎందుకు రాలేదు' అవేవారి ప్రశ్నలు. ప్రేమ్‌దాస్ అందిరిని బయటకు తీసుకొని పోయాడు. ఆ రాత్రి ఆ ఇంట్లోనే భోజనం చేసి పక్కనే ఉన్న అడవికి పోయి పడుకొని ఉదయం ఊరికి వచ్చాం. నిన్న మేం ఆగిన ఇంట్లోనే మధ్య వయస్సు ఉన్న ఒక వ్యక్తి చిన్న పిల్లల మధ్య పిల్లల కోడిలాగా కూర్చొని ఉన్నాడు. కొందరు ఆయన మెడ పట్టుకొని, మరి కొందరు ఆయన ఒడిలో కూర్చొని కనబడ్డారు. మమ్మల్ని చూసి మా వద్దకు వచ్చి జోహారు చెప్పారు. 'క్యా కైసాహై' అంటూ పలకరించాడు. తర్వాత కలిసే టిఫిన్ చేశాం. మేం వచ్చిన ప్రోగ్రాం గురించి విని దానికి సంబంధించిన ఏర్పాట్లు చూడాలంటూ మా వద్ద సెలవు తీసుకొని 'ఫిర్ మిలేంగే' అంటూ కదిలాడు. దారి పొడవునా మహిళలు, పిల్లలు ఆయన వెంట పోతున్నారు. మా చూపులు ఆయననే వెంటాడుతున్నాయి. మా చెవుల్లో 'ఫిర్ మిలేంగే' అంటూ చెప్పిన మాటలే పదే పదే వినబడుతున్నాయి. ఫిర్ మిలేంగే! ఫిర్ మిలేంగే....!

(24-11-2011 నాడు సిపిఐ (మావోయిస్టు) పిబిఎం కా. కిషన్‌జీ (మల్లోజుల కోటేశ్వర్లు) అమరత్వం వార్త విన్న క్షణం నుంచి నన్ను వెంటాడుతున్న ఆయన పోరాట తీపి జ్ఞాపకాలకు అక్షర రూపం - ఆయనకే అంకితం)

కొత్త పాలకొండ

- మైనా

గ్రామానికి మూడువైపుల కొండలు. ఆ కొండలు ఒకదానిపై మరొకటి పడినట్లుగా విశాలంగా, రమణీయంగా, పచ్చపచ్చని సోయగాలతో, చెట్లకు, బండలకు అల్లుకున్న పూలతీగలతో, చల్లని చిరుగాలులకు పిట్టల గుంపులు రెక్కలార్చుకుంటూ కుహూ.. కుహూ... అంటూ కిలకిలా రాగాలతో హొయలు పోతున్నాయి. జింకలు, దుప్పులు, ఎలుగుబంట్లూ వేటగాళ్ల కళ్లపడవద్దనుకున్నాయి కావచ్చు... చీమ చిటుక్కుమన్నా చెంగున ఎగిరి మాయమైపోతున్నాయి. కొండల అంచుల మధ్య నుంచి చిన్న ధారతో గలగలపారే జలపాతం. ఈ ప్రకృతిలో పుట్టి పెరిగిన శ్రమజీవులు ఎంతటి స్వేచ్ఛాజీవులో కదా!

గ్రామం అంచున ఉన్న కొండపై నుండి చూస్తే గ్రామానికి ముందు భాగంలో సిసి రోడ్డు నల్లగా 'పైలదిల్లాలో దగాపడ్డ చెల్లి దుఃఖంలా ఉంది'

ఆ గ్రామం పేరు 'కొత్తపాలకొండ'. పేరుకు తగ్గట్టుగానే దండకారుణ్య ఆదివాసీ ప్రజలందరి వలె ఈ గ్రామ ప్రజలు స్నేహశీలురు. సాహస వీరులు. అన్యాయాన్ని సహించరు. గుండె ధైర్యం గల, పాల మనస్సున్న ప్రజలు.

కొత్తపాలకొండకు 25 ఏళ్ల ఉద్యమ చరిత్ర ఉంది. విప్లవోద్యమం దండకారణ్యంలో ప్రజా సంఘాలను నిర్మిస్తూ ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పోరాటాలు చేపడుతూ దక్షిణ బస్తర్ నుండి మాడ్, ఉత్తర బస్తర్ వైపు విస్తరిస్తున్న కాలం నుండి ఈ గ్రామం విప్లవకారులు, సంఘ నాయకులు ఆధారపడ్డ గ్రామాల్లో ఒకటి. ఇందులో వంద ఇళ్లు వున్నాయి. చుట్టుపక్కల 10,15 గ్రామాలను కూడా నడిపించే శక్తియుక్తులున్న యువత వున్న గ్రామం ఇది.

గ్రామం అంచున వున్న ఒక కొండ పైన విశాలమైన బండ పరువుతో కూడిన మైదానం ఉంది. అక్కడ వడిసె చెట్లు, వెదురు, బండలు లేని చోట గుంపుగా పెరిగి అక్కడొక గుంపు ఇక్కడొక్క గుంపులా చెట్ల పొదలున్నాయి. ఏపుగా పెరిగిన అమెరికా పొదల (గబ్బిలే రొట్ట) ఉంది. వెదురు పొదల మొదట్లో ఉన్న బండపై కూర్చున్న బుద్రామ్‌కు వెదురు కొయ్యలా మెదడు అంతా ప్రశ్నలతో వేడెక్కిపోతోంది. దాన్ని చల్లబరిచేందుకు జేబులో పొగాకు పొట్లం విప్పి కొంత ఎడమ అరచేతిలో దులుపుకున్నాడు. ఆ తరువాత చిన్న సున్నం దబ్బాలో నుంచి కొంత సున్నం తీసి పొగాకు ఉన్న చేతిలో వేసి దబ్బాకు గట్టిగా మూత పెట్టి సున్నం, పొగాకు (గోటా) గట్టిగా నలుపుతున్నాడు. తన ఆలోచనలు కూడా ఆ సున్నం పొగాకును కలిపినట్టే మనసునూ సల్పుతున్నాయి. సున్నం, పొగాకు బాగా కల్సిందనుకొన్న తరువాత నోట్లో బుగ్గకు పెట్టుకున్నాడు. మనస్సు కొంత తేలిక అయ్యింది. అటు ఇటు ఒక్కసారి చూసి ఉమ్మేసినాడు.

లేచి నిలబడి రోడ్డు వైపు, గ్రామం వైపు చూశాడు.

'బుద్రామ్... ఓయ్! బుద్రామ్...' అంటూ కేకలు వేస్తూ ఊరాలు వచ్చాడు.

ఏందిరా! వూరాలు అంటూ జవాబుగా పలకరించాడు బుద్రామ్.

మన సెంట్రీ ఉన్న మిలిషియా వాళ్లు కబురు పంపించారు. పోలీసులు మన గ్రామం వైపు వస్తున్నారట!

'అc! అలాగా... ఐతే మనం పోయి మిలీషియాతో కలిసి పోలీసులు వచ్చేదారిలో మాటు కాద్దాం పదా' అంటూ తను బండపై కూర్చున్నప్పుడు కిందవేసుకున్న టవల్‌ను తీసుకొని దులిపి భుజంపై వేసుకున్నాడు.

ఊరాలు ముందు, వెనుక బుద్రామ్ వడి వడిగా నడుస్తూ పోలీసులు వాళ్ల గ్రామానికి వచ్చే మార్గం (బాటలేని అడవి మార్గం) దగ్గరకు చేరుకున్నారు.

అప్పటికే మిలీషియాలో 20 మంది యువతీ యువకులు ఆ ఏరియా అంతా కవర్లు చూసుకొని కూర్చున్నారు. ఒక గంట అయినా శత్రువు రాలేదు. బుద్రామ్ చెక్ చేసి రమ్మని ఒక టీమ్‌ను ముందుకు పంపించాడు. ఆ బ్యాచ్ ఒక అరగంట తరువాత వచ్చి. '...ఇటే వచ్చినట్లు వచ్చి మళ్లీ స్టేషన్‌కు వాపస్ వెళ్లిపోయారు పోలీసులు' అని కబురు చెప్పారు.

'సరే పోదాం. అయితే అన్నం తిని తిరగి జమ అవుదాము. గొడ్లు ఇంటికొచ్చే వేళ అయింది. వాటిని కట్టేయాలి కదా! పోదామా' అంటూ ఒకసారి అడిగాడు బుద్రామ్.

'ఆc! పోదాం. అన్నం తిని మనం కలుసుకునే జాగా దగ్గరకు వద్దాము' అంటూ జోగాల్ అందుకున్నాడు. అందరూ ఇళ్ల బాట పట్టారు.

ఇంటి దగ్గర గొడ్లు కట్టేసి అన్నం తిని తన చద్దరు, జిల్ల జోరలో వేసుకొని విల్లు కాడీలు, ఒక కస్సిర్ (కత్తి) తీసుకొని బుద్రామ్ అందరూ జమ అయ్యే దగ్గరకు చేరుకున్నాడు.

టార్చిలైటు చేతిలో ఉంది కాని వెలిగించడం లేదు. 'నైట్ ఈజ్ నైట్ ఎనిమి' అనేదాన్ని అక్షరాలా పాటిస్తున్నారు ఆ గ్రామస్థులు. నోటి శబ్దంలా సిగ్నల్స్‌తో అందరూ కలుసుకున్నారు. మరికొంత సేఫ్టీ జాగాను ఎంచుకొని సెంట్రీలు రెండు పెట్టుకొని 50 మంది యువతీ, యువకులు పడుకున్నారు. పగలంతా పొలం పనులు, శత్రువు దాడులతో అలసిపోయి వున్నారు. పడుకున్న వెంటనే అడవి తల్లి ఒడిలో గాఢ నిద్రలోకి జారుకున్నారు. కానీ బుద్రామ్‌కు నిద్ర రావడం లేదు. తను గ్రామం గురించి, ప్రజల గురించి ఆలోచిస్తున్నాడు.

తమ గ్రామంలోని చాలా మంది మెట్ట ప్రాంతం (దంతేవాడ) నుండి భూమి కోసం వచ్చారు. అప్పుడు సంగం, పార్టీ గురించి ఏమీ తెలియదు. బుద్రామ్‌కు 15 ఏళ్ల వయస్సు వుండవచ్చు

తల్లిదండ్రులతో తన దళం దగ్గరకు రావడం, పాటలు వినడం చేసేవాడు. మెట్ట నుండి భూమి కోసం వచ్చారు కనుక గ్రామంలో వుండే సియాన్‌లు (పెద్ద మనుషులు) డబ్బులు, మేకలు, కోళ్లు, కల్లు తీసుకొని కొంత భూమి చూయించి వ్యవసాయం చేసుకోమని చెప్పారు. అది అంతా రాళ్లు, వర్రెలు, సౌడు భూమి అయినా కనీసం కోలా అయినా పండించుకోవచ్చుని ఆరేళ్లు ఎంతో శ్రమ చేస్తే ఒక్క తీరుగా అయ్యింది భూమి. ఇలా చదును చేసుకుంటున్న సమయంలో ఫారెస్టు గార్డు వచ్చి 'అడవి నరికిండ్రు, కేసు పెడతాను' అని బెదిరించాడు.

ఊరి పెద్ద మనుషులు వీళ్లందరి వద్ద మేకలు, కోళ్లు, కల్లు వగైరా వసూలు చేసి గార్డుకు కొంత, తాము కొంత పంచుకుని తినేవాళ్లు. ప్రజలు తమకు తిండి వున్నా లేకున్నా మామూళ్లు ఇవ్వాల్సిందే. ఇవ్వలేమంటే భూమి దొరకదు. ఫారెస్టు వాళ్లు అరెస్టు చేసి జైల్లో పెడతారని బెదిరించేవాళ్లు.

అలాంటి డబ్బుల కోసం తన తల్లి, తండ్రి గ్రామ పెద్దాల్(పటేల్) దగ్గర జీతముంచారు తనను. తనలాంటి పిల్లలు ఇంకా కొద్దిమంది కూడా సియాన్‌ల దగ్గర జీతం వుండి పనిచేస్తూ పెరిగారు. తమ తల్లిదండ్రులు ఆ బీడు భూమి సాగు భూమిగా చేసుకోగా అది రెండు మూడు ఎకరాలకు మించలేదు.

మంచి భూమి నీటి సౌకర్యం వున్నవి ఊరి సియాన్‌లకు (ఒడ్డె లేదా పూజారి) ఉంటుంది. ఒక పక్క ఫారెస్టువాళ్ల బెదిరింపులు, ఫారెస్టు వాళ్ల (పాయికా ప్రభుత్వం) పేరుతో ఊరివాళ్లు కొంత తినుడు... ఇలా ఉన్న రోజుల్లో దళం (దాదాలు) వచ్చింది. అప్పటి నుండి ఫారెస్టువాళ్లు రావడం బంద్ అయ్యింది.

దళ కమాండర్ విజ్జాల్ తన భాషణ్‌లో 'ఈ అడవిలో పుట్టి పెరిగింది మనం. మనకే ఈ అడవిపై అధికారం ఉండాలి, ఫారెస్టు (ప్రభుత్వం) వాళ్లకు భయపడకండి, గార్డులను వస్తే తన్ని తరమండి. జల్, జంగల్, జమీన్ కావాలంటే మనం అంతా సంఘటితం కావాలి. దున్నేవానికే భూమి (వుదుడనోనికే భూమి) మన సంపదలను సామ్రాజ్యవాదులకు, పెట్టుబడిదారులకు ఈ సర్కార్ అమ్ముకొని తింటోంది. మనమేమో భూమి లేక, గుడ్డలు లేక, ఇల్లు లేక పేదరికంతో బతుకుతున్నాం. ఇవి అన్నీ కావాలంటే మనం పోరాడి సాధించుకోవాలి. గ్రామాల్లో సియాన్ (పెద్దలోర్) లోర్ అడవి భూమి జప్తు చేసుకొని (ఆపుతా భూమి) వుంచుకుంటున్నారు. అలా కాకుండా దాన్ని మన సంఘం పరిశీలించి భూమిలేని వాళ్లకు పంచాలి. ఇవి అన్ని జరగాలంటే మనం సంగంలో సంఘటితమయ్యి కొట్లాడాలి' అని బతుకుదెరువు మార్గాన్ని చెప్పాడు.

గ్రామంలో అందరూ ఇల్లు తప్పకుండా డిఎకెఎంఎస్, కెఎంఎస్, బాలల సంఘాలలో ఏదో ఒక సంఘంలో సంఘటితమై ఒక కొత్త ప్రపంచాన్ని (దునియాను) తెల్సుకోవడం మొదలైంది. బస్తర్ గుండాదూర్ పోరాటంలో భూస్వాములు ఎవరు? మహేంద్ర కర్మ, మండి గ్రామ పటేల్ వరకు వారి వర్గ దోపిడి వాళ్లకు రక్షణగా ప్రభుత్వం ఉంది. ప్రభుత్వం, సామ్రాజ్యవాదులు కల్సి పేదల్ని, దేశాన్ని దోచుకుతింటున్నారు. అన్యాయాన్ని ఎదిరించేవాళ్లే నక్సలైట్లు, ప్రజా సంఘాల్లో వుంటూ రాజకీయం, సాంస్కృతిక, ఆర్థిక పోరాటాలతో చైతన్యం పెరిగింది. పార్టీ తమ కోసం, తమలాంటి పేద ప్రజల కోసం వచ్చింది. వాళ్లు తమ కోసం ప్రాణాలు ఇస్తున్నారు.

మేము.. మా భూమి, అడవిపై అధికారం కోసం తప్పక పోరాడాలి. పోరాడితేనే భూమి దక్కుతుందని యువతీ యువకులు నిర్ణయించుకున్నారు.

సంగం బలం పెరిగిన తరువాత గ్రామ పెద్ద మనుషులు తమ అధీనంలో వుంచుకున్న భూమి (అడవి భూమి)ని పేదలకు పంచడం మొదలు పెట్టారు. భూమిలేని పేద కుటుంబాలకు అడవి నరుక్కోమని సంగం భూమిని చూయించింది. ఈ పని 'జంగల్ బచావో' కమిటీ చేసేది. ఇల్లు కట్టుకోవాలన్నా, అడవి నరికాలన్నా జంగల్ బచావో' కమిటీ చేసేది. ఇల్లు కట్టుకోవాలన్నా, అడవి నరికాలన్నా జంగల్ బచావో కమిటీ అనుమతి కావాలి. ఇలా తమకు భూమి, అడవిపై అధికారం దొరికాయి. అలాగే ఆకుల రేట్లు పెంచుకోవడం, అధిక ధరలకు వ్యతిరేకంగా సంతల్లో వ్యాపారస్థుల దోపిడీని కంట్రోల్ చేసేందుకు హాట్ (సంత) కమిటీ పెట్టుకొని ప్రజల్ని తమ ఇష్టం వచ్చిన విధంగా దోపిడీ చేయకుండా కంట్రోలైంది.

మహిళా సంగాల్లో మహిళలు కూడా దోపిడి సమాజం గురించి తెల్సుకున్నారు. బలవంతపు పెళ్లిళ్లకు ఇద్దరు, ముగ్గురు భార్యలను తెచ్చుకోవడానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. తాగుడును కంట్రోల్ చేశారు. ప్రతి పనిలో మహిళలు, పురుషులు కలిసి ఒకరికొకరు సహకరించుకోవడం పెరిగింది. నా ఇల్లు, నా భూమి అని కాకుండా మా ఊరు, మా సంగం, మన భూమి, మన అడవి అనే నూతన చైతన్యం వచ్చింది. మా గ్రామానికి, దీని తరువాత సిఎన్ఎం (చేతనా నాట్యమంచ్) ఏర్పడి ప్రజల్ని రీతి-రివాజ్‌లపై అర్థం చేయిస్తూ అభివృద్ధి నిరోధక సంస్కృతి సామ్రాజ్యవాదులకు, భూస్వాములకు సేవ చేస్తోంది. ప్రజల్ని బానిసలను చేస్తూంది. అందుకే నూతన సంస్కృతి దోపిడికి వ్యతిరేకంగా, మన తరతరాలుగా వస్తున్న అదివాసీ సంస్కృతి నిలబెట్టుతూ కాపాడుకోవాలని, ప్రచారం చేసి మా ఊరే కాదు, ఏరియా అంతా ప్రజల్ని చైతన్యపరుస్తోంది.

బుద్రామ్ ఇవన్నీ గుర్తు చేసుకుంటున్నాడు. ఈ మొత్తంలో ఊరి వూరాలు డిఎకెఎంఎస్ రేంజి కమిటీ సభ్యునిగా ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించేవాడు.

వాడు తనలాగే పేదవాడు. బైలదిల్లా-భాన్సీ ఏరియాలో భూమిలేక వచ్చి సర్పంచ్ ఇంట్లో పదేళ్లు పనిచేసినాడు. వాళ్లకు దున్నుకోను గొడ్లు లేనందుకు సర్పంచ్ గొడ్లు తీసుకుపోతున్నందుకు బదులుగా ఊరాలు సర్పంచ్ ఇంట్లో పనిచేస్తూ ఉండేవాడు. వాడు సంగంలోకి వచ్చాక వానికి బదులుగా వాడు చెల్లి మంగ్లీ సర్పంచ్ ఇంట్లో పనిచేసేది.

తనలాంటి పేద ప్రజల సమస్యలను పార్టీ ఇచ్చిన చైతన్యంతో పరిష్కరిస్తూ మంచి ప్రజానాయకునిగా పేరు తెచ్చుకున్నాడు. ఎప్పుడూ ఎవరో ఒకరు ఇంటి కాడికి వచ్చి పంచ్ చేయ్యాలి... లేకుంటే కుదరదని తీసుకెళ్లేవాళ్లు. కానీ వాడిని బూటకపు ఎన్‌కౌంటర్‌లో పోలీసులు చంపి నక్సలైటును చంపామని ప్రచారం చేశారు. పెద్ద మనుషులు కుట్ర చేసి ఊరాలను శత్రువుకు పట్టించారు. ఆ తరువాత ప్రజా కోర్టు తీర్పు ప్రకారం ఆ ఇన్‌ఫార్మర్‌ను చంపేశారు.

మళ్లీ ఊరాలు జాగలో దూలాల్‌ను ఊరి నుండే రేంజి కమిటీలోకి తీసుకున్నారు. మళ్లీ పనులు విస్తృతంగా నడువసాగాయి.

భూమి శాసనం

- ఎన్. వి. ఎస్. నాగభూషణ్

పాక్షిక ఆధారం: లెనిన్, జాన్‌రీడ్, బొంచ్-బ్రుయేవిచ్‌ల రచనలు

అది 1917 అక్టోబరు 25 వ తేదీ....రష్యా రాజధాని పెట్రోగ్రాడ్ మహానగరంలో ఒక వైపునున్న స్మోల్నీ ఇన్‌స్టిట్యూట్... విద్యుద్దీపాల కాంతితో ధగధగలాడిపోతోంది. దీపాల ధగధగలకు తోడు, జనాల రణగొణులతో అక్కడేదో మహాకార్యం జరుగుతున్నట్లు కనబడుతోంది. రాజభవనాన్ని పోలిన అలంకరణలతో, ఆకాశంలోకి దూసుకెళ్ళినట్లున్న ఉన్నత శిఖరాలతో అలరారే ఆ మూడంతస్థుల మహాసౌధం, ఒకప్పుడు రష్యా దేశంలోనే పేరెన్నికగన్న ఉన్నత కుటుంబాల ఆడపిల్లల చదువు సంధ్యలతో, ఆటపాటలతో అలరారేది. ఇప్పుడో, నూనె జిడ్డు పట్టిన దుస్తులతో, మాసిపోయిన గడ్డాలతో ఉన్న కార్మికులతో, నలిగిన దుస్తులు, చిరిగిన బూట్లతో ఉన్న సైనికులతో, నావికులతో, పొడవాటి జుట్టుతో, బవిరిగడ్డాలతో, మోకాళ్ళ దిగువ దాకా వచ్చే గొర్రె బొచ్చుతోలుతో చేసిన పొడవాటి కోట్లు వేసుకొన్న మోటు మొహం రైతులతో నిండిపోయి ఉంది. మధ్య మధ్య భారీ ట్రక్కులు సైనికుల్ని తీసుకొస్తూ, తీసుకుపోతూ డొక్కు ఇంజన్లు చేసే డబడబ శబ్దాలతో చెవుల్ని గింగిర్లెత్తిస్తూ, సన్నివేశాన్ని మరింత కంగాళీ చేస్తున్నాయి.

ఉన్నకొద్దీ పరిస్థితి మరింత ఉద్రిక్తంగా తయారవుతోంది... ఏదో గొప్ప యుద్ధానికి సిద్ధమవుతున్నట్లు..దానికి ఆ భవనమే కేంద్రమయినట్లు...

నిజానికి యుద్ధానికి సిద్ధం కావడం కాదు, గత 24 గంటలకు పైబడి యుద్ధమే జరుగుతోంది. భవనానికి కొంత దూరంగా, దేశ రాజధాని నగరం పెట్రోగ్రాడ్‌లో.... ప్రభుత్వానికీ, బోల్షివిక్ పార్టీ విప్లవకారులకీ మధ్య... ఉండుండీ... అక్కడోచోట... ఇక్కడొకచోట... తుపాకుల మోతలు... ఫీల్డుగన్‌ల భయంకర శబ్దాలు... ఫిరంగుల భారీ పేలుళ్ళు... అయినా రక్తపాతం తక్కువే. సంప్రదింపులు, సంభాషణలతో ఎదురు కాల్పులు కాస్త ఏకపక్ష విరమణలుగా, ప్రభుత్వ కార్యాలయాలన్నీ, ముఖ్య ప్రదేశాలన్నీ, విప్లవ పక్షానికి స్వాధీనమైపోతున్నాయి. మరో పక్క పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అదుగో పులి అంటే ఇదిగో తోక అన్న చందంగా, విప్లవకారులపై ప్రభుత్వవర్గాల వారు రకరకాల అబద్ధాల్ని ప్రచారం చేస్తున్నారు. తీరా అవి నిజ నిర్ధారణలో తుస్సని తేలిపోతున్నా, ప్రచారకులు తమ పనిమానడం లేదు. ప్రధానమంత్రి కేరెన్స్కీ ఉన్నట్టుండి రాజధాని నగరం నుంచి విదేశీ కారులో, విదేశీ జెండా పట్టుకుని పారిపోయాడు. కొందరు మంత్రుల్ని అరెస్టు చేసారు. అరెస్టయిన మంత్రులు కొందరు చదువురాని విప్లవ పక్ష కుర్ర సైనికుల్ని దబాయించి మరీ విడుదలయ్యారు. మిగిలిన మంత్రులంతా పూర్వం జార్‌లు నివాసముండే శీతాకాల రాజభవనంలో

బుద్రామ్ పడుకున్నాడు అన్నమాటే కాని నిద్ర రావడం లేదు. తమ పంచాయితీలోని ప్రజలందరు ఎంతో అన్యోన్యంగా అన్నదమ్ముల్లా బతుకుతోంటే ప్రభుత్వం తమపై కక్ష సాధింపుతో జీవితాలను అల్లకల్లోలం చేస్తోంది కదా అనుకున్నాడు.

చిమ్మట్ల రొద. సెంట్రీలు బదిలీ అవుతున్నారు కావచ్చు. ఇంకొకర్ని సెంట్రీ కోసం లేపుతున్నారు.

బాతరా! బుద్రామ్ గుడివానియా? (ఏం బుద్రామ్ నిద్రపోలేదా?) అంటూ పలకరించాడు రమేష్.

ఆఁ! ఏమీ లేదు అంటూ ఇంకో పక్కకు తిరిగి దోమలు కుట్టకుండా లుంగీని కాళ్లకు ముఖానికి సరిగా కప్పుకున్నాడు. మళ్లీ గతంలోకి వెళ్లాయి బుద్రామ్ ఆలోచనలు.

గ్రామంలో పంచాయితీ స్థానంలో నాటెనా జనతన సర్కార్ 2500 మందితో గ్రామ సభ జరిగి అందులో సర్కార్ కమిటీని ఎన్నుకున్నారు. దానికి అధ్యక్షుడు సోమ్‌వార్. తొమ్మిది శాఖా కమిటీలతో అన్ని రకాల పనులను చేపట్టాలని కమిటీ నిర్ణయించింది. కమిటీ అధ్యక్షుడు ఏ పనిని చేయాలన్నా ముందుగా ప్రజలతో చర్చించి, కమిటీకి చెప్పి ప్రజల ఆమోదంతో 5 గ్రామాల ప్రజల్ని ఒక కుటుంబలా మార్చేవాడు. ఎవరికి ఎలాంటి అవసరాలు, సహాయం అవసరమో తెల్సుకొని పరిష్కరించేవాడు. ఆ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కూడా జనతన సర్కార్లు ఏర్పడి ప్రజలు తమ సర్కార్‌ను తామే నడుపుకోవడం మొదలైంది. ఇలాంటి సమయంలోనే మహేంద్ర కర్మాల్ సల్వాజుడుం (శాంతి అభియాన్) అభియాన్ మొదలు పెట్టిండు. కుట్రు, కేసురూ, తోయనార్‌లను మాట్లాడుకుందామని పలిపించి సంగం నాయకులు అని కొట్టారు. అరెస్టులు చేయించారు. సుద్రు, బూదులు అల్లెటురా! పట్టుకోండి, కొట్టండి! వాళ్లెవరూ మనల్ని పట్టుకునేవాళ్లు? అంటూ జనాల్ని కర్రలతో (టేంగకు) విల్లుకాడిలతో తిరగబడి కర్మను, కర్మ గూండాలను 2 కి.మీ. తరిమి తరిమి కొట్టినారు. పోలీసుల రక్షణలో మహేంద్ర కర్మ జీబులో కూర్చొని వెళ్లిపోగా, గూండాలు అంతా బతుకు జీవుడా అంటూ పరిగెత్తినారు.

ఈ తిరుగుబాటుకు అక్కడ జమ అయిన ప్రజలంతా మద్దతు ఇచ్చారు. నాయకత్వం 'కొత్తపాలకొండ' వహించింది. ఆ గూండాలు గ్రామాలపై బడి దోచుకున్నారు. మహిళలపై అత్యాచారం చేశారు. ఇళ్లు, ఆస్తులు కాల్చివేశారు. వాళ్లకు రక్షణగా పోలీసులు, సామాన్య జనంపై మానవత్వంలేని ఖాకీలు దాడులు చేశారు. 'ప్రజాస్వామ్యం' చూయించిన '(అ) శాంతి యాత్ర'. అందుకే జనం తిరుగుబాటు చేశారు. దానిలో తమ గ్రామ నాయకత్వం పాత్ర ఉంది. పార్టీ అందించిన చైతన్యం ఉంది. ఇలా ఆలోచిస్తూ ఎప్పుడో తెల్లవారు జామున నిద్రలోకి జారుకున్నాడు బుద్రామ్.

మిలీషియా వాళ్లు చుట్టూ పెట్రోలింగ్ చేసి వచ్చారు.

చేరి రక్షణ పొందుతూ మంతనాలు జరుపుతున్నారు. బయటి నుంచి సైన్యాలు వచ్చి తమను రక్షిస్తాయని ఆశలు పెట్టుకున్నారు. తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధాన కేంద్రం అదే. ప్రస్తుతం ఆ భవనాన్ని, ప్రభుత్వానికి విశ్వాసపాత్రులయిన కేబినెట్ దళాలూ, యుంకర్ దళాలూ (వీరంతా వివిధ సైనిక విభాగాలు), షాక్ బెటాలిన్లుగా ప్రసిద్ధి కెక్కిన మహిళా బెటాలియన్లు, కలిసి వేలాది మంది, అత్యంత పకడ్బందీగా, భయంకర మారణాయుధాల్ని ధరించి, విప్లవకారుల పీచమడుస్తామని డంబాలు పలుకుతూ, దట్టంగా బారికేడ్లు నిర్మించి కాపలాకాస్తున్నారు. వారికి దూరంగా విప్లవ సైనికులు దాడి చేసేందుకు తగిన ఆజ్ఞ కోసం ఎదురు చూస్తూ నిర్లక్ష్యంగా నిలబడ్డారు. వీరికి మరింత దూరంగా వీధి మలుపుల్లో ఏదో ఒక చాటు చూసుకుని, ప్రేక్షక జనం గుంపులుగా జేరి, ఏం జరుగుతుందా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

మధ్య మధ్య భవన పరిరక్షకులు బారికేడ్ల సందుల్లోంచి కాల్పులు జరుపుతూ నిశ్శబ్దాన్ని భంగం చేస్తుంటే, విప్లవ సైనికులు పళ్ళు కొరుకుతూ భవనం వంక కోపంగా చూస్తున్నారు. వారి గుండెల్లో మంటగా ఉంది. ఎప్పుడు ఆ పరిరక్షకుల్ని దునుమాడి, ఆ రాజ సౌధాన్ని ఎంత త్వరగా నేలమట్టం చేసి నాశనం చేద్దామా అన్న కసితో రగిలిపోతున్నారు. తలతరాలుగా జార్ చక్రవర్తులు సాగించిన భయంకర దోపిడీ, అణచివేతలపై పేద జనం ధిక్కారమే ఈ కసికి కారణం.

ఇంత క్రితం వరకూ వీరు తమ కష్టాలకు కారణం రాజోద్యోగులూ, భూస్వాములేనని, జార్ ప్రభువు దయామయుడని నమ్మి, ఆ ప్రభువుని "చిన్నతండ్రి" (దేవుణ్ణి 'పెద్దతండ్రి') గా భావించి, పటాలు పెట్టుకుని మరీ పూజించారు. కానీ, "రక్తసిక్త ఆదివారం" (1905, జనవరి 9) నాడు, వేలాది మంది కార్మికులు, తమని దారుణంగా పీడిస్తున్న పెట్టుబడిదారుల నుండి కాపాడమని విన్నవించుకునేందుకు వస్తే ఈ 'చిన్నతండ్రి', ఇదే రాజభవనం ముందు, తన సైన్యంతో కాల్పులు జరిపించి, రక్తపుటేరులు పారించాడు. అప్పుడు ఈ పేదజనం తమ కష్టాలకు నిజమైన కారణం ఎవరో గ్రహించి, 'ఫిబ్రవరి విప్లవం' (1917, ఫిబ్రవరి) లో అతణ్ణి గద్దె దించారు. అయితే వారి కడగండ్లు తీరుస్తామని వాగ్దానం చేసి గద్దెనెక్కిన రాజీవాద సోషలిస్టులు, స్వార్థబుద్ధితో, బూర్జువాలతో, భూస్వాములతో కుమ్మక్కై, మాయమాటలు చెబుతూ, ఇదే రాజభవనంలో కొలువు తీరారు. వీరి వల్ల మోసపోయిన ఈ పేదజనం, ఇప్పుడా రాజభవనాన్ని నేలమట్టం చేసి, తమ కసిని ఎప్పుడు తీర్చుకుందామా అని ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు. అయితే గంటలు గడుస్తున్నా, ఎంతకీ తమకి అనుమతి రాకపోయే సరికి, "ఎందుకింత ఆలస్యం?" అంటూ గొణుక్కోసాగారు. అయితే ఈ ఆలస్యానికి కారణం ఒక మహోన్నత ఆలోచన, వ్యూహం ఇమిడి ఉన్నాయని వారికి తెలీదు.

స్మోల్నీ ఇన్స్టిట్యూట్... ఆఖరి అంతస్థు... 10 వ నెంబరు గది...తిరుగుబాటుని నడిపిస్తున్న సైనిక విప్లవ కమిటీ కార్యాలయం అక్కడేవుంది. విశాలమైన ఆ గదిలోకి కొందరు వ్యక్తులు పరుగులు పెట్టుకుంటూ వెళ్ళి తిరిగి పరుగులు పెట్టుకుంటూ బయటకు వెళ్ళిపోతున్నారు. వారంతా నగరంలోని వివిధ పోరాట ప్రాంతాల సమాచారాన్ని తీసుకొచ్చి, ఆపై అవసరమైన ఉత్తర్వులు తీసుకు వెళుతున్న కమిస్సార్లు. లోపల సంబంధిత ప్రాంతాల కమిటీ సభ్యులు, ఆ సమాచారాన్ని క్రోడీకరించి, దాన్ని కమిటీ అధ్యక్షుడైన పొద్వోయ్‌స్కీకి అందిస్తే, అతడు దాన్నంతటినీ క్రోడీకరించి ఓ లావాటి పొట్టి వ్యక్తికి అందిస్తున్నాడు. అప్పుడా పొట్టి వ్యక్తి దాన్ని అధ్యయనం చేసి, అవసరమైన ఉత్తర్వులు జారీ చేస్తున్నాడు. నిజానికి ఇదంతా కమిటీ అధ్యక్షుని బాధ్యతల్లో భాగమే. కానీ కమిటీ తన పనిని ప్రారంభించడంలో జాప్యం చేసే సరికి, కమిటీ పని తీరును పర్యవేక్షించాల్సిన ఆ లావాటి పొట్టి వ్యక్తే స్వయంగా ఆ పని చేపట్టాడు. తాను నిద్రాహారాలకు దూరమై పని చేస్తూండటమే గాక, కమిటీ వారి చేత కూడా అలా చేయిస్తున్నాడు. ఇంతకీ ఆ వ్యక్తి ఎవరో కాదు, పార్టీ అధ్యక్షుడూ, ప్రపంచ శ్రామిక జన ప్రియ బాంధవుడూ అయిన లెనినే!

పొద్వోయ్‌స్కీ తన కందించిన సమాచారాన్ని పరిశీలిస్తున్న లెనిన్, తన దృష్టిని గోడ గడియారం వంక మరల్చి, అది చూపిన సమయం చూసి ఉలిక్కిపడ్డాడు. అప్పుడే సాయంకాలం ఏడు గంటలైంది! దాంతో తాను వెంటనే నిర్వర్తించాల్సిన కర్తవ్యం గుర్తొచ్చిందాయనకు.

"కామ్రేడ్ పొద్వోయ్‌స్కీ"

సన్నగా, రివటలా ఉండే సైనిక వ్యూహ రచనా నిపుణుడైన పొద్వోయ్‌స్కీ, చిన్న పిల్లవాడిలా పరిగెత్తుకుంటూ ఆయన ముందు నిలబడ్డాడు. "చెప్పండి కామ్రేడ్..?"

"మనం విజయ యాత్ర సాగిస్తున్నామని తెలుసు గదా?"

"అందుకు సందేహం ఏముంది?"

"చిన్న చిన్న లక్ష్యాల సంగతి అలా ఉంచితే, మిగిలిన ఒకే ఒక పెద్ద లక్ష్యం వింటర్‌పాలెస్....అంతే కదా?"

"అంతే కదా! ఇప్పుడు చిన్నవాటి సంగతి పక్కనబెట్టి, వింటర్ పాలెస్ సంగతి చూద్దామని సెలవా?"

"సరిగ్గా వూహించావు కామ్రేడ్! అందుక్కారణం ఏమిటో కూడా ఊహించి చెప్పగలవా?"

"అందుక్కారణ మంటారా...." బుర్ర గోక్కున్నాడు పొద్వోయ్‌స్కీ

"సరే, నేను చెబుతాను..." లెనిన్ చెప్పడం మొదలుపెట్టాడు.

"మరో రెండు, మూడుగంటల్లో అఖిల రష్యా సోవియట్ల రెండో కాంగ్రెస్ ప్రారంభం అవుతుంది. ఈ లోగా మనం పాలెస్‌పై దాడి ప్రారంభించ గలిగితే, కాంగ్రెస్‌ని మన దారిలోకి వచ్చేట్లు చేసుకోగలం. ఎందుకంటే విపక్షాలు రెండు విధాల నష్టపోయి, తీవ్ర అక్కసుతో ఉన్నాయి.... ఒకటి ప్రభుత్వాధికారాన్నీ, రెండు కాంగ్రెస్‌లో మెజారిటీనీ. ఇప్పుడు ఈ దాడి ...వారు చీలిపోయి, బలహీను లవడానికి గట్టి ఆధారమవుతుంది. అయితే ఈ దాడి విషయంలో మన సైన్యాలు రెండు షరతుల్ని విధిగా పాటించాలి..."

"షరతులా...అవేమిటి కామ్రేడ్?"

"చెబుతాను...ఒకటి రక్తపాతం అతి తక్కువ స్థాయిలో జరగాలి. రెండు, వింటర్ పాలెస్‌కు గానీ, అందులోని వస్తు సముదాయానికి గానీ ఎలాంటి నష్టం జరక్కూడదు..."

ఈ రెండో షరతు వినేసరికి, పొద్వోయ్‌స్కీ అయోమయంలో పడ్డాడు. "మొదటిది సరే కామ్రేడ్. కానీ ఈ రెండోది ఏమిటి? అసలే మనవాళ్ళు పిచ్చి కోసంతో రగిలిపోతున్నారు....పాలెస్‌ని ఎప్పుడు నేల మట్టం చేద్దామా అని ఉవ్విళ్ళూరుతున్నారు..." చివరి మాటల్ని మింగేసాడు పొద్వోయ్‌స్కీ

లెనిన్ అతని వాలకాన్ని చూసి, చిరునవ్వు నవ్వాడు. "నాకు తెలుసు కామ్రేడ్...మనవారు ఏం చేద్దామనుకుంటున్నదీ. అందుకే ఈ విషయంలో మీకు మరీ మరీ చెబుతున్నాను. ముందు మనం కమిస్సార్లని సిద్ధం చెయ్యాలి. అలాగే కమాండర్లని బాధ్యుల్ని చేయ్యాలి. ముఖ్యంగా రెడ్‌గార్డులు చురుగ్గా వ్యవహరించాలి. ఎందుకంటే, పాలెస్ పేదల చెమటా, నెత్తురుతో నిర్మించబడింది. అలాగే వారి నెత్తుటి వరద పారింది దాని ముందు. ఈ పాలెస్ భవిష్యత్తరాలకు సాక్షిగా నిలబడాలి! దాని వందలాది గదులు సమాజానికి ఉపయోగపడాలి! ఆ పాలెస్‌లో ఎన్నో కళాత్మక వస్తువులూ, ప్రభుత్వపత్రాలూ, రికార్డులూ వగైరా విలువైనవెన్నో ఉన్నాయి. చారిత్రకంగా వాటి ఉపయోగం ఎంతో ఉంది. అవన్నీ మన దేశ వారసత్వ సంపద! వాటిని కాపాడటం మన కర్తవ్యం..."

"అద్భుతం కామ్రేడ్.... మీ ఆలోచన మహాద్భుతం! మీ షరతులు తు.చ. తప్పకుండా పాటించేలా చూద్దాం..." లెనిన్ ఆలోచన విని నిజంగానే పొద్వోయ్‌స్కీ ఆనందంతో ఉబ్బిపోయాడు.

"ఇప్పుడు మొదటి షరతు ఎలా అమలు చెయ్యాలో చూద్దాం. పాలెస్ పరిరక్షణకు ఉపయోగిస్తున్న దళాలన్నీ తాత్కాలిక ప్రభుత్వానికి విశ్వాసపాత్రమైనవి. వారంతా మొండి ఘటాలు. అందువల్ల వారు అమీతుమీకి సిద్ధపడతారు. దాంతో సమయం ఎంతో వృథా అవ్వడమే గాక, రక్తం ఏరులై పారుతుంది. వారికి ఒక అవకాశం ఇద్దాం. అందుకు వారిని అమితంగా భయపెట్టాలి. దాంతో వారు కొద్ది సమయంలోనే లొంగిపోతారు. ఇందుకు రెండు పద్ధతులు పాటించాలి. మొదటిది మన బలాధిక్యతను చూపించాలి. వీలైనంత త్వరగా భారీ సంఖ్యలో సైన్యాల్ని, భారీ ఆయుధాల్ని అక్కడికి చేర్చాలి. ఇదంతా ఈ రాత్రి 9 గంటల్లోపే జరగాలి. రెండోది నెవా నదిపై గల క్రూయిజర్ నౌక 'అరోరా' ఫిరంగితో పాలెస్ పై దాడి చెయ్యాలి. గుర్తుంచుకోండి...ఫిరంగి గుండు డమ్మీదై ఉండాలి. అది బ్రహ్మాండమైన శబ్దం వస్తుంది గానీ, పాలెస్‌కి నష్టం జరగదు. ఆ శబ్దంతో గుండె బేజారై, భవన పరిరక్షకులు లొంగుబాట పడతారు. ఈ ఉత్తర్వులు త్వరగా వెళ్ళాలంటే, మనుష్యుల ద్వారా కన్నా, టెలిఫోన్ ద్వారా, మనం స్వాధీనం చేసుకొన్న ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలకు తెలపండి. ఆ కార్యాలయాల వద్ద కనీస రక్షణ ఉంచి, మిగిలిన వారిని పాలెస్ వద్దకు పంపండి. ఫిరంగి గుండు ఖచ్చితంగా దాడిని సూచించే విధంగా 9-30కి పేలాలి. కానీ గుర్తుంచుకోండి....సమాచారం ఎప్పటికప్పుడు నా కందాలి..."

ఆయన మాటలు పూర్తి కాకుండానే, కమిటీ సభ్యులు స్మోల్నీ లోని సమాచార వ్యవస్థ దగ్గరకు పరుగులు తీసారు.

తెల్లవారుఝాము 3 గంటల సమయం.తెల్లారితే 26 వ తేదీ...

గత కొద్ది రోజులుగా అత్యంత హడావిడిగా ఉన్న స్మోల్నీ ఇన్‌స్టిట్యూట్ ఇప్పుడు ప్రశాంతంగా ఉంది. దాని ఒకానొక పార్శ్వంలో మాత్రం ఏదో సభ జరుగుతున్నట్లు చప్పట్లు, కేకలు, ఈలలు ఉండుండి ఒకసారి లీలగా వినబడుతున్నాయి. అదంతా మొదటి రోజు కాంగ్రెస్ సభ తాలూకు ధ్వనులు. రాత్రి 10-40కి ప్రారంభమైన కాంగ్రెస్ ఇంకా జరుగుతూనే ఉంది.

ఇవేమీ పట్టనట్లు, స్మోల్నీ నుండి ఒక ఆధునిక సాయుధ కవచ శకటం గేట్లోంచి నిశ్శబ్దంగా బయటికి నడిచింది. పెట్రోలింగ్‌ని, పహారాని తప్పించుకునేందుకు, ప్రధాన రహదారుల్ని విడిచి, పక్క దారుల గుండా వేగంగా సాగిపోతోంది.

ఆ వాహనాన్ని నడిపేది దాని మామూలు డ్రైవరు కాదు. బొంచ్-బ్రుయేవిచ్ అనే బోల్షివిక్ పార్టీ ప్రముఖ సభ్యుడు. ఒక ఆ వాహనంలో ప్రయాణిస్తోందీ మామూలు సైనికులు కాదు. ఆ పార్టీ అధ్యక్షుడు లెనిన్, ఆయన భార్య నదెజ్దాలు. ఆమె కూడా పార్టీలో ప్రముఖ సభ్యురాలు, సెంట్రల్ కమిటీ స్థాయి వ్యక్తి.

బ్రుయేవిచ్ ఎన్నడూ అలాంటి వాహనాలను నడపనప్పటికీ, కొద్ది సేపట్లోనే నైపుణ్యం ఉన్న వాడివలె దాన్ని నడపసాగాడు. అతడు జెనీవా ప్రవాస కాలం నుండీ లెనిన్‌కి సహయోధుడు. పార్టీ పత్రిక 'ఇస్క్రా' (నిప్పుకణం) కు వ్యాసాలు రాసాడు. అంతేనా, రష్యాలోని పార్టీ సభ్యులకు మొదటి విప్లవ కాలంలో (1905-07) ఆయుధాలు చేరవేసి, ఆ విప్లవంతో చురుకైన పాత్ర వహించాడు. విప్లవం ఓడిపోయే సమయంలో జార్ కుక్కలకు (గూఢచారులకు) తన వాసన ఏ మాత్రం తగలనీయకుండా, తిరిగి విదేశాలకు వెళ్ళిపోయాడు. ప్రవాస కాలంలో జీవిక కోసం ఒక ప్రసిద్ధ న్యాయవాది వద్ద డ్రైవరుగా పనిచేసి, తన ఉన్నత ప్రవర్తన ద్వారా పార్టీ యెడల ఆ లాయరు కుటుంబ సానుభూతిని సంపాదించి పెట్టాడు. అలాగే పార్టీ కోసం విరాళాలు పోగు చేసే క్రమంలో ఎన్నో సాంస్కృతిక కార్యకలాపాల్లోనూ ప్రముఖ పాత్ర నిర్వహించాడు.

వింటర్ పాలెస్‌పై విజయ వార్త తెల్లవారు ఝూమున 2-30 కి అందింది లెనిన్‌కి. ఆ వార్త చెప్పిన పొద్వోయ్‌స్కీని ఆయన ఆనందం పట్టలేక ఒక్కసారిగా కౌగిలించుకొన్నాడు. రెండ్రోజుల నుంచీ పగలనక, రాత్రనక నిద్రాహారాలు లేకుండా పోరాటానికి నాయకత్వం వహించిన ఆయనకు, అప్పటికి అలసట, నీరసం ఆవహించి, కుర్చీలో చేరగిలబడిపోయాడు. సహచరులు ఆయనకు ఆ సమయంలో ఒక కప్పు టీ మాత్రం అందించగలిగారు. కాంగ్రెస్ మొదటి రోజు సమావేశం ఇంకా జరుగుతూనే ఉంది. ఇప్పటి దాకా ఈ సమావేశంలో పాల్గొనడం కుదరలేదు. అయితే, రెండోరోజు సమావేశంలో తాను నిర్ణయాత్మక పాత్ర వహించవలసి ఉన్నందున, కొద్దిగంటలు విశ్రాంతి తీసుకోవడం అవసరమని ఆయన భావించాడు. అందుకోసం నదెజ్దా స్మోల్నీ లోనే ప్రశాంతంగా ఉండే స్థలం కోసం వెదికింది గానీ, అదెక్కడా ఆమెకు కనబడలేదు. ఇది గమనించిన బ్రుయేవిచ్ వారిని తమ ఇంటికి ఆహ్వానించగా, ఆమె అంగీకరించింది. పోరాట జ్వాలలు అక్కడక్కడా ఇంకా ఎగిసిపడుతూనే ఉన్నందున భద్రత కోసం సాయుధ కవచ శకటంలో ప్రయాణించేందుకు బ్రుయేవిచ్ వారిని ఒప్పించాడు. ఆ విధంగా వారు అందులో ప్రయాణిస్తున్నారు.

నిద్రమత్తు కళ్ళతోనే లెనిన్ వాహనం ఎక్కినప్పటికీ, కుదుపుల వల్ల ఆయన నిద్ర ఎగిరిపోయింది. అటూ ఇటూ పడిపోకుండా ఉండేందుకు ఎదుటి ఆధారాన్ని రెండు చేతులతోనూ గట్టిగా పట్టుకుని, ఆ చేతులపై తలను వాల్చి, ఆలోచనల్లో మునిగిపోయాడాయన.

"తాత్కాలిక ప్రభుత్వం పతనమై, రాజధాని తమ ఆధీనంలోకి వచ్చింది. ఇది విప్లవకారుల విజయ యాత్రలో తొలి అడుగు మాత్రమే. దీని ఆసరాతో మొత్తం దేశంపై తమ ఆధిపత్యాన్ని సంపాదించి, శ్రామికులు కలగన్న సోషలిస్టు రాజ్యాన్ని ప్రపంచంలోనే

తొలి కార్మిక, కర్షక రాజ్యాన్ని నెలకొల్పాలి! అయితే మాజీ ప్రధాని కేరెన్స్కీ ఉత్తర ప్రాంతానికి పారిపోయి సైన్యాల్ని రెచ్చగొట్టి, ప్రతీఘాత దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. అతడికి దేశంలోని బూర్జువాలు, భూస్వాముల మద్దతు ఎంతైనా ఉంది. విదేశీ సామ్రాజ్యవాద శక్తులు కూడా ప్రత్యక్షం గానో, పరోక్షంగానో జోక్యం చేసుకునేందుకు ప్రయత్నిస్తాయి. ఎందుకంటే, తమ పొరుగున ఒక దేశంలో సోషలిస్టు రాజ్యం ఏర్పడితే, తమ దేశాల్లోనూ కార్మిక వర్గ విప్లవాలు చెలరేగే ప్రమాదం ఉంది. కనుక ఇలాంటి ప్రతీఘాతక దాడుల్ని ఎదుర్కొని నిలబడాలంటే, విప్లవ ప్రభుత్వానికి శ్రామిక ప్రజల క్రియాశీల మద్దతు అవసరం. ఇది తమ ప్రభుత్వమేనని, దీని శత్రువులు తమ శత్రువులేనని వారు భావించేందుకు అనుగుణంగా విప్లవ ప్రభుత్వపు కార్యాచరణ ఉండాలి. పెట్రోగ్రాడ్ పై సైనిక విజయంతో పాటు, కార్మిక, సైనిక సోవియట్ల ఎన్నికల్లో మెజారిటీని అందించి, శ్రామిక ప్రజలు తమకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సువర్ణావకాశాన్నీ కల్పించారు. కనుక ఇప్పుడు తాము ఏర్పాటు చెయ్యబోయే ప్రభుత్వం ప్రజలకు అవసరమైన శాసనాల్ని చేసి, ఆపై వాటిని అమలూ చేసి, వారి విశ్వాసాన్ని మరింత స్థిరంగా చూరగొనేలా ప్రవర్తించాలి...."

ఆయన ఆలోచనలకు అడ్డుకట్ట వేస్తూ శకటం సడన్ బ్రేక్‌తో ఆగడంతో, లెనిన్ కళ్ళు విప్పి చుట్టూ చూసాడు. బ్రుయేవిచ్ ఇల్లు వచ్చినట్లుంది. శకటం లోపల ఉన్న తన ఇద్దరు అతిథుల్ని ఇంటి ముందు దింపి, శకటాన్ని పక్కనే ఉన్న చెట్లలో పార్కు చేసాడు బ్రుయేవిచ్. అది ఇతరుల దృష్టిని ఆకర్షించడం అతడికి ఇష్టం లేదు.

ఇంటికి తాళం పెట్టి ఉంది. ఇంట్లో వారికి నిద్రాభంగం కలిగించకుండా, గృహ యజమాని ఎప్పుడంటే అప్పుడు ఇంట్లోకి వచ్చేందుకు వీలుగా. బ్రుయేవిచ్ తాళం తీసి, తన అతిథుల్ని ఇంట్లోకి ఆహ్వానించాడు. ముగ్గురూ మునుగాళ్ళపై నడుచుకుంటూ వంటింట్లోకి నడిచారు.

అతిథులు వస్తున్నట్లు తెలీకపోవడం వల్ల వారి కోసం ఏ వంటకాలూ సిద్ధంగా లేవు. "నీ భార్యను లేపకుండా ఉంటేనే నేను మీ ఇంటికి వస్తాను" అని లెనిన్ ముందే షరతు విధించడం వల్ల, బ్రుయేవిచ్ తన భార్యను లేపలేదు. వంటింట్లో బ్రుయేవిచ్ కోసం మాత్రం రొట్టె, పాలు, కొంచెం జున్ను ఉన్నాయి. ఆ కొద్దిపాటి ఆహారాన్నే ఆ ముగ్గురూ తలో కొంచెం పంచుకున్నారు.

తను ఎంతో గౌరవించే తన మిత్రుడూ, సహ యోధుడూ, అన్నిటికీ మించి మార్గదర్శి అయిన లెనిన్‌కూ, ఆయన భార్యకూ ఒక్కపూట అయినా కడుపు నిండా భోజనం పెట్టలేకపోయినందుకు బొంచ్-బ్రుయేవిచ్ ఎంతైనా చింతించాడు. "జెనీవాలో మీ ఇంట ఎన్నోసార్లు ఆతిథ్యాన్ని స్వీకరించాను. అలాంటి మీరు మా ఇంటికి వస్తే కడుపు నిండా ఒక్క పూటైనా భోజనం పెట్టలేకపోయాను" బాధపడ్డాడు బ్రుయేవిచ్.

"ఎటూ కాని ఈ సమయంలో ఇంత మాత్రమైనా కడుపు నింపుకోగలిగాను, చింతించకు మిత్రమా" లెనిన్ అతడి భుజం తట్టి అనునయించాడు.

ఆ ఇల్లు ముచ్చటగా మూడు గదులూ, ఒక వరండా తో ఉన్నది. వరండాను చెక్కలతో మూసివేసి, తన చదువుల గదిగా చేసుకున్నాడు బ్రుయేవిచ్. రాజధానిలో, నెవా నదికి ఇవతలి వైపున, ఒక మామూలు కార్మికుడు అలాంటి ఇంటిని సంపాదించడం అసాధ్యం. బ్రుయేవిచ్‌కి ఆ ఇల్లు తన తాతల నుండి సంక్రమించింది. భార్య ఒక స్కూలు టీచర్. వారిది ప్రేమ వివాహం. ఇద్దరి మధ్యా మంచి అవగాహన ఉండటం వల్ల అతని కార్యక్రమాలకు ఆమె ఎన్నడూ అడ్డు చెప్పలేదు. సమయం కాని సమయంలో వచ్చి, తన మిత్రుని భార్యా పిల్లలతో పరిచయం చేసుకోవడం కుదరనందుకు లెనిన్ విచారించాడు గానీ, తెల్లారయినా ఆ కొరత తీరుతుంది కదా అని ఊరడిల్లాడు.

వరండా గదిని లెనిన్ పడుకునేందుకు ఏర్పాటు చేసాడు బ్రుయేవిచ్. నాద్యా(నదెజ్దా పొట్టిపేరు) కు హాల్లోనే ఒక సోఫాలో పడక ఏర్పాటు చేసాడు.

భోజనం కాగానే లెనిన్ తనకు చూపించిన గదిలో సోఫాపై మేను వాల్చాడు గానీ ఆయన భుజస్కంధాలపై గల కర్తవ్యం నిద్ర పట్టనీయలేదు.

కాంగ్రెస్ రెండో రోజు సమావేశంలో విప్లవ ప్రభుత్వం రెండు ముఖ్యమైన శాసనాల్ని ప్రకటించి, తనదైన సోషలిస్టు ముద్రను వ్యక్తీకరించాల్సి ఉంది. అందులో మొదటిది శాంతిని గురించి శాసనం. ప్రస్తుతం జరుగుతున్న మొదటి సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధం ముగింపు కోసం తమ ప్రభుత్వ ప్రతిపాదనలు ఈ శాసనంలో ఉంటాయి. దీని వల్ల దేశ ప్రజలంతా గొప్ప ఉపశమనాన్ని పొందుతారు. అయితే ఈ శాసనంలో ఎలాంటి ప్రతిపాదనలు ఉండాల్సిందీ ఇంతకు ముందే పలు వ్యాసాల్లో తను చర్చించి ఉన్నాడు. ఇక రెండోది భూమి శాసనం. విప్లవానికి వెన్నుదన్నుగా నిలిచిన పేద రైతాంగపు వందల సంవత్సరాల కలను ఈ శాసనం వాస్తవం చేస్తుంది. ఎలాంటి గందరగోళం రాకుండా ఉండేందుకు దీనిలోని క్లాజులను ఇప్పుడు జాగ్రత్తగా రూపొందించాలి.

లెనిన్ పడుకున్నవాడు కాస్తా లేచి, దీపం వత్తిని పెంచి రాసుకోవడం మొదలెట్టాడు.

.....భూమిపై వ్యక్తిగత స్వామ్యం శాశ్వతంగా రద్దు చెయ్యబడుతుంది. భూమిని అమ్మడం, కొనడం, కౌలుకి ఇవ్వడం, కుదువపెట్టడం, ఇంకే విధంగానైనా అన్యాక్రాంతం చెయ్యడం నిషిద్ధం...

....భూమి అంతా, అది రాజ్యానికి, రాజ కుటుంబానికి, సన్యాసుల మఠానికి, చర్చికి, ఫాక్టరీకి చెందినదైనా, వారసత్వ, ప్రైవేటు, ప్రజా, రైతు వగైరా భూమి అయినా, నష్టపరిహారం లేకుండా జప్తు చేయ్యబడి, యావత్ ప్రజల ఆస్తి అయి, దున్నేవారందరి వినియోగంలోకి వెడుతుంది.

...సమస్త ఖనిజ సంపదా, అడవులూ, జలాలూ ప్రభుత్వ వినియోగంలోకి మారతాయి....

"కామ్రేడ్ వ్లదీమిర్ ఇల్యీచ్...." బ్రుయేవిచ్ ఎప్పుడొచ్చాడో, లెనిన్‌ని పలకరించాడు. "ఏమిటి నిద్రపోకుండా మెలకువతోనే ఉండి, రాసుకుంటున్నారా? ఇక ఈనాటికి నిద్ర పట్టదేనా? నాకు పార్టీ ముఖ్యులతో చివాట్లు తప్పవా?" తులుపువారగా నిలబడి, గుమ్మానికి అటొక కాలూ, ఇటొక కాలూ వేసి, నిద్ర కళ్ళతోనే ప్రశ్నించాడు బ్రుయేవిచ్.

"చివాట్ల గురించి భయపడకు కామ్రేడ్ బ్రుయేవిచ్! నీకు నేను సాక్ష్యం చెబుతాగా, మీ ఇంట్లో కరువు తీరా నిద్రపోయానని. మళ్లీ

నీ నిద్ర పాడు చేసుకోవడమెందుకు? వెళ్ళి కాస్త కునుకు తియ్యి, ఈ రెండు పేజీలూ రాశాక ఆ పని చేస్తాలే..." తల తిప్పకుండానే రాసిన పంక్తుల్ని చదువుకుంటూ అన్నాడు లెనిన్.

"మీరు నిద్ర పోకుండా ఉంటే, నాకెలా నిద్ర పడుతుంది కామ్రేడ్? మిమ్మల్ని పని చేసుకోవడానికి కాదుగా మా ఈ చిన్ని కుటీరానికి తీసుకువచ్చింది. ఒకవేళ ఈ వరండా గదిలో నిద్ర పట్టడం లేదంటే చెప్పండి....మా బెడ్‌రూం ఖాళీ చేసి మీకిస్తాం..."

"అబ్బెబ్బే....ఆ పని చెయ్యకు, దయచేసి ఈ గది రాసుకోవడానికీ, నిద్రించడానికీ కూడా బాగుంది. మరి నేను కాంగ్రెస్‌లో సజావుగా పాల్గొనేందుకే కదా, నా నిద్ర గురించి నీ ఆతృత! మరి అలా అయితే, ఆ కార్యక్రమంలో సమర్థమైన పాత్రను నిర్వర్తించాలని కూడా ఆశిస్తావు. అవునా?" లెనిన్ తలెత్తి బ్రుయేవిచ్ కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

"తప్పకుండా....అందుకే కదా కామ్రేడ్ కృప్‌స్కయా, నేనూ కలిసి మిమ్మల్ని ఇంత దూరం తీసుకొచ్చింది..." బ్రుయేవిచ్ గదిలోకి వచ్చి, ఓ కుర్చీలో కూర్చుంటూ అన్నాడు. (లెనిన్ భార్య పూర్తి పేరు నజెద్జా కాన్‌స్తన్‌తీనొవ్నా కృప్‌స్కయా)

"మరయితే, నన్ను నా పని చేసుకోనివ్వు కామ్రేడ్! ఎందుకంటే ఈ భూమి శాసనం ముసాయిదాను ఇప్పుడు నేను పూర్తి చెయ్యలేకపోతే, కాంగ్రెస్‌లో నేను నాలుగు చప్పటి మాటలు చెప్పి సంతృప్తి పడాల్సి వస్తుంది. మరి మహాసభలో చర్చ జరిగి, అది శాసన రూపం తీసుకోవాలంటే, అప్పటికప్పుడు నాలుగు వాక్యాలు హడావిడిగా గిలికితే, అది ఇక ఎంత రంజుగా ఉంటుందో ఊహించు..." ఆ దృశ్యాన్ని ఊహించుకుంటూ లెనిన్, తన చిన్న కళ్ళను పెద్దవి చెయ్యడం ద్వారా నవ్వాడు.

లెనిన్ కూడా నవ్వుతాడని, ఆయన కూడా తమలాంటా మామూలు మానవమాత్రుడేనని చాలా మంది అనుకోరు. ఆయనెప్పుడూ గంభీరంగా, ఆలోచిస్తూనో, రాస్తూనో, ఇతరుల్ని ప్రశ్నిస్తూ, వారి నుండి సమాధానాలు రాబడుతూనో, లేక ఉపన్యసిస్తూనో లేక తమ సందేహాల్ని తీరుస్తూనో ఉండటమే వారు చూస్తూ వచ్చారు. అందువల్ల ఆయనలో మానవ సహజ వికారాలను ఎప్పుడూ చూడలేదు. ఆయనకు అత్యంత సన్నిహితులకే ఆయన హావభావాల్ని ఎలా ప్రదర్శించేదీ కొంత వరకైనా తెలుసు.

ఏమైనా లెనిన్ నవ్వడం చూసి తనూ నవ్వాడు బ్రుయేవిచ్. ఆయన పట్టుదల విషయం తెలుసు గనుక, ఇక అడ్డుచెప్పలేక పోయాడు. "సరే కామ్రేడ్....అలాగే చెయ్యండి. మీరేమీ అనుకోనంటే, మీరు రాసింది ఒకసారి చూస్తాను"

"చూడడటమే ఏమిటి కామ్రేడ్...చదువు! నీకెక్కడయినా సందేహాలు వస్తే, అడుగు..." లెనిన్ తిరిగి తన పనిలో నిమగ్నుడయ్యాడు.

"...వృద్ధాప్యం వల్లనో, అనారోగ్యం వల్లనో శాశ్వతంగా అశక్తులైన రైతులు భూవినియోగ హక్కును కోల్పోయి, అందుకు బదులుగా పెన్షన్ పొందుతారు..."

... స్థానిక పరిస్థితుల్ని బట్టి, శ్రమ ప్రమాణాన్ని బట్టిగానీ, లేదా వినిమయ ప్రయాణాన్ని బట్టిగానీ శ్రామిక ప్రజలకు సమానంగా భూమి పంచబడుతాం..."

బ్రోంచ్ బ్రుయేవిచ్ చిన్నగా దగ్గి గొంతు సవరించుకునేసరికి, లెనిన్ తన రాత ఆపి "కామ్రేడ్ బ్రుయేవిచ్! ఏమైనా అడగ దలుచుకున్నావా? ఫరవాలేదు, ముందే చెప్పానుగా సందేహాలుంటే అడగమని!" అన్నాడు.

"మధ్యలో మీ పనికి ఆటంకం కలిగిస్తున్నానేమో అని సందేహించాను కామ్రేడ్ ఇల్యీచ్! ఇప్పుడు ధైర్యంగా అడుగుతాను. శ్రమ ప్రమాణం అంటే ఏమిటి? వినిమయ ప్రమాణం అంటే ఏమిటి? ఇదే నా సందేహం కామ్రేడ్!" బ్రుయేవిచ్ అన్నాడు.

"శ్రమ ప్రమాణం అంటే పని చేసే వారి సంఖ్యను ప్రమాణంగా తీసుకోవడం. వినిమయ ప్రమాణం అంటే, తినేవారి సంఖ్యను ప్రమాణంగా తీసుకోవడం. దేన్ని ప్రమాణంగా తీసుకున్నా, అది సమానత్వ ప్రాతిపదికగా ఉంటుంది. ఆ విధంగా భూపంపకం అందరికీ సమానంగా ఉంటుంది. సరే, ఇంతేనా...ఇంకేమైనా సందేహాలున్నాయా?"

"ఇంతే కామ్రేడ్ ఇల్యీచ్!"

"మంచిది.సరే ఇక వెళ్ళి నిద్రపో కామ్రేడ్. అయితే ఒక్కమాట...మనం బోల్షివిక్కులం. ప్రజలకు నాయకత్వం వహించి వారిని సరైన మార్గం వెంట నడిపించాల్సిన వాళ్ళం. వారు మన మాట వినాలంటే మన మార్గం పట్ల ముందు మనకు సరైన అవగాహన ఉండాలి. అందుకోసం ఎక్కువ చదవాలి. మనకు ఎదురైన సమస్య గురించే కాదు, ఎదురుకాబోతుందనుకొన్న సమస్య గురించి కూడా అధ్యయనం చెయ్యాలి. ఈ విషయంలో నువ్వు సరైన శ్రద్ధ వహిస్తావని ఆశిస్తున్నాను. అందునా నువ్వు రచయితవి... నీకు మరింత బాధ్యత ఉంది" తిరిగి తన రాత పనిలో నిమగ్నమయ్యాడు లెనిన్.

శ్వేత మందిరం... స్మోల్నీ మహాసౌధానికే వన్నె తెచ్చే కళామందిరం... జార్‌ల కాలం నాటి షాండ్లియర్‌ల ధగధగలు... రంగు మాయని పర్షియన్ తివాచీల వన్నెచిన్నెలు... అత్యద్భుత శిల్పాలతో తీర్చిదిద్దబడ్డ చలువరాతి స్తంభాలు... అట్టహాసంగా అలంకరించబడ్డ ఉన్నత వేదిక... ఒకప్పుడు ఉన్నత కులీన వర్గాలకు అక్కడ డాన్స్ పార్టీలూ, సంగీత కచ్చేరీలూ జరిగేవి. నేడది శ్రామిక వర్గానికి చెందిన, రష్యా నలుమూలల నుండీ వచ్చిన భారీ మోటు మనుషులతో కిటకిటలాడిపోతోంది. కార్మిక, సైనిక సోవియట్ల అఖిల రష్యా రెండో కాంగ్రెస్ సమావేశం కోసం వచ్చిన ప్రతినిధులు వారంతా. మొదటి రోజు సమావేశం అంతా వాడి వేడిగా, కోపతాపాలతో, ప్రకటనలూ, నిరసనలూ, వాకౌట్లతో, కాంగ్రెస్ దశ, దిశ ఏమిటో తెలీకుండా జరిగిపోయింది. ఈ రోజు రెండో రోజు.... అతి ముఖ్యమైన రోజు... కీలకమైన ప్రభుత్వ ఏర్పాటు ముఖ్యమైన ప్రజల సమస్యల విషయంలో కాంగ్రెస్ తీర్మానాలు, చర్చలూ, ఆమోదాలూ ఉంటాయి. కనుక సభ్యులంతా సభ ఎప్పుడు ప్రారంభం అవుతుందా అని ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. నిజానికి సభ మధ్యాహ్నం 1గంటకే ప్రారంభమవ్వాలి. కానీ, ప్రభుత్వ పొందిక కోసం వివిధ పక్షాల మధ్య సంప్రదింపులు కారణంగా రాత్రి ఏడవుతున్నా సమావేశం మొదలు కాలేదు.

సాయుధ పోరాటం ద్వారా బోల్షివిక్ పార్టీ పాత ప్రభుత్వాన్ని కూల్చివేసి, క్రితం రోజే సైనిక విజయం పొందింది. చట్టబద్ధ ఎన్నికల్లో

ఆ పార్టీ ప్రభుత్వాన్ని స్థాపించేందుకు అవసరమైన మెజార్టీనీ సాధించింది. ఇప్పుడది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గాను, తనతో కలిసి వచ్చే బావ సారూప్యత గల వివిధ వామపక్ష సోషలిస్టు పార్టీలతో సంప్రదింపులు జరుపుతోంది. రాబోయే కాలంలో విప్లవ ప్రతీఘాతాన్ని జయించడంలోనూ, విప్లవ ఫలాలు శ్రామిక వర్గానికి నిరాఘాటంగా అందడానికీ, ఆయా పార్టీల మద్దతు అవసరమని అది భావిస్తోంది. చివరికి సంప్రదింపులు ఫలించినట్లున్నాయి... దాంతో సమావేశం రాత్రి 8-40కి మొదలైంది.

సభ మొదట్లో...చప్పచప్పగా వాగ్వివాదాలు...ఇష్టమయితే చప్పట్లు, లేకుంటే ఎకపెక్కపు కేకల, అరుపులు..అంతా రష్యన్ సమావేశాల సంప్రదాయం ప్రకారంగా....

ఇంతలో అకస్మాత్తుగా నిశ్శబ్దం.. సభాధ్యక్షుడు ఎవరో ఒక వక్తని రమ్మన్న పిలుపు వినగానే, తిరిగి ఒక్కసారిగా సభ ఉప్పెనలా ఉప్పొంగింది. ఆ వ్యక్తి నిండు విగ్రహాన్ని కళ్ళారా చూడాలన్న ఆత్రుతలో జనమంతా ముంగాళ్ళమీద లేచి నిలబడి, ఆ వ్యక్తిని చూడ్డంతోటే పెద్దపెట్టున చప్పట్ల హోరుతో, జయజయ నినాదాల ఘోషతో ఆయనకి స్వాగతం పలికారు. సైనికులు తళతళలాడే తమ తుపాకీ సన్నీలను ఎత్తి పట్టుకున్నారు. మిగిలిన వారు తమ టోపీల్ని పైకి ఎగరేశారు. ఇప్పటి దాకా వారు ఆయన్ని గురించి వినడం, ఆయన రాసింది చదవడం తప్ప ఆయన్ని ప్రత్యక్షంగా చూసింది లేదు. దాదాపు రెండు దశాబ్దాల పాటు దేశ, విదేశాల్లో అజ్ఞాతవాసం చేసి, చెప్పరాని ఇడుములు పడి, అకుంఠిత దీక్షతో కృషి చేసి, ప్రపంచంలోనే తొలిసారిగా, తమ కోసం...శ్రామిక జనం కోసం...మొట్టమొదటి సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించాడు. మరి అలాంటి తమ నాయకుడైన లెనిన్‌ని ఇప్పుడు తాము కళ్ళారా చూడగలుగుతున్నారు...

జనం తమ నినాదాల హోరును ఎంతకూ ఆపకపోయేసరికి, లెనిన్ తనచేతి సంజ్ఞతో ఆపి, "కామ్రేడ్స్! ఇప్పుడు మనం శ్రామిక వర్గ సోషలిస్టు రాజ్యాంగ యంత్ర నిర్మాణానికి పూనుకుందాం..." అంటూ ఎలాంటి ఆర్భాటం లేకుండా, సాదాసీదాగా తన ఉపన్యాసాన్ని మొదలెట్టాడు. ముందుగా ఆయన 'శాంతి శాసనాన్ని' చర్చకోసం ప్రతిపాదిస్తూ, "శాంతి అంటే తమ దృష్టిలో ఎలాంటి దురాక్రమణలూ లేని, నష్టపరిహార చెల్లింపులూ లేని శాంతి" అని ఆయన ప్రకటించాడు.

వెంటనే చర్చ మొదలైంది. దీనిలో వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులే మాట్లాడాలి. సమయం 15 నిమిషాలు.

"మీ ప్రభుత్వం రహస్య దౌత్యాన్ని రద్దు చేస్తామని, అన్ని సంప్రదింపుల్నీ ప్రజల సమక్షంలోనే చేస్తామని ప్రకటించడం విప్లవాత్మకం" అంటూ వామపక్ష సోషలిస్టు రివల్యూషనరీ ప్రతినిధి 'కారెలిన్' తీర్మానానికి మద్దతు ప్రకటించాడు.

"వెంటనే మూడు నెలల యుద్ధ విరామం ప్రకటిస్తున్నామన్నారు. ఇది ఎక్కువే. అయితే గత మూడేళ్ళ నుండీ కందకాల్లో మగ్గుతున్న సైనికులకు ఆ మాత్రం కావాలి" సోషల్ డెమోక్రాట్ ఇంటర్నేషనలిస్టుల తరపున క్రామెలోవ్ తీర్మానానికి మద్దతునిచ్చాడు.

వెంటనే ఉక్రేయిన్ సోషల్ డెమోక్రాట్ ప్రతినిధి లేచి, "ఈ శాంతి ప్రతిపాదనలు ఆయా దేశాల ప్రభుత్వాలకే గాక, ప్రజలకూ చేస్తామన్నారు. ఇదెంతో ప్రజాస్వామిక చర్య, సోషలిస్టుల పేరుకు తగ్గట్టుగా ఇది ఉంది" అంటూ తన సంఘీభావం తెలిపాడు.

తీర్మానం ఏకగ్రీవమయింది. వెంటనే సభలోని వారంతా అసంకల్పితంగా లేచి నిలబడి, శ్రామిక వర్గ అంతర్జాతీయ గీతాన్ని ఆలపించారు. ఆవేశంలో పలువురు ప్రతినిధులు పసిపిల్లల్లా ఏడ్చారు. "యుద్ధం అంతం చెయ్యబడింది" అంటూ కేకలు పెట్టారు. ఆ వెంటనే లెనిన్, భూమి శాసనాన్ని ప్రతిపాదించడానికి వేదిక నెక్కినప్పుడు, ఆ రాత్రి రెండోసారి జయజయ ధ్వానాలు మిన్నుముట్టాయి.

"శాసనం విషయంలో ఏకీభవిస్తున్నాం గానీ, మా ప్రతినిధులంతా ఏకాంతంగా చర్చించుకోవాలి" శాసనం ప్రవేశపెట్టాక మొదలైన చర్చలో వామపక్ష సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ ప్రతినిధి ప్రకటించాడు. బోల్షివిక్కుల తర్వాత, ఈ పార్టీకే అధిక సంఖ్యాబలం ఉంది. కార్మికవర్గంలో పనిచేసే బోల్షివిక్కులు ఈ శాసనాన్ని ప్రవేశపెట్టడంతో, రైతాంగంలో సంప్రదాయంగా పనిచేసే ఈ పార్టీకి మింగలేకా, కక్కలేకా అయినట్లుంది. మెన్షివిక్ ఇంటర్నేషనలిస్టులదీ అదే పరిస్థితి.

"ఇలాంటి చట్టాన్ని సాగలాగకుండా అధికారంలోకి వచ్చిన మొదటిరోజే ప్రవేశపెట్టిన బోల్షివిక్కుల్ని మనం అభినందించాలి" అరాచకవాద బృందం "మాగ్జిమలిస్ట్" నాయకుడు క్రామెరోవ్ ప్రకటించాడు. ఈ పార్టీ కూడా రైతాంగంలోనే పని చేస్తుంటుంది.

ఇంతలో ఒక వ్యక్తి అకస్మాత్తుగా తన ప్రతినిధి కార్డు చూపిస్తూ వేదిక దగ్గరకొచ్చి, తనని మాట్లాడనివ్వవలసిందిగా డిమాండ్ చేసాడు. ఆ వ్యక్తి 'త్వేర్' రాష్ట్రం నుండి వచ్చిన రైతాంగ ప్రతినిధి. అందువల్ల అధ్యక్షుడు అనుమతించక తప్పలేదు.

"భూమి శాసనం ద్వారా 50 కోట్ల ఎకరాల భూమి రైతాంగానికి లభిస్తోంది. అంతేగాక, భూస్వాములకు ఏటా మేం చెల్లించే 50 కోట్ల బంగారు రూబుళ్ళ కౌలు రద్దవుతోంది. ఇప్పటి దాకా మేం సోషలిస్టు రివల్యూషనరీలను సమర్థించాం. కానీ వారు మమ్మల్ని మోసం చేసారు. వారు ప్రభుత్వంలో ఉండగా భూస్వాములతో కుమ్మక్కయ్యారు. బోల్షివిక్కులు కార్మికులకే కాదు, రైతాంగానికీ మేలు చేస్తారని ఇప్పుడు రుజువైంది. లెనిన్ మా నిజమైన నాయకుడు. మా నిజమైన రక్షకుడు. ఆయనకు కృతజ్ఞతలు" ఆ రైతు ప్రతినిధికి మద్దతుగా చప్పట్ల వర్షం కురిసింది.

రెండు గంటలు సంప్రదింపుల కోసం విరామం తర్వాత, తెల్లవారు ఝామున 2 1/2 గం॥లకు జరిగిన ఓటింగ్‌లో, భూమి శాసనం అఖండ మెజారిటీతో విజయం సాధించింది. ఒకే ఒక్క వ్యతిరేక ఓటు పడింది. అనంతరం వామపక్ష సోషలిస్ట రివల్యూషనరీలూ, మెన్షివిక్ ఇంటర్నేషనలిస్టులు బయటి నుంచి మద్దతు ఇవ్వడంతో, బోల్షివిక్ పార్టీ, లెనిన్ నాయకత్వంలో గల "ప్రజా కమిస్సార్ల సమితి" (మంత్రిమండలి) ని ఏర్పాటు చేసింది.

ఆ వెంటనే విప్లవ విజయవార్తను దేశమంతా చాటి చెప్పడానికి, సోషలిస్టు అధికారాన్ని దేశమంతటా విస్తృతం చెయ్యడానికి కాంగ్రెస్ ప్రతినిధులు ఆయా ప్రాంతాలకు శరవేగంగా కదిలి వెళ్ళారు.

ఆ విధంగా రష్యా, ప్రపంచంలోనే మొట్టమొదటి కార్మిక, కర్షక రాజ్యంగా, సోషలిస్టు దేశంగా రూపొందించడంలో ఒక ఘట్టం ముగిసింది.

శత్రువు

- సాదత్ హాసన్ మంటో
అనువాదం: పి.వరలక్ష్మి

1947 కుదుపులు వచ్చాయి. పోయాయి. పంజాబు వెచ్చటి శీతాకాలాల్లో ఎప్పుడన్నా ఎదురయ్యే చెడు రోజుల్లాగే. కరీమ్ దాద్ దేనికీ లొంగకుండా అన్ని కాలాల్లో జీవించాడు. దేవుడి అలా రాసిపెట్టాడు అని అంటూ ఉంటారు కాని అతను అలా అనుకుని పరిస్థితులకు లోబడేవాడు కాదు. గడిచిన కొన్ని నెలల్లో అనుకోని పరిస్థితుల్ని అతను సాహసోపేతంగా ఎదుర్కొన్నాడు. అతని పోరాటం ఎవరినో ఓడిరచాలని కాదు, తలొగ్గడమంటే నువ్వు మగాడివి కావన్న మాటే అనిపిస్తుందతనికి.

కనీసం ఇతరులకు అతనట్లా కనిపిస్తాడు. అయితే అట్లా ఉండాలి అని అతను ప్రయత్నపూర్వకంగా అనుకోడు. ఒకవేళ ఎవరన్నా అతన్ని శత్రువుకు లొంగిపోవడమంటే మనిషిగా బతుకు బతికినట్టే కాదని అనుకుంటున్నావా అని సుదీర్ఘమైన మాటల్లో ప్రశ్నిస్తే ఏదో గణితంలో క్లిష్టమైన సమీకరణం ఇచ్చి పరిష్కరించమని అడిగినట్టు అతను గందరగోళపడిపోతాడు.

కరీం దాద్‌కు దేనికైనా కూడికలు, తీసివేతలు, గుణింతాలు చేయడం ఇష్టం లేదు. 1947 అలజడులు గతించిపోయాయి. వాటి జమాఖర్చుల లెక్కలు వేయడంలో అందరూ మునిగిపోయి ఉన్నారు కాని వాటిపట్ల అతను ఎలాంటి ఆసక్తి చూపలేదు. ఎంత మంది చనిపోయారు? ఎంత ఆస్తినష్టం జరిగింది? ఇవేవీ అతనికి తెలీదు. అతనికి తెలిసిందల్లా అతను తన తండ్రి రహీం దాద్‌ను కోల్పోయాడు. తన భుజాల మీద తండ్రి శవాన్ని మోసుకుపోయి ఒక బావి దగ్గర తనే స్వయంగా తవ్విన మెత్తని భూమిలో సమాధి చేశాడు.

వాళ్ళ ఊరిలో పెద్ద సంఘటనలే జరిగాయి. వందలకొద్దీ యువకులు, ముసలివాళ్ళు హత్యకు గురయ్యారు. ఎంతో మంది ఆడపిల్లలు కనిపించకుండా పోయారు. మిగతావాళ్ళు దారుణంగా అత్యాచారం చేయబడ్డారు. ఈ కల్లోలానికి నేరుగా గురైనవారు వారి దురదృష్టాన్ని గాని, శత్రువు క్రూరత్వాన్ని గాని చాలా కాలం మర్చిపోలేరు.

కరీం దాద్ విషయానికొస్తే అతను కన్నీళ్ళు కార్చలేదు. నిజానికి తండ్రి వీరత్వానికి అతను గర్వపడ్డాడు. ఆయన ఒరిగిపోయే వరకు ఒట్టి చేతులతో దాదాపు ముప్పై మంది సాయుధులతో పోరాడాడు. తండ్రి మరణవార్త విన్నప్పుడు అతను అన్నదల్లా "ఆయన నా మాట విని ఉండాల్సింది. ఈ రోజుల్లో ఎవరైనా కనీసం ఒక ఆయుధమన్నా దగ్గరుంచుకోవాలని చెప్పాను కదా ఆయనకు?"

అని బైటికెళ్ళిపోయి పొలాల్లో పడి ఉన్న తండ్రి శవాన్ని ఎత్తుకొని బావి పక్కనే పూడ్చేశాడు. ఆఖరి మాటలుగా అతను అన్నవి- "మంచేదో, చెడేదో దేవుడికి మాత్రమే తెలుసు. కాని మీరు మాత్రం స్వర్గానికే పోతారు."

రహీం దాద్ కరీంకు తండ్రి మాత్రమే కాదు. మంచి స్నేహితుడు కూడా. అతన్ని నిర్దాక్షిణ్యంగా చంపేశారు. ఆ హంతకుల ప్రస్తావన వస్తే ఇప్పుడు కూడా గ్రామస్తులు ఆగ్రహావేశాలతో తిడతారు కాని కరీం దాద్ ఎన్నడూ ఒక్క మాట కూడా అనలేదు. కోతకొచ్చిన అతని పొలాన్ని కాల్చి బూడిద చేశారు. అతని రెండిళ్ళను దోచేశారు. కాని ఎప్పుడూ తనకు జరిగిన నష్టాలను తిరిగి లెక్కేసుకోలేదు. దాని గురించి అతను అనేదల్లా "ఏం జరిగిందో అదంతా మన తప్పుల వల్లే జరిగింది" అని. అంతే, ఇక దాని గురించి వివరాల్లోకి కూడా పోడు.

కరీం దాద్ జీనాను పెళ్ళి చేసుకున్నప్పుడు కూడా ఊరు ఇంకా ఆ భయానక రోజుల దు:ఖంలో మునిగిపోయే ఉంది. జీనాను అతను కొంత కాలంగా ఇష్టపడుతున్నాడు. అమె తన ఒక్కగానొక్క సోదరున్ని అల్లర్లలో కోల్పోయింది. అతను బలిష్టంగా ఉండేవాడు. తల్లిదండ్రులు పోయాక ఆమెకు కొండంత అండగా ఉండిన అన్న అతను. కరీం దాద్‌ను ఆమె ఒక స్త్రీ పురుషున్ని ఎంతగా ప్రేమించగలదో అంతగా ప్రేమించింది. కాని ఆమె ప్రేమ సోదరుడి మరణం వల్ల పొంగుకొచ్చిన దు:ఖంలో పూడుకుపోయింది. అమె తరచూ ఏడ్చేది.

ఏడ్చేవాళ్ళన్నా, తమ మీద తాము జాలిపడే వాళ్ళన్నా కరీం దాద్‌కు అసహ్యం. ఆమెకు ఎప్పుడూ చెప్పలేదు కాని ఏడుస్తూ ఉండే జీనాను చూడాలంటే అతనికి అయిష్టం. ఎంతైనా ఆమె ఒక స్త్రీ. అతని మాటలు ఆమెను నొప్పిస్తాయేమోనని జంకేవాడు. కాని ఒక రోజు వాళ్ళు పొలంలో పని చేస్తున్నప్పుడు అతను నిగ్రహించుకోలేకపోయాడు. "చచ్చిపోయిన వాళ్ళను పూడ్చి సంవత్సరమైంది. ఇకనైనా దాన్నుండి బైటపడు. నీ కన్నీళ్ళను వృధా చేయకు. మనం బతికుండగా ఇంకా ఎంతమంది కోసం ఏడ్వాలో దేవుడికి మాత్రమే తెలుసు."

ఆ మాటకు జీనా మొదట నొచ్చుకుంది. కాని అతని మీద ఉన్న ప్రేమ వల్ల కరీం దాద్ చెప్పేది నిజమేనని ఒప్పుకుంది. కరీం దాద్ జీనాను పెళ్ళాడాలని అనుకుంటున్నాడని విషయం ఊర్లో పొక్కినప్పుడు పెద్దలు వ్యతిరేకించారు. అయితే అది చాలా బలహీనమైన వ్యతిరేకతే. వాస్తవానికి చనిపోయిన వాళ్ళ కోసం ఏడ్చీ ఏడ్చీ ఊర్లో జనం నీరసించి ఉన్నారు. ఈ విషయం మీద ఏదైనా పట్టింపుతో ఉండే ఓపిక వాళ్ళకు లేదు. అట్లా పెళ్ళి జరిగిపోయింది. ఎంతో కాలం తర్వాత ఆ ఊరు నవవధువును చూస్తుండడంతో బోలేడు సందడి నెలకొంది.

విభజన కల్లోలాల తర్వాత మొదటి సంతోషకరమైన విషయం ఇదే. ఉన్నట్టుండి పండగొచ్చినట్లుగా అయింది. కొంత మందికి ఇది దెయ్యాల పెళ్ళిలాగా కనిపించింది. దీపాల కాంతులకూ, నవ్వులకూ వాళ్ళు అంతగా దూరమైపోయారు మరి. కరీం దాద్ స్నేహితుల్లో ఒకరు అతనికీ సంగతి చెప్పినప్పుడు ఇది అన్నిటికన్నా పరమ

హాస్యాస్పదమైనదిగా అతనికి తోచింది. ఇదతను జీనాకు కూడా చెప్పాడు కాని అందులో ఆమెకు హాస్యం కనిపించలేదు. నిజం చెప్పాలంటే ఆమె శరీరం నిలువెల్లా కంపించింది.

మొదటి రాత్రి కరీం దాద్ జీనా గాజుల చేతి మణికట్టును పట్టుకొని అన్నాడు "ఈ భూతం నిన్ను జీవితాంతం వెంటాడబోతోంది. ఈ ఊరి భూత వైద్యుడు రహీం సాయిన్ కూడా తన మంత్ర తంత్రాలు కరీం దాద్ అనే భూతం పైన పని చేయవని తెలుసుకుంటాడు"

గోరింటాకుతో పండిన తన వేలిని పళ్ల మధ్య పెట్టుకుని సిగ్గుతో ఎర్రబడిన ముఖంమేసుకొని ఆమె అంది, "కీమే, నువ్వు దేనికీ భయపడవా?" తన నాలుకను మీసానికి తాకిస్తూ, "పిచ్చిదానా, అంత భయపడదగిందా భయమంటే? అన్నాడతను. ఇద్దరూ గట్టిగా నవ్వారు.

జీనా పాత విషాదాలను దాదాపు మరచిపోయింది. ఇప్పుడామె ఆలోచనంతా తన బిడ్డ గురించే. ఎందుకంటే ఆమె గర్భవతి అయింది. కరీం ఆమె వంక చూస్తూ అంటాడు. "దేవుని తోడు, ఇంత కన్నా అందంగా నువ్వెప్పుడూ లేవు. కాని ఈ ప్రత్యేక సౌందర్యాన్ని నీవు మోస్తున్న వాడి కోసం ధరించావనుకో, నేను చెప్తున్నా విను, వాడికి పోటీదారుగా... నేనున్నాను."

%జీనా సిగ్గుపడిపోతూ, ముందుకు చొచ్చుకొస్తున్న తన కడుపును దుపట్టాలో కప్పి పెట్టాలని ప్రయత్నించేది. అది చూసి కరీం నవ్వేవాడు. "దొంగ భడవను దాచిపెట్టొద్దు. ఈ సువ్వర్ కోసం నా వెనకాల నువ్వు ఏమేం చేస్తున్నావో తెలీదా ఏమిటి?"

%జీనా ముఖం నల్లబడేది. "వాడినలా తిట్టకు."

"వీడు బుల్లి సువ్వర్. ఎందుకంటే నేనే పెద్ద సువ్వర్ని కాబట్టి," అనేవాడు కరీం దాద్, పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతూ.

బడీ ఈద్ పండుగ వచ్చి పోయాక చోటీ ఈద్ వచ్చింది. రెండూ ధూమ్ ధామ్గా జరిపాడు. పోయినేడాది బడీ ఈద్కు పన్నెండు రోజుల ముందు ఊరి మీద దాడి జరిగి కరీం తండ్రి రహీం దాద్ను, జీనా అన్న ఫజల్ ఇలాహీని చంపేశారు. ఆ మరణాలను గుర్తుతెచ్చుకుని జీనా చాలా దు:ఖించింది కాని గతించిన విషాదాలు వర్తమానాన్ని కమ్ముకోనిచ్చే వాడు కాదు కరీం దాద్.

ఒక్కోసారి జీనాకు నమ్మశక్యంగానే ఉండేది కాదు. తన జీవితంలో జరిగిన అంత పెద్ద విషాదాన్ని మర్చిపోయే దిశగా తన ప్రయాణం మొదలైందని. తల్లిదండ్రుల మరణాలు తనకు గుర్తు లేదు. కాని తన కన్నా ఆరేళ్ళు పెద్దయిన అన్న ఫజల్ ఇలాహీయే తనకు అమ్మానాన్న కావడం గుర్తుంది. అంతే కాదు. తన కోసమే అన్న పెళ్ళి చేసుకోలేదు. చెల్లెలి గౌరవాన్ని కాపాడటానికి అతను తన జీవితాన్ని ఫణం పెట్టడం ఊరంతటికి తెలుసు. అతని చావు ఆమె జీవితంలోకెల్లా అతి పెద్ద విషాదం. సరిగ్గా బక్రీ ఈద్కు పన్నెండు రోజుల ముందు తనకు ప్రపంచం అంతమైనట్టుగా అనిపించింది. ఇప్పుడు దాని గురించి ఆలోచిస్తే తనకు ఆశ్చర్యంగా అనిపిస్తుంది. అంతటి గాయం ఎలా మరపునకు పోతోందా అని.

మొహర్రంలి నెల రాగానే మొదటి సారి జీనా కరీం దాద్ను తన చిరకాల కోరిక కోరింది. ఆమెకు ఎప్పటి నుండో మొహొహర్రం ఊరేగింపును, అందులో రౌతు లేకుండా నడిచి వెళ్ళే గుర్రాన్ని, తిరుణాల బళ్ళనూ చూడాలని ఉంది. దాని గురించి ఆమె స్నేహితులు చెప్పగా చాలా విన్నది. అందువల్ల కరీం దాద్ను అడిగింది, "నాకు బాగుంటే గనక మొహర్రం ఊరేగింపు వెళుతుండగా నన్ను చూడనివ్వవా" అని

నీకు బాగా లేకపోతే నేను నిన్ను తీసుకెళతాను... నీతో పాటు ఆ బుల్లి సువ్వర్గాడిని కూడా" కన్నుగీటుతూ సమాధానమిచ్చాడు కరీం.

ఈ మధ్య కొంత కాలంగా ఇండియా పాకిస్తాన్ మధ్య యుద్ధం వస్తుందని పుకార్లు బయలుదేరాయి. నిజానికి ఎందుకనో గాని పాకిస్తాన్ పుట్టిన క్షణమే యుద్ధం రాబోతోందని అధికారికంగా ప్రకటించినట్లు జనానికి అనిపించింది. ఎప్పుడొస్తుంది యుద్ధం అంటే ఊర్లో ఏ ఒక్కరూ చెప్పలేరు. కరీం దాద్ను ఎవరైనా అడిగితే అతని వద్ద విచిత్రమైన మార్మిక సమాధానం సిద్ధంగా ఉండేది. "ఎప్పుడుండాలో అప్పుడే ఉంటుంది. దాని గురించి ఇప్పుడాలోచించి సమయం వృధా చేసుకోవడం ఎందుకు?"

ఈ పుకార్లు జీనా చెవిన కూడా పడ్డాయి. ఆమె చాలా భయపడిపోయింది. ఆమె హింసను అసహ్యించుకుంటుంది. తన యవ్వన ప్రాయంలోనే ఎంతో హింసను చూసింది. ఇక దానిని ఎంత మాత్రం భరించే స్థితి ఆమెకు లేదు.

కరీం దాద్ మాత్రం ఒక తుపాకిని కొనుక్కొచ్చుకుని గురి చూసి కాల్చడంలో ప్రావీణ్యతను సంపాదించుకోడానికి సాధన చేయడం మొదలు పెట్టాడు. అతను చాలా బలవంతుడు, ధైర్యవంతుడు కూడా. అతనితో ఉన్నప్పుడు ఆమెకు అసలు భయమనేదే తెలిసేది కాదు. అదే ఇతర స్త్రీలతో కలిసి ఉన్నప్పుడు మాత్రం చాలా బెదిరిపోయేది.

జీనాను చూడటానికి ఆ ఊరి మంత్రసాని భక్తో క్రమం తప్పకుండా వచ్చేది. ఒక రోజు ఆమె ఒక వార్త మోసుకొచ్చింది. పంజాబ్లోని వాళ్ళ గ్రామాలకు నీటిని తెచ్చే నదులపై భారతీయులు ఆనకట్ట కడుతున్నారని ఆమె చెప్పింది. జీనాకు దీని మతలబు అర్థం కాలేదు. కరీం దాద్ ఇంటికొచ్చాక అడిగింది. "భారతీయులు మన నీళ్ళను తీసుకెళ్ళిపోతున్నారని అంటున్నారు. ఎందుకలా చేస్తారు?"

"ఎందుకంటే మన భూములు బీడుబడిపోవాలని" అన్నాడు అదో సాధారణ సత్యం అన్నట్లుగా.

"అది చాలా దుర్మార్గం కదా," అన్నదామె, ఆ పుకార్లు నిజమేనని అర్థమయినట్లుగా.

"ఈ రోజు భక్తో వచ్చిందా ఇక్కడికి?" అడిగాడు కరీం

"అవును."

"ఇంకా?"

"పది రోజులకల్లా కాన్పు కావచ్చని చెప్పింది."

"జిందాబాద్," కరీం దాద్ విజయోత్సాహంతో అరిచాడు.

"నువ్వు సంబరపడుతున్నావు. ఏం జరగబోతోందో దేవుడికే తెలుసు," అంది జీనా.

కరీం దాద్ బైటికెళ్ళిపోయి ఆ సాయంకాలమంతా గ్రామస్తులతో పిచ్చాపాటి మాట్లాడుతూ గడిపాడు. వాళ్ళు కుతూహలంతో అడిగే ఏవేవో ప్రశ్నలన్నిటికీ తన శక్తి మేరకు సమాధానం చెప్పే ప్రయత్నం చేస్తున్నాడు ఊరి పెద్ద మనిషి చౌధరి నాథూ. అక్కడ పండిట్ నెహ్రూను

తిట్టేవాళ్ళు, ఇండియాకు శాపనార్థాలు పెట్టేవాళ్ళు ఉన్నా, అసలు నదులకు ఆనకట్ట వేసి అడ్డగిస్తారని వాళ్ళలో ఏ ఒక్కరూ నమ్మడానికి సిద్ధంగా లేరు.

"వాళ్ళే నదులపై డ్యాములు కడుతున్నారు?" అని అంతకుముందు భక్తోని అడిగింది జీనా.

"మన పొలాలకు నీళ్ళిచ్చేవాటిపై" అంది మంత్రసాని.

"అత్తా, నువ్వు వేళాకోళం చేయడం లేదు కదా? ఎవరైనా నదుల్ని అడ్డుకోగలరా. అవేమన్నా కాలువలా?" అన్నది జీనా.

"నాకు తెలీదమ్మాయ్. నేను విన్నది చెప్పాను. పేపర్లలో రాసారని చెప్తున్నారు." ఆమె కడుపును మసాజ్ చేస్తూ చెప్పింది భక్తో.

"ఇంతకూ పేపర్లలో ఏముంది?"

"మన నదులపై డ్యాములు కడుతున్నారని." ఆమె చేతిని జీనా పొట్టపై చాకచక్యంగా రుద్దుతూ, "పది రోజుల్లో వీడు బైటికొచ్చేస్తాడు" అంది.

జీనా కరీం దాద్‌ను ఆ పుకార్ల గురించి మళ్ళీ అడిగితే "అదే అంటున్నారు మరి" అని ముక్తసరిగా జవాబిచ్చాడు.

కొంత మంది ఇది దేవుడు విధిస్తున్న శిక్షని, ఈ ఉపద్రవాన్ని నివారించాలంటే మసీదులో అందరూ జమై ప్రార్థన చేయాలని ఆలోచిస్తున్నారు.

చౌధరీ నాథూ స్థాయిలో ఎవరూ భారతీయులను తిట్టడం లేదు. ముసలాయన ఆ విషయం మీద అదే పనిగా మాట్లాడుతుంటే కరీం దాద్ అసహనంగా కదిలాడు. "ఇది అన్యాయం, నీచం. ఇందెంతో అమానుషం, ఎన్నడూ ఎవరూ చేయని పాపం. కర్బలాలో హుస్సేనూ, వీరులైన అతని అనుచరులు మృత్యువుతో పోరాడుతుంటే యాజిద్ చేశాడు చూడూ, కర్బలాకు నీళ్ళిచ్చే నదిని అడ్డుకుని ఎంతో మంది దాహంతో చనిపోయేటట్లు చేశాడు. అట్లాంటి పని భారతీయులు చేసేది."

కరీం దాద్ రెండు మూడు సార్లు దగ్గాడు. అంటే అతనేదో చెప్పాలనుకుంటున్నట్లు సంకేతం. కాని చౌధరి నాథూ మరోసారి భారతీయులను తనకు తెలిసిన పరమ అహస్యకరమైన తిట్లతో దూషించడం మొదలుపెట్టాడు. ఉన్నఫలంగా కరీందాద్ "వాళ్ళనట్లా తిట్టకు చౌధరీ" అని అతని మాటల్ని తెంచేశాడు.

చౌధరీ నాథూ అప్పుడు భారతీయుల మూలాల గురించి వారి తల్లుల నైతికత గురించిన కథలు వినిపించి తన శ్రోతలకు మరింత వినోదాన్ని పంచడానికి సిద్ధమవుతున్నాడు. "ఏమన్నావు?"

తగ్గు స్వరంతోనే కరీం దాద్ దృఢంగా అన్నాడు, "వాళ్ళను తిట్టొద్దంటున్నాను."

చౌధరీ నాథూ గురగురలాడుతూ, "వాళ్ళేమవుతారు నీకు?" అని మిగిలిన వాళ్ళనుద్దేశించి "ఏమంటున్నాడో విన్నారా? నేను భారతీయులను తిట్టకూడదట. ఆయనకూ వాళ్ళకూ ఏ చుట్టరికముందో అడగండి. ఎంతైనా మనకు తెలుసుకోవాలనుంటుంది కదా.

కరీం దాద్ నెమ్మదిగా, "ఏమైతారో చెప్పనా? వాళ్ళు నాకు శతృవులలైతారు."

చౌధరీ నాథూ గొల్లుమన్నాడు. "విన్నారా! శతృవులై తారంటున్నాడు. అంటే మన శతృవులను మనం ప్రేమించాలన్న మాట."

"నేనట్లా అనలేదు. వాళ్ళను ప్రేమించాలని. నేననేదల్లా వాళ్ళను తిట్టొద్దని" కరీం దాద్ నింపాదిగా సమాధానమిచ్చాడు.

"అదేందబ్బా?" అర్థం కాక అడిగాడు మిరన్ బక్స్. మిరన్ బక్స్ కరీం దాద్ చిన్నప్పటి స్నేహితుల్లో ఒకడు.

"తిట్టడం వల్ల నీకేమొస్తుంది? వాళ్ళు నీ భూములు బీళ్ళు చేయాలనుకుంటున్నారు. నువ్వు తిడ్తే నీ భూములు నీకొస్తాయా? అది తెలివిగలోల్లు చేసే పనా? నువ్వు తిట్టుకుంటూ కూర్చుంటున్నావంటే అర్థం ఇంక చేయగలిగిందేమీ లేదని." మిరన్ బక్సనుద్దేశించి అన్నాడు కరీం దాద్.

"ఏ చేయాలంటావో చెప్పు?"

"నేనెట్ల చెప్తాను? ఇది నా ఒక్కని సమస్య కాదు కదా. దీంట్లో వందలు, వేల మంది ఉన్నారు. వాళ్ళందరి తరపున నేనెట్లా సమాధానం చెప్తాను. ఇట్లాంటి విషయాల గురించి నెమ్మదిగా ఆలోచించాలి. వాళ్ళు రెండు రోజుల్లో డ్యాములు కట్టేయలేరు కదా? ఏండ్లు పడుతుంది. మీరు మాత్రం ఒక రోజు కూర్చొని తిట్టుకుంటూ కోపమంతా వెళ్ళగక్కేస్తారు.

"చెత్త వాగుడు వాగుతున్నాడు" అన్నాడు చౌధరీ నాథూ

"నేను మాట్లాడేది చెత్త కాదు. కొట్లాటలో ఉన్నప్పుడు ఏం చేసినా చెల్లుతుంది. మల్లయుద్ధం చేసే వాళ్ళను చూడలేదా, చివరి దాకా ఎట్ల కొట్లాడతారో? అట్లాంటి దాన్లలో ఏ పట్టు పట్టినా అడ్డుండదు." జవాబిచ్చాడు కరీం దాద్.

"నువ్వు చెప్పేదీ నిజమే" తల గోక్కుంటూ అన్నాడతని మిత్రుడు.

"అంటే ఏమని? మన నదుల్ని అడ్డుకునే హక్కు వాళ్ళకు లేదని అనలేం. మనకది దుర్మార్గంగా కనపడొచ్చు కానీ వాళ్ళకది పెద్ద విషయం కాదు. మంచిదే అనుకుంటా."

"మంచిదంటావా? చౌధరీ నాథూ అంతెత్తు అరిచాడు. "తాగడానికి నీళ్ళు లేక నాలిక ఎల్లబెడితే అప్పుడు నేను తప్పకుండా అడుగుతాను, నీకు మంచిగా ఉంది కదా అని".

"అప్పుడుగూడా అదే మాటంటా చౌధురీ" అన్నాడు కరీం. "వాళ్ళు మాత్రమే మనకు శతృవులు కాదు. మనమూ వాళ్ళ శతృవులమని ఎట్ల మర్చిపోతావు. చేయగలిగే అవకాశం మనకే ఉంటే మనమూ వాళ్ళకు తాగడానికి నీళ్ళు, తినడానికి తిండి అందకుండా చేయమా? నీచులనీ, క్రూరులనీ, దొంగనాకొడుకులనీ భారతీయులను అనడం సరైంది కాదు."

"ఇది వినండయ్యా" గట్టిగా అరిచాడు చౌధురీ నాథూ.

కరీం దాద్ అతన్ని పట్టించుకోకుండా మిరన్ బక్స్ వైపు తిరిగి మాట్లాడాడు. "నీ శతృవు నీ పట్ల దయ చూపాలనుకోవడం తెలివితక్కువతనం. అదెట్లా ఉంటుందంటే యుద్ధంలో అవతలి వాడు నీకన్నా పెద్ద తుపాకులు, నీకన్నా పెద్ద బాంబులు వాడుతున్నాడని ఫిర్యాదు చేసినట్లుంటుంది. అట్లెవడన్నా అడుగుతాడా?"

"కానీ వాళ్ళు మన నదుల మీద డ్యాములు కట్టి మనల్ని పస్తులుండేలా చేయాలనుకున్నారు. అది ఇప్పుడు సమస్య. మనం

మిగతా 41వ పేజీలో...

వీధి నాటిక

ఎడ్లుపోయినవి

- ఉదయమిత్ర

(మధ్యాహ్నపుటెండ... ముసలమ్మ దేనికోనవెూ దేవులాడుతుంటది. మధ్యమధ్యన కొంగుతో చెమట తుడుచుకుంటుంటది)

బాలస్వామి : ఏందే అవ్వ... ఏమయ్యింది... గప్పట్నుంచి దేనికోసమో దేవులాడ్తున్నవు.

ముసలమ్మ: ఆ.. ఎవరూ... ఓ.. బాలసామా...

బాలస్వామి : ఔనవ్వా.. బాలసామినే... ఏమయిందీ? నట్టనడి ఎండల పిచ్చివట్టినట్టు తిర్గుతున్నవు... ఏమయింది? ఎవరన్న వొయ్యిన్రా? ఏమన్న ఎత్తుకపోయిన్రా?

ముసలమ్మ : (కండ్లనీల్లొత్తుకొని).. ఏమిజెప్పుదు బాలసామీ... మా ఎడ్లువోయినయి... నా పంచపానాలు వోయినట్లున్నది. ఎండల యాదదిర్గుతున్నయో... ఏమో.

బాలస్వామి : ఏమయ్యిందో సంగతిజెప్పు... గొడ్లెందుకువాయె? ఏం జరిగింది?

ముసలమ్మ : బిడ్డా... నీకు దెల్వనిది ఏముంది... కాని కాలమొచ్చె... నీల్ల కోసం సచ్చె కామొచ్చె... గొడ్లేమొ నీల్లు లేక అంగోసవడ్తుండె. ముసలోడేమొ కూలికివోయిండు. పిల్లలేమొ దేశం బొయ్యిన్రు. వొక్కదాన్ని... పానమాగలే. పసుల గొంతన్న దడుపుదమాని బిందె తీసుక ఎల్లిన బిడ్డా.

బాలస్వామి : ఏంది... ఎడ్లకు నీల్లకోసమా.

ముసలమ్మ : అవ్ కొడుకా... ఎడ్ల కోసమే బిందె వట్టిన. ఊరుజూస్తే ఊరులాగలేదు. అప్పటి నీల్లులేవు. అప్పటి కతలేదు. భూదేవి అడిగినోల్లందరికీ నీళ్ళిచ్చెడిది. గిప్పుడు నోరెండుకపోయింది. పేరుకేమొ గల్లి గల్లికి బోరు:బొట్టు నీరు రాలదు.

బాలస్వామి : మరి నీల్లు యాడదొరికె.

ముసలమ్మ : ఊరి బయట రామిరెడ్డి పొలం కాడికి వోతం నాయిని.. ఎండల కాల్లకు సెప్పుల్లేవు. కంటిసూపానదు. మీద నెత్తి మండగ, కింద కాల్లు గాలంగ, అంత దవ్వు నడ్సి, బాయికాడికి వోయిన బిడ్డా.. ఆడికివోతే ఆడొకకత.

బాలస్వామి : ఆడ కథ ఏంది?

ముసలమ్మ : వైకుంఠం బోయినా శని ఇడువదన్నట్లు, గాడ కూడ లైన్లు గట్టిన్రు. ఇగ జూస్కో... నూకులాటలు, దొబ్బులాటలు.. నువ్వు జరుగు, నేను జరుగు... ముసల్దాన్ని నావల్ల అయితాది. ఎంత కని రాసులాడ్త బిడ్డా.

బాలస్వామి : ఇంతకూ నీల్లు దొర్కెనా, లేదా? గది జెప్పు.

ముసలమ్మ : (చెమట తుడుచుకొని) హూ... ఏమిదొర్కుడో ఏందో నాయనా. బిందెడు నీల్ల కోసం నిక్కి నీల్గి సచ్చిన. కరెంటు ఉంటే, మోటరెత్తుకోదు... మోటరుంటే, కరెంటుండదు. రెండూ ఉంటే ఆసామీ ఉండడు.. బిచ్చగాల్ల బతుకనుకో. గా బిచ్చగాల్లన్న ఒక్కోపాలి నయమనిపిస్తరు బిడ్డా. ఆఖరికి.. నాల్గుగంటలు.. నిక్కినీల్గినాంక, ఒక్కటి... ఒక్కటంటే ఒక్క బిందె దొర్కింది.

బాలస్వామి : మొత్తం మీద నీల్లు దొర్కినయిన్నమాట (నవ్వుతూ)

ముసలమ్మ : ఆ దొర్కనయితే దొర్కినయి... నీల్లు దొర్కిన సంబురంల ఇంటికి నడ్సిన... ఇంటికి వొయ్యి సూస్తే దొడ్ల గొడ్లు లేవు... పాపం.. అయి నోరులేని జీవాలు.. నీల్లకోసరం... ఎంత అవుగోడిచ్చినయో... ఎంత అర్సినయో.. యాష్టకొచ్చి తుగులు దెంపుకొని తలోదిక్కు వోయినయి.

'దొడ్డి దిక్కూ జూస్తేనేమొ... గుండెలే సెరువాయెనా వలసబోయిన కొడ్కులేమొ యాదికొచ్చినారా.. అయ్యో.. యాదికొచ్చినారా'

(రెండో అంకం)

(బాలమ్మ, జంగమ్మ, అడివమ్మలు
బిందెలు దీస్కొని పొలం కాడికి పోతుంటరు)

"శరీరంల నీరు అంతా - ఆవిరయ్యిపోతా ఉంటే తాగనీకె నీల్లు
లేక - తల్లడిల్లిపోతున్నారా... " (నేపథ్యంలో)

బాలమ్మ : నీల్ల మీద మన్నువొయ్య... గీ లీడర్ల మీద మన్నువొయ్య ... ఊల్ల నీల్లు గానక పొలాల కాడికి తిరిగి తిరిగి సచ్చుడయితున్నది.

జంగమ్మ : అది సరే అక్కా, గీ బోర్లెందుకెండినయే...

అడివమ్మ : ఎందుకెండుతయే... మరీ సిన్న పోరిలాగ అడ్గుతవు నువ్వయితే... ఎండకాలంవొస్తే, నీల్లు లోపలికి వోతయి గదా.. ఆటిని గుంజాలంటే, బోర్లు లోపలికి ఎయ్యాలె.. ఈల్లేమొ మీద మీద బోర్లేసి, సేతులు దులుపుకుంటరు. లెక్కలు రాసుకుంటరు. కమీషన్లు గుంజుతరు.

బాలమ్మ : అసలు బోర్లు చెడిపోతే, బాగుచేసేటోడే లేడు. ఏవేవో కతలు చెబుతరు.

జంగమ్మ : అవ్‌మల్ల... గా పక్కన లంబాడి తాండలయితే మరీ అన్యాయం.. మూడు తాండలకు ఒక్క బోర్‌వెట్టిన్రు... దానికేమొ మోటరు బిగిచ్చిన్రు. వొంతుల లెక్కన పట్టుకోవాలె... ఒక్కోసారి

అర్ధరాత్రి, ఒక్కోసారి రాత్రి మూడు గంటల దాంక మేల్కొని పట్టుకుంటరు. పొద్దున్న మల్ల పనికిపోవాలె.

అడివమ్మ : నీల్లు లేకపోతే కాల్జేతులాడవే తల్లి.

బాలమ్మ : ఒకరు బడి మానుతున్నరు.. ఒకరు కూలి మానుతున్నరు.. ఒకరు కొట్టు మూస్తున్నరు.. ఒకరు కుట్టు మానుతున్నరు... అల్లేంది ఈల్లేంది.. ముసలేంది పడుచేంది.. ఎండకాలమొస్తే నీల్ల కోసం గుండెఝల్లుమంటది... అసలు ముసలోల్ల సంగతి, సిన్న పోరల సంగతి సెప్ప నోత్రాదు...

'ఏమి జేతూ, ఏమి జేతుల్లో – గీ నీల్ల కోసం ఎంత కష్టొమొచ్చి పడ్డాదో – గీ నీల్ల కోసం బొట్టూ బొట్టూ నీల్ల కోసం – కన్నీటి బొట్టూ రాలుతుంటే బత్కులేమొ బంజరాయె – నీల్లు మాత్రం రాకపాయె ' 'ఏమిజేతూ'

(మూడో అంకం)

(బాలమ్మ, అడివమ్మ, జంగమ్మలు ఖాళీ బిందెల్తోటి వాపసొస్తుంటారు. అసలే ఎండ.. వాళ్ళ ముఖాలల్లో నిరాశ, దుఃఖం, కోపం కలగల్సి బయటికి తన్నుకొస్తున్నాయి... వాళ్ళకు ముసలమ్మ ఎదురొస్తుంది)

ముసలమ్మ : ఏందే బాలమ్మా... నీల్లు దొర్కకపాయెనా... వాపసొస్తున్నరు.

బాలమ్మ : ఔనవ్వా.. ఇయ్యాల నీల్లు దొర్కలే.. సొలమాయన మొటరు కాలిపొయ్యిందంట.. కూసోని కూసోని యాష్టకొచ్చి వాపసొస్తిమి.

జంగమ్మ : ఇయ్యాల నీల్లు లేక సచ్చుడే ఉన్నది.. పొంటెల్ల జెయ్యాల్నో, ఏమో... సంటిదాన్ని తానం జేపియ్యక మూడురోజులాయె.

అడివమ్మ : ఊల్ల బోర్లెండిపాయె.. పొలంకాడ మోటరు గాలిపాయె.. అడగెటోడేమొ లేకపాయె...

ముసలమ్మ : ఔనే పోరీ.. అడిగెటోల్లంటే యాదికొచ్చింది... ఇయ్యాల ఊల్ల ఏదో మీటింగ్ వెట్టిన్రంట.. గాయనెవరో లీడర్ సాబ్ వస్తున్నడంట.. అడుగుదం పాండి..

అందరూ : పాండి.. పాండి.. ఇయ్యాల అటో ఇటో తేలిపోవాలె.. (ముసలమ్మ ముందున నడుస్తుంటే అందరూ ఆమెను అనుసరిస్తరు)

(సభాప్రాంగణం... నాయకుడు మాట్లాడుతూ ఉంటాడు... పక్కన అనుచరుడు మధ్య మధ్యన నీల్ల బాటిల్ అందిస్తుంటాడు)

నాయకుడు : (గొంతు సవరించుకొని) : నా ప్రియమైన ప్రజలారా.. పాలమూరు బిడ్డలారా.. మీరంటే నాకెంత ఇష్టమో చెప్పలేను. ముఖ్యంగా నవాబ్‌పేట ప్రాంత ప్రజల్ని జూస్తే గుండె తరుక్కపోతది. ఎటుజూసినా బీడు పొలాలు, కరువులు, వలసలు, చావులు... అందుకే.. గీ పరిస్థితి పోవాలంటే మీరు మాకు ఎట్లేసి గెలిపించాలె.. అప్పుడీ ప్రాంతమంతా సస్యశ్యామలం చేసి పడేస్తాం.. (చప్పట్లు) (మంచినీల్లు తాగుతాడు)

ముసలమ్మ : (నడుముకు చేతులు ఆనించి) : అయ్యా... దొరగారూ.. గిప్పుడు గా సోదెంత ఎందుగ్గాని.. మాకు నీల్లు గావాలె... గా సంగతి జెప్పున్రి.. అది దప్ప ఇంకేది మాట్లాడొద్దు.. (అందరూ అందుకుంటారు)

నాయకుడు: వొస్తాయి.. వొస్తాయి.. నా ప్రియమైన ప్రజలారా మీరంత సుఖ సంతోషాలతో ఉండనీకె మన ప్రభుత్వం ఎంతో ఆలోచించి, ఆలోచించి (నీల్లు తాగుతాడు).. ఎంతో శ్రమపడి "అమ్మ పథకం" తెచ్చింది.

ముసలమ్మ: అమ్మ లేదు. అయ్య లేదు. మాకు నీల్లు కావాలె.. మాకు నీల్లు కావాలె (కోరస్)

నాయకుడు: మీ కోసం మా ప్రభుత్వం "నగదు పథకం" ప్రవేశపెట్టింది. దాని కోసం వేల కోట్లు ఖర్చుబెడుతున్నది (నీల్లు తాగుతూ)

బాలమ్మ: మాకు నీల్లు గావాలె.. నీల్లు గావాలె. (కోరస్)

నాయకుడు: మీరు సుఖంగా ప్రయాణం చేయదాన్కి మా ప్రభుత్వం వందల కోట్లు ఖర్చుబెట్టి, పెద్ద పెద్ద రోడ్లను వేయిస్తున్నది (నీల్లు తాగుతాడు)

జంగమ్మ: మాకు నీల్లు గావాలె.. నీల్లు గావాలె (కోరస్)

ముసలమ్మ: (నాయకుడు నీల్లు తాగబోతోంటే బాటిల్ గుంజేస్తుంది) ఏందయ్యా.. సారూ .. నీకేమో గంటకు పదిసార్లు నీల్లు గావాలె. మాకేమో తాగనీకె గుక్కెడు నీల్లు దొర్కవు. గా గుక్కెడు నీల్ల కోసరమైనా పొలాలెంబడి... గల్లెంబడి కుక్కల్లాగా తిరుగాలెనా? ఒక గంట సేపటికి నీకింత దూపయితే, గీదున్న మాకెంత దూప ఉండాలె. మాకెంత కష్టం ఉండాలె. ఎన్నడయినా సోంచాయిస్తివా.. అహ.. సోంచాయిస్తివా...

అడివమ్మ: పోయినసారి గిట్లనే వచ్చిండు. గిట్లే మాయ మాటలు జెప్పిండు. ఓట్లేపించుకున్నడు. మల్ల... ఇక్కడి దిక్కు జూస్తే ఒట్టు. ఇప్పుడు మల్ల ఎలక్షన్లు వొస్తున్నయి..ఒకనెంట ఒకడు దిగుతున్నడు.

నాయకుడు: (వాల్లనేమీ పట్టించుకోకుండా) నా ప్రియమైన నవాబ్‌పేట ప్రజలారా.. ఈ పథకాలన్నీ మీ కోసమే.. మీ కోసమే.

అందరూ: ఎయ్యిన్రక్కా.. ఎయ్యిన్రి.. ఒకటడిగితే ఒకటి చెప్తుండు. నీల్ల కోసమడిగితే సొల్లు గారుస్తున్నడు. నడువ్.. ఈడికెల్లి నడువ్ (అందరూ తిట్టుకుంట, దొబ్బుకుంట ఊరెల్ల గొడుతారు)

ముసలమ్మ: (చేతిలో కట్టెతో) హమ్మాయ్యా.. నా కొడుకు గీ గెట్టు దాటితే .. సంగతిజెప్తం. నీల్లు తేవాలె.. ఊల్లకు రావాలె. ఉంటే ఉంటం. పోతే పోతం.

బాలమ్మ: ఔమల్ల. గీనీల్ల సంగతి యాదో ఒకటి పరిష్కారం రావాలె

జంగమ్మ, అడివమ్మ: ఔనౌను. ఏదో ఒకటి శాశ్వతంగ పరిష్కారం గావాలె.

(నేపథ్యంలో) సాధిద్దాం.. సాధిద్దాం..

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల్ని సాధిద్దాం.

ఇటీవలి విప్లవ కవిత్వం నిర్మాణ, అవగాహన సమస్యలు

- రివేరా

చూపు ఉన్న కవిత్వం / శిశువు చిరునవ్వు వంటి కవిత్వం / ప్రేమతో వివశమైన కవిత్వం / కన్నతల్లి మమకారం వంటి కవిత్వం కష్టజీవికి ఇరువైపులా నిలిచేదే కాదు / కష్టజీవి మార్గంలో కరదీపికైన కవిత్వం / అపార మానవానుభవ కాసారంలో / సారమైన కవిత్వం / అగాథ జీవిత సముద్రాన్ని తరచి / ముద్దయిన కవిత్వం / ప్రజాస్వామ్య భావమైన కవిత్వం/ ప్రజాయుద్ధరావమైన కవిత్వం.. (అరుణతార, 300వ కవిత్వ ప్రత్యేక సంచిక)

రమారమీ 40 ఏళ్ల విప్లవ కవిత విస్తరణను, పరిణామశీలతను; సారాన్ని, తాత్వికతను; మానవ సంబంధాల అనుస్పర్శను, సామాజిక సంబంధాల ఎరుకను; చారిత్రక భూమికను, వర్గ వాస్తవికతను బలంగా పట్టుకున్న విప్లవ కవితా చరణాలు ఇవి. శీర్షికను పరిశీలిస్తే.. వర్క్‌షాపు కోసం ఈ పాఠాన్ని తయారు చేయడం, చెప్పడం వెనక, సాధించాలనుకుంటున్న ప్రయోజనమంతా ఈ పాదాల్లోనే ఇమిడి ఉంది. ఏమిటా ప్రయోజనం అని చూస్తే, ఒక సామాజిక వస్తువుకి లేక సందర్భానికి స్వీయాత్మక అనుభవం నుంచి రాజకీయ ప్రయోజనాన్నీ, కళా ప్రయోజనాన్నీ పొందేవిధంగా కవితా రూపం ఇవ్వడం ఎలాగనేది అధ్యయనం చేయడం, సాధన చేయడం. దానితోపాటు అంతకంతకూ వస్తు విస్తృతిని సాధిస్తూ, మనం రాస్తున్న కవిత్వంలోని సంక్లిష్టతని అధిగమించడం కూడా అవసరమే. సాహిత్య, సామాజిక సంబంధాల క్రమం చెడని మేర ప్రయోగశీలతని కూడా సాధించాల్సి ఉంటుంది. నిజానికి ఈ 'మేర' అనేదే కవిత్వతత్వాన్ని అర్థం చేసుకోవడంలో అతి ప్రధానమైనది. రాజకీయ ప్రయోజనం లేని కళకు ఇసుమంత సామాజిక విలువ లేనట్టే.. కళాత్మకం కాని రాజకీయ భావధార ఏమైనా కావచ్చుగానీ కవితార్థం కాలేదు అని అంటుంటారు. 'మేర'కు సంబంధించిన స్థూల అవగాహన ఇదేననుకోవచ్చు.

వేనవేలేండ్ల చారిత్రక భౌతిక సత్యాలు / చాటిచెబుతున్న వర్గ పోరాట దృక్పథం నుండి / సామాజిక పరిణామాల శాస్త్రీయ అవగాహన నుండి / నిజాన్ని గ్రహించు (ఎర్రగాలి, 1973)

ఈ పాదాల్లో చారిత్రక సత్యాలన్నీ ఉన్నాయి. లేనిదల్లా కవిత్వమే. కవిత్వం లేకపోవడం అంటే వచనంతో నిండిపోవడమా? అయితే ఈ పాదాలను పరిశీలించండి.

మూలాలంటే.. / మలిగిపోతున్న హృదయగత పురా బంధమేనా / ఆలోచనలపై వేలాడే సంకెల కూడా.. / ఆదివాసీ అంటే విరిసే వెన్నెలతో కవిత్వ పారవశ్యమయ్యే తెలుపు నలుపు చిత్రాలు మాత్రమేనా / విశాలమైన ప్రకృతిలోని ఇరుకిరుకు లోకానికి దీర్ఘ బందీ కూడా.. (కవితా ఝుంకార్, సగానికిపైగా.. 2012 సెప్టెంబర్)

ఇదీ వచనంలోనే ఉంది. చారిత్రక గతితార్కిక మూలాల గురించే ఇది కూడా మాట్లాడుతున్నది. కానీ కవిత్వ రూపం సంతరించుకోగలిగింది. నిజానికి భాష లాగే వచనం కూడా శిల్ప భాగమే. ఒక తాత్విక స్థాయిలో సాగే గంభీరమైన సంభాషణ ఈ రూపం సంతరించుకుంటుంది. పొలిమికల్ డిబెట్‌లో అంటే విరుద్ధ రాజకీయ సంవాదంలో సీరియస్‌గా పాల్గొనే క్రమంలో అలవడే శిల్ప పద్ధతి ఇది. ఆదివాసీలను వారి మూలాలలోనే ఉంచేయాలని, వారి ప్రాకృతిక జీవనంలో కార్పొరేట్లు గానీ, మావోయిస్టులు గానీ జోక్యం చేసుకోరాదనే అస్తిత్వవాద ధోరణికి కౌంటర్ ఈ కవిత. ఇలా తప్ప మరేవిధంగానూ ఈ చర్చ కవిత్వ వ్యక్తీకరణను పొందలేదు. కాబట్టి, ఏ శిల్ప పద్ధతిని కవిత్వం సంతరించుకోవాలనేది అంతిమంగా నిర్ణయించేది వస్తువే. పైన ఉటంకించిన ఎర్రగాలి కవితలోని పాదాలు కూడా తీవ్రమైన పొలిమికల్ డిబెట్‌నే వ్యక్తీకరిస్తున్నాయి. కానీ నిర్దిష్టత కొరవడింది. సిద్ధాంత విషయాలకు అనిర్దిష్ట గుణం ఉంటుందనేది వాస్తవం. అంటే, ఎటువంటి సందర్భంపైనైనా సాధారణ అంచనాను సిద్ధాంతం అందించగలుగుతుంది. దాని వెలుగులో సాగించే ఆచరణ మాత్రం అత్యంత నిర్దిష్టమైనది. మనం సాహిత్యం సృష్టించేది ధర్మబోధతో సరిపెట్టడానికి కాదు. మనుషులను విప్లవ ఆచరణలోకి నడిపించడమే విప్లవ కవిత లక్ష్యం. కాబట్టి అనిర్దిష్ట విషయాల అన్వయింపులో నిర్దిష్టతని తప్పనిసరిగా పాటించాలి. దీన్నే భావనలను భావాలుగా మార్చడమని అంటున్నాం. ఈ స్థితిలోనే భావనలు కవిత్వ రూపం సంతరించుకుంటాయి. లేదంటే 'ఎర్రగాలి' కవి ఎదుర్కొన్నలాంటి సమస్యలే మనకు కూడా ఎదురవుతాయి. వస్తువు ప్రాధాన్యాన్ని చెప్పే మరొక ఉదాహరణ ఇచ్చి.. శీర్షిక వద్దకు వస్తాను.

మిమ్మల్నేమంటాం / మిమ్మల్నేమనం/ మిమ్మల్నేం చేయమంటాం/ మిమ్మల్నేం చేయమనం / మమ్మల్ని మేమే అనుకుంటాం / మిమ్మల్నేం అనలేదు బాబూ /అయుసుంటే అది బతుకుద్ది / లేదంటే లేదు / మిమ్మల్నేం అంటం లేదు బాబూ / మా కడుపుమంట అలా కక్కింది బాబూ (1976, ఆసుపత్రి గీతం దీర్ఘ కవిత). ఈ కవితా పాదాలకు సౌందర్యాన్ని అద్దినది దాని శైలే అంటే భాషా వ్యక్తీకరణ. ఆస్పత్రి అనే వ్యవస్థలో మలిగిపోయి మార్చురీకి చేరే అట్టడుగు పీడిత వర్గాల స్వరం ఇక్కడ మనకు వినిపిస్తుంది. పైన ఎలాగయితే.. వచనాన్ని డిమాండ్ చేసిందో, అలాగే ఇక్కడ శైలిని వస్తువు డిమాండ్ చేసింది. లేదంటే వ్యవస్థ సారాన్ని కవి ఇంత సమర్థంగా అందించలేడు.

ఇదంతా ప్రపంచం గొడవ

కవిత్వంలో సమస్యలకు మూలాలను ప్రపంచ సమస్యల్లోనే వెతుకులాడుకోవాలనేది స్థూల అవగాహన. కవిత్వం ఎలా ఉంది అనే ప్రశ్న.. ప్రపంచం ఎలా ఉందనే ప్రశ్నతో ముడిపడి ఉంటుంది. కవిత్వం ఎలా ఉండాలనే అంచనా.. ప్రపంచం ఎలా ఉండాలనే అవగాహనను చర్చకు పెడుతుంది. కాబట్టి, కవిత్వం, కథ లేక నవల, నాటకం.. ఏదైనా కావచ్చుగానీ, అది ఎదుర్కొనే అవగాహనపరమైన, నిర్మాణపరమైన సమస్యలను కేవలం ప్రక్రియ

సమస్యగానే చూడటం సరికాదు.

నేడు నా కంట్లో సివంగులే / నిద్రలో నిలిచే ఫిరంగులు / కాళ్ల చుట్టూ కపాలాలే / కావ్యగీతి కలాపాలు (ఖడ్గ సృష్టి, మంచి ముత్యాల సరాలు, 1955-1965)

ఇంచుమించు అందరు కవులదీ ఇదే పరిస్థితి. సాధారణంగా మన ప్రపంచంలో ఏమి ఉంటుందో మన కవిత్వంలో అదే ఉంటుంది. మన ప్రపంచంలో విదేశీ వీసాలు, రాయల్‌ఫీల్డ్ బైకులు, బీడబ్ల్యూ కార్లు, డూప్లేస్ నివాసాలు ఉంటే కవిత్వంలోనూ అవే ఉంటాయి. మన ప్రపంచంలో శాలువాలు, అవార్డులు, పీఠాలు ఉంటే కవిత్వంలోనూ అవే తొణికిసలాడతాయి. మన ప్రపంచంలో పదోన్నతులు, ప్రభుత్వ పదవులు, ప్రభుత్వ సంస్థల్లో స్థానాలు, కార్పొరేట్ సాహిత్య మేళాలు, వాటిలో సభ్యత్వాలు ఉంటే అవే కవిత్వంలోనూ తొంగిచూస్తాయి. మన ప్రపంచంలో స్వీయ అపజయాలు, వైఫల్యాలు, అవమానాలు ఉంటే అవే కవిత్వాన్ని తాకుతాయి. ఆకాంక్షలు పెరుగుతూ అవకాశాలు కుదించుకుపోతున్న దశలో.. మన ప్రపంచంలో వ్యక్తి ఎదుగుదల, కుటుంబం, చుట్టూ ఉన్న కొద్దిమంది, శ్రేణి, సమూహానికి చెందిన సంక్షేమం, విముక్తి భావనలు ఉంటే అవే కవిత్వాన్ని నిర్దేశిస్తాయి. మన ప్రపంచంలో నకల దుఃఖా:లను రద్దుచేసే అమ్మ లాంటి చల్లని చెయ్యి కదలాడుతుంటే, అదే మన కవిత్వానికి కాపు కాస్తుంది.

చెట్టు విసనకర్రే కాదు / విల్లంబు కూడా / ఉద్యమాల్లో యుద్ధాల్లో అలసిపోయిన/ అవయవాల్నీ ఆలోచనల్నీ / కొమ్మచేతుల మీద మోసుకుపోయే/ అమ్మ నా చెట్టు (అమ్మ చెట్టు, 1979)

ఇలా.. ఒకే ప్రపంచం కప్పు కింద నిలబడి కవులు ఇన్ని రకాల ప్రపంచాల్లో జీవిస్తుంటారు. కొందరు రెండు మూడు ప్రపంచాల్లోనూ భ్రమణాలు చేస్తుంటారు. ఒక వ్యక్తి ఇన్ని ప్రపంచాల్లో సంచరించడం సాధ్యమేనా అనే ప్రశ్న ఇక్కడ మనకు రావాలి. 'సత్యము ఒక్కటే.. వాస్తవాలు అనేకం' అనే మాట మార్క్సిస్టు తత్వశాస్త్రంలో చెబుతుంటారు. ఇన్ని ప్రపంచాలు లేకపోవచ్చు. వాటిలో జీవించే కవుల పాట్లకు అర్థం లేకపోవచ్చు. కానీ, వారి భ్రమణ కాంక్షకు ఆధారం లేకపోలేదు. ఒక నిజ స్థితి లేక వాస్తవికతకు సంబంధించిన ప్రతిఫలనమే ఆ కాంక్ష. భౌతిక వరణంలోని వాస్తవిక స్థితిపై ఎన్నితీర్లుగానైనా కవి ఊహాపోహలు పోవచ్చు. ఆ ఊహలు చాలా సందర్భాల్లో అవాస్తవాలుగానూ తేలవచ్చు. కానీ, ఆ ఊహకి ఆధారభూతమైన నిజస్థితి మాత్రం ఎన్నటికీ అసత్యం కాజాలదు.

నా ముఖంలోని అరుణిమ నీకు వెగటయింది / నీ నీలినీడ నన్ను కలవరపెట్టింది / ఇంతకూ ఈ దూరం ఎలా మొలిచింది / ఈ భారం ఎలా గాయమైంది / మనిద్దరి కాళ్లూ ఒకే భూమిపై నిలబడినప్పుడు / అది మనిద్దరిదీ కావల్సిందే (కలిసి పాడాల్సిన గీతమొక్కటే, దీర్ఘకవిత, 1997)

సరిగ్గా.. ఈ అవగాహనతోనే అస్తిత్వవాద ధోరణులతో మనం వ్యవహరిస్తూ ఉంటాం. ఈ ధోరణుల్లో చరిత్ర వ్యతిరేక, సామాజిక పరిణామ వక్రగతి అంచనాలు ఎంతైనా ఉండవచ్చు. అవి 'అనేక సత్యాల' గురించి మాట్లాడవచ్చు. చాలా సందర్భాల్లో తాత్విక డొల్లతనాన్ని బయట పెట్టుకోవచ్చు. వాటి ఆయు: ప్రమాణం నాలుగైదు ఏళ్లకు మించి ఉండకపోవచ్చు. అలాగని ఈ ధోరణులు లేవనెత్తే అంశాలు, వేసే ప్రశ్నల పట్ల విరసం ఏనాడూ అశ్రద్ధ చూపలేదు. ఈ ధోరణులపై విమర్శని కలిగి ఉంటూనే.. వాటితో కలిసి వీలైనన్ని ఎక్కువ వేదికలు పంచుకోవడానికి విరసం నాయకత్వం తొలినుంచీ ప్రయత్నిస్తున్నది. అవి ముందుకుతెచ్చిన ప్రతీకలు, నమూనాలు, తాత్విక ప్రతిపాదనలపై సామాజిక సిద్ధాంతం పునాదిపై నుంచి పరిశీలన జరిపి.. పొల్లుకు పొల్లు రెల్లుకు రెల్లు చేస్తూ ఉంది. ఈ ధోరణులు తెరపైకి వచ్చిన చారిత్రక సామాజిక సందర్భానికి గల బలాన్ని ఒకవైపు గుర్తిస్తూనే.. ఈ సందర్భాన్ని సాహిత్యంలోకి తీసుకొస్తున్న పద్ధతిని, దాని తాలూకూ అవగాహన, వ్యక్తీకరణలపై మరోవైపు నిశిత విమర్శను పెడుతూ వస్తున్నది. మన విరసం నాయకత్వం గతితార్కిక క్రమంలో కొనసాగించిన ఈ సంవాదం, సంభాషణల నుంచి తీసిన సాధారణ అంచనాలే.. వర్గేతర సామాజిక, సాహిత్య ధోరణులతో వ్యవహరించడంలో మనకిప్పుడు మార్గదర్శకం చేస్తూ ఉన్నాయి. ఈ క్రమాన్నంతా పైపైనే చూసినవారు.. అస్తిత్వవాద ధోరణుల పట్ల విరసం ఉదారంగా ఉన్నదనే భావనకు లోనవవచ్చు. కానీ అది వాస్తవం కాదు. ఆ ధోరణులకు ఆధారభూతమైన వాస్తవికత లేక నిజ స్థితి అనేది సామాజిక సంబంధాల్లో సత్య ప్రవాహంలా కొనసాగుతూ ఉన్నదనే అవగాహనే వాటి పట్ల మన వైఖరిని నిర్దేశిస్తూ ఉంది. విప్లవోద్యమంలోకి భిన్న సామాజిక నేపథ్యాల నుంచి వస్తున్న శ్రేణులు, సమూహాలతో పోరాట శక్తుల కూర్పులో వచ్చిన మార్పు కూడా విప్లవ సాహిత్యోద్యమానికి ఈ రకమైన ఆలోచనలను అందిస్తున్నదనేది మనం విస్మరించరాదు.

ఊహలకూ పునాది ఉంది

ఈ చర్చను అలా ఉంచినా.. కవులకు తాము జీవిస్తున్న ప్రపంచం పోనీ ప్రపంచాల సారం అందుతున్నదా? పోనీ.. తమ ఊహలకు అనుగుణంగానైనా తమ ప్రపంచాన్ని వారు నిర్మించుకోగలుగుతున్నారా అనేది పెద్ద ప్రశ్నే. ఈ ప్రశ్న.. కవి అవగాహనను, అతను/ ఆమె కవిత్వ నిర్మాణ శ్రద్ధను చర్చలోకి తీసుకొస్తుంది. వస్తువుని కవిత్వమయం చేయడంలో ఇవి రెండూ ముఖ్యమైన అంశాలే. సమపాళ్లలో అని చెప్పలేం గానీ, ఎందుకంటే అవి ఒకే మోతాదులో కవిత్వ నిర్మాణంలో పాలు పంచుకోవు. కవిత్వమనేకాదు, సామాజిక ఆచరణ విషయంలోనూ, దానిలోని వివిధ భాగాలు, ఉప భాగాల మధ్య సమపాళ్ల సూత్రాన్ని యథాతథంగా వర్తింపజేయలేం. కూర కోసం అరకేజీ బెండకాయలు కోసి.. అంతే మోతాదులో ఉప్పు, కారం వేయం కదా! కాబట్టి సమపాళ్లు లేక సమాన ప్రాధాన్యం అనే భావనని సగం సగం అని కాకుండా, సరిపడా మోతాదు అని అర్థం చేసుకుంటే సరిపోతుందేమో! కాబట్టి కవిత్వంలో మన నిర్మాణ శ్రద్ధ, అవగాహన అనేవి సరిపడా మోతాదులో ప్రతిబింబించాలి. నిర్మాణ శ్రద్ధ తగ్గిన అవగాహన వల్ల సైద్ధాంతిక పరిభాష నేరుగా కవిత్వంలోకి వచ్చే ఇబ్బంది ఉంటుంది. ఈ విషయాన్ని ఇప్పటికే పరిశీలించాం. ఈ తరహా కవిత్వంలో ముగింపు బలమైన ఉద్యమ ఆకాంక్షని వ్యక్తం చేస్తుందిగానీ, ఆ బలం కవితా నిర్వహణలో కనిపించదు.

కొందరు మాంత్రికులూ, వారి అనుచరులూ / ఒక్క చెమట చుక్క కూడా రాల్చకనే / ముడి ఇనుము గనుల్లో, బొగ్గు బ్లాకుల్లో / చివరకు గాలి తరంగాల్లో సైతం / కోట్ల రూపాయలు పండించుకుంటున్నారని అంటున్నారు / రూపాయలు చెట్లకు

కాయవనే మాట సరేగానీ / ఈ మాంత్రికులు ఔపోసన పట్టిన మంత్ర రహస్యం వివరించండి / మాకు తెలుసు మీరు వివరించలేరని / ఇక మేమే తెలుసుకోవాలి.. తేల్చుకోవాలి (చెట్లూ - రూపాయలు - కొన్ని రహస్యాలు, అరుణతార, 2013 ఏప్రిల్) విదేశీ, స్వదేశీ కార్పొరేట్ కంపెనీల దోపిడీ పట్ల కవికి విశేషమైన అవగాహన, ఆగ్రహం ఉన్నాయి. సందర్భం కూడా తగినదేనని ముగింపు వాక్యాలు తెలుపుతున్నాయి. కానీ, ఎక్కడా కవిత్వం అయిన ఛాయలు కనిపించవు. ముఖ్యంగా ప్రతీకలు, పదబంధాల పట్ల కొంచెం శ్రద్ధ పెట్టి ఉండొచ్చుననిపిస్తుంది.

అదే, అవగాహన కొరవడిన నిర్మాణ శ్రద్ధ.. .వస్తువుని నిరాకరించే రూపవాద ధోరణి వైపు మనల్ని లాక్కు పోతుంది.

ప్రజల మీదే రాయి / ప్రజల్లోని అగాధ గాధల మీదే రాయి / కవిత్వం రాయి / కాగితం మీంచి కన్నులోకి వెన్నులోకి గన్నులోకి / దూసుకుపోయే కవిత్వం రాయి (కవితా ఓ కవితా సంకలనం, కవిత్వం కావాలి కవిత్వం, 1989). ఎంతో సరళంగా, అప్పీల్‌లా ఈ కవితా చరణాలు ఉన్నాయి. కానీ, తరచి చూస్తే, ముఖ్యంగా 'ప్రజల మీదే రాయి' అనే పాదాన్ని చూస్తే, విప్లవ కవిత్వం పట్ల కవి అహంకారపూరిత వైఖరి కనిపిస్తుంది. 'మీరు అంతకుమించి ఏమి రాస్తారు కాబట్టి' అనే దారుణమైన వ్యంగ్య కోణం, 'అన్ని కవిత్వాల్లాంటిదే విప్లవ కవిత్వం' అనే మొంటు నిర్ధారణ కనిపిస్తాయి. 'ఏమైనా చెప్పు. కానీ కవిత్వం చెప్పు' అని చెప్పడంలోనే విప్లవ కవిత్వ సారాన్ని నిరాకరించే లక్షణముంది. దానితోపాటు వస్తువుని త్యజించే గుణమూ ఉంది.

వొక ద్రౌపతి అయిదు శరీరాల్తో / ఆకాశమంత చీరలో / సముద్రమంత పరుపుచుట్టలో / ఇంకిపోయిన కొన్నెరుపు / రాత్రి మింగేసిన కల సూర్యుదు / కుర్చీ నిండా వొక మౌన హింస పాతపేటిక (నలుగురు పాండవులు, మే 2001) రూపవాదం పుష్కలంగా దట్టించిన పాదాలు ఇవి. లైంగిక సంబంధాల్లోకి పురుషాధ్యకత చొరబడటం వల్ల పడగ్గదులన్నీ హింసాతల్పాలుగా మారుతున్నాయనే అర్ధ ఛాయ ఉంది. కానీ, ప్రతీకల ద్వారా అందాల్సిన వస్తువు తాలుకూ వివరాలను కవి కావాలనే బ్రేక్ చేశాడు. అంటే వస్తువుని నిరాకరించే ప్రయత్నం చేశాడు. కానీ, ఈ కవే కాదు, ఏ కవీ ఇలాంటి ప్రయత్నాల్లో ఎప్పటికీ సఫలం కాలేదు. ఎందుకంటే వస్తు నిరాకరణ అనేద కూడా ఒకరకమైన వస్తువే. మనకు ఈ కవి అర్ధఛాయగానైనా అర్ధం కావడం ఆయన గొప్ప కాదు. చారిత్రక, సామాజిక పునాదిపై తాత్విక, భావజాల భరితమైన వస్తువుకు ఉన్న బలం అది. ఇలాంటివారి గురించే మన కవి ఏమన్నాడంటే.. ఎందుకురా కవీ / గిజిబిజి ఇమేజీ / అస్పష్ట కవిత్వం కన్నా / ఆల్జిబ్రా ఈజీ (సిటీలైఫ్, 1992). ఇక్కడ అస్పష్ట కవిత్వం అనే కన్నా సంక్లిష్ట కవిత్వం అనడం బాగుంటుంది. ఎందుకంటే కవిత్వంలోని అస్పష్టతకు కవిని పూర్తిగా బాధ్యుడిని చేయలేం. ప్రకృతి, సామాజిక వరణాల్లోని అనేక పరిమితులు కవిత్వ వ్యక్తీకరణలో, కవి అవగాహనలోని పరిమితులుగా వ్యక్తం అవుతాయి. ప్రాథమికంగా కవిత్వం అంటే పోలికేనని చెబుతుంటారు. తానున్న స్థితిని మనిషి ప్రకృతిలోని ఏదైనా దృశ్యంతో పోల్చుకుంటూ ఉంటాడు. మనిషిలాగే ప్రకృతి, సమాజం కూడా నిత్యం కదలికలోనే ఉంటాయి. అయితే, మనమెలాగయితే ఒక క్రమంలో దారిన నడుస్తుంటామో.. అవి కూడా అంతే క్రమబద్ధంగా కదులుతుంటాయి. కాబట్టి పోల్చినప్పుడు ప్రకృతి లేక మరో వరణానికి సంబంధించిన కదలికని, దాని క్రమాన్ని మనం గ్రహించగలగాలి. అప్పుడే మనం ఒక పదచిత్రం వేసినా, పదబంధం నిర్మించినా, ప్రతీకగా సూచించినా చక్కగా సరిపోతుంది.

ఉదాహరణకు.. విత్తనం మరణిస్తూ.. పంటని వాగ్దానం చేస్తుంది అని కవి అంటారు. ఇక్కడ సందర్భం ప్రకృతి, ఉత్పత్తి, చేతనకు మధ్య ఉన్న లంకె. విత్తనం తన రూపం కోల్పోతేనే మొక్క అవుతుంది. ఈ ప్రాకృతిక గుణం సమాజానికి తిండిపెట్టి, పెంచి పెద్ద చేస్తుంది. ఇది సామాజిక ఉత్పత్తిని నేరుగా ప్రభావితం చేసే అంశం. విత్తనాన్ని త్యాగానికి కూడా ప్రతీకగా చూడవచ్చు. మనం చేసే త్యాగాలు వృధా కావు, అవి సోషలిజం అనే పంటని అందిస్తాయనే మానవ చేతననీ ఈ కవితా పాదాలు అందిస్తున్నాయి. ఇంత గొప్ప కవితకూ ఒక పరిమితి ఉంది. విత్తనం మరణించి పంటని వాగ్దానం చేసింది. అది ప్రకృతికిగల గొప్ప శక్తి. కానీ, ఆ పంట ఎవరికి చెందాలనేది ఎంత శక్తి ఉన్నా ప్రకృతి నిర్దేశించగలదా? అంటే పరిమితి ఉన్నట్టేగా? అది సామాజిక పరిమితి. సామాజిక ఉత్పత్తిలో పాల్గొనే శక్తుల కూర్పు మాత్రమే దీన్ని నిర్ణయించగలదు. అంటే అంతిమంగా సామాజిక చలన సూత్రాల ఆధిక్యతే ఇక్కడ పని చేస్తుంది. ప్రకృతికి సంబంధించిన ఏ అంశాన్ని పోల్చినా.. ఈ సామాజిక ఆధిప్య లక్షణం వల్ల కవిత్వంలో సహజంగానే ఎంతోకొంత కొరత, లోటు మిగిలే ఉంటుంది. దాన్నే మనం అస్పష్టత అంటున్నాం. కానీ, సంక్లిష్టత అలా కాదు. కవి దర్శనం, వ్యక్తీకరణలోని సమస్యలకు అది ప్రతిబింబం.

దీన్నే కవి 'ఎందుకురా కవీ! గజిబిజి ఇమేజీ' అని ప్రశ్నిస్తున్నాడు.

'సాధనంబున సమకూరు ధరలోన' అనేది నిజమే. కానీ, మన సాధన మన సారాన్ని తినేసే సాధనగా ఉండకూడదు. మన సామాజిక ఆచరణలోని బలాన్ని అంతే బలంగా కవిత్వంలో వ్యక్తీకరించేందుకు అది ఒక సాధనం కావాలి. దీనికి అవగాహన ప్రధానం. కవిత్వతత్వాన్ని ప్రపంచ తత్వంతో కలిపి అర్థం చేసుకోవడమే కవిత్వ అవగాహన అని చెప్పవచ్చు. ఇంకా తేలిగ్గా చెప్పాలంటే ఉన్న ప్రపంచాన్ని ఎంత బాగా అర్థం చేసుకోగలుగుతాం అనేదాన్ని బట్టి రేపటి ప్రపంచ స్వరూపం అవగతమవుతుంది. అలాగే.. ఉన్న ప్రపంచానికైనా, రేపటి ప్రపంచం విషయంలోనైనా మౌలికంగా పాటించాల్సిన నిర్మాణ సూత్రాలు, పద్ధతులు కొన్ని ఉండితీరుతాయనేది మనం గుర్తుంచుకోవాలి. విప్లవ కవిత్వ నిర్మాణం విషయంలో మనకిలాంటి దృష్టి ఉండాలి.

వణుకుతున్న శరీరాలతో ఎవరు ధరిస్తారు / కత్తిరించిన ఆమె చిటికెన వేలును / కవి తడిచేతులతో / గదంతా / మూల మూలా ముట్టుకొని తాకి తడుముతాడు / తెగిపోయిన చిటికెనవేలును దేవులాడుకొచ్చి/ ఒలికి తడియారని రక్తంలో ముంచి/ ఒక సంకేతం లిఖిస్తాడు / అది కవులకే గాదు / వీరులందరికీ అందుతుంది (సంకేతం, మన సమాజం , సెప్టెంబర్ - అక్టోబర్ 1996). విప్లవ క్రమంలో ప్రజలు అజేయులు అనే సత్యాన్ని కవి చెబుతున్న 'సంకేతం' సూచిస్తున్నది. సింగరేణి కాలరీస్‌లో 1996లో రమాకాంత్ అనే సికాస నాయకుడిని సజీవంగా పట్టుకొనే దమ్ము లేక, ఇంట్లోనే పెట్టి పోలీసులు తగులబెట్టారు. ఈ సమయంలో ఆయనకు ఆశ్రయమిచ్చిన నిరంజన అనే స్త్రీ చిటికెన వేలును కోసేయడం ఇక్కడ సందర్భం.

రమాకాంత్ వీరోచిత మరణం అప్పట్లో కవులను ప్రేరేపించింది. ఆ ప్రేరణకు అనివార్యంగా జత పడాల్సిన అంశాన్ని కవి ఇక్కడ గుర్తుచేస్తున్నాడు. సమాజానికి అవసరమైన ఎరుకని ఆ సమాజ కదలికలో భాగమైన కవి మాత్రమే అందించగలడనేందుకు ఈ కవిత మంచి ఉదాహరణ. పైగా, సామాజిక, సాహిత్య సంబంధాల మధ్య గతితార్కిక క్రమం ఎలా రూపొందుతుందో కూడా చూడవచ్చు.

మంచిచెడ్డల మీమాంస

విప్లవ కవిత్వం బాగాలేదనే మాటని తరచూ వింటుంటాం. బహుశా ఒకప్పుడు విప్లవ కవిత్వం బాగుండేదనే ధ్వనో లేక సమకాలీన కవిత్వంతో ఏమాత్రం తూగలేకపోతున్నదనే ఆక్షేపణో ఈ వ్యాఖ్యల్లో ఉండి ఉండాలి. కవిత్వం బాగుండటం, బాగా లేకపోవడం ఏమిటి అనేది వెంటనే తట్టే ప్రశ్న. ఈ గుణదోషాల నిర్ధారణ ఎవరు చేయాలి? ఈ పని కవులే చేయాలని కొంత కాలం అనుకున్నారు. ఆ తరువాత కవిత్వ పరిణామం తెలిసి ఉంటే.. కవి కాకపోయినా ఫరవాలేదు అని మరికొంత కాలం నడిపించారు. నిజానికి కవిత్వ పరిణామాల నుంచి, చారిత్రక ప్రాధాన్యతల గురించి ఆలోచించుకొని.. ప్లాన్ చేసుకొని కవి రాయడు. కాబట్టి, కవిత్వ విమర్శని కవికి వదిలిపెట్టకుండా, దాన్నొక ప్రత్యేక విభాగంగా అభివృద్ధి చేయాల్సి ఉంటుందని స్థూలంగా ఒక ఏకాభిప్రాయమేదో కుదిరినట్టు ఉంది. ఈ విధంగా ముందుకొచ్చిన విమర్శకుల్లో ఎక్కువమంది విరసం మిత్రులే ఉన్నారు. కవిత్వ విమర్శ గురించి మనమిప్పుడు చదువుకుంటున్న పుస్తకాల్లో ఎక్కువభాగం వీరివే. విరసంపై విమర్శతో కొనసాగుతున్నవారు లేదంటే విప్లవ సాహిత్యోద్యమంపై విషం కక్కడమే పనిగా పెట్టుకున్న మరికొందరు కూడా విప్లవ కవిత్వంపై తమ అంచనాలను ఇస్తూ ఉంటారు. విప్లవ కవిత్వానికి శిల్ప శ్రద్ధ కొరవడిందని, ప్రయోగాలపై దృష్టి పోయిందని వీరంతా విమర్శించారు. మిగతా కవిత్వాల్లాగే విప్లవ కవిత్వం సంక్లిష్టతని ఛేదించలేకపోతున్నదని, పరిణామశీలతని కోల్పోతున్నదని విరసం మిత్రులు అనుకున్నవాళ్లే పెదవి విరిశారు. అయితే, వీరందరితో మన సంస్థకు, మనకు ఎలాంటి సంబంధం ఉన్నదనేదానితో పని లేకుండానే.. వీరి విమర్శ పద్ధతిని నిశిత పరీక్షకు గురి చేయాల్సిన అవసరం ఉందనిపిస్తున్నది. కనీసం రెండు విషయాల్లోనైనా వీళ్ల పరిశీలనా దృక్పథంపై లోతుగా ఆలోచనలు చేయాల్సి ఉంది. మనల్ని, అంటే విప్లవ కవిత్వాన్ని విమర్శించారు కాబట్టి చాకిరేవు పెడదామనేది కాదు ఇక్కడ ఉద్దేశ్యం. నిజానికి, విప్లవ కవిత్వాన్ని భుజాన మోసుకుతిరిగిన రోజుల్లోనూ, ఆ పనిని ఉద్యమంలా చేసిన వారి అవగాహనలోనూ అనేక సమస్యలు ఉన్నాయి. వాటితో సహా ప్రతి అంశాన్నీ చర్చకు పెట్టి నిగ్గు తేల్చాల్సి ఉంది. కవులను, కవిత్వ ఉద్యమాలను కలిపే అంశాలు చాలానే ఉంటాయిగానీ.. వాటికి ప్రత్యేతకని కల్పిస్తున్న అంశాల గుర్తింపు ద్వారానే ఈ ఐక్యత బలపడుతుంది. ఉదాహరణకు వ్యష్టి, సమిష్టి అనే ద్వంద్వాలనే తీసుకుందాం. సమిష్టిలో వ్యక్తి విముక్తి ఉంటే, వ్యక్తి విముక్తికి సమిష్టి హామీ పడుతుంది. ఈ రెండింటిని వేరు చేస్తున్న అంశాలేవో ముందుగా గుర్తిస్తేనే.. వాటిని కలిపి ఉంచే అంశాలను గుర్తించడం తేలిక అవుతుంది. అంటే వాటికి గల ప్రత్యేక లక్షణాలను ముందుగా గ్రహించాలి. వాటి ఆధారంగా సార్వజనీన లక్షణాలను వెలికితీసి.. ఆ పునాదిపై వ్యష్టిని, సమిష్టిని ఏక సూత్రంపై నిలబెట్టాలి. ఎందుకనో ఇలాంటి కొలమానాలకు కవిత్వ విమర్శలో చోటు ఉన్నట్టు కనిపించదు. కవిత్వ ఉద్యమాలను, కవులను ఒకే గాటన కడుతున్నారా అని కూడా అనిపిస్తూ ఉంటుంది. ఉదాహరణకు.. సంక్లిష్టత అనే సమస్యని ఇప్పటికే మనం చర్చించాం. దీన్ని అధిగమించాల్సింది కవులా లేక కవితా ఉద్యమమా? ఈ విషయంలో కవికి ఉద్యమాలు సహాయకారులవుతాయిగానీ, సంక్లిష్టతని అవైతే తెచ్చిపెట్టవు కదా! అలాగే. పరిణామ శీలత.. దీన్ని సాధించాల్సింది కవితా ఉద్యమమా? లేక కవులా? ఈ విషయంలో కవుల విశిష్ట కృషి ప్రభావితం చేయొచ్చుగానీ, అంతిమంగా పరిణామశీలత అనేది ఉద్యమ వ్యక్తీకరణగానే ఉంటుంది. ఎందుకనో ఈ తారతమ్యం విమర్శకులకు అంతగా అందలేదనిపిస్తుంది. ఉద్యమాలను, ధోరణులతో కలిపి మాట్లాడటం వెనకా తాత్విక పరిమితి ఉన్నట్టు తోస్తుంది. సామాజిక ఉద్యమాలతో ఉండే బంధమే విప్లవ కవిత్వాన్ని గిడసబారుస్తున్నదని సూత్రీకరించేదాకా ఇలాంటి పరిశీలన ప్రయాణించింది. అంతిమంగా అది వారిని 'చరిత్ర అంతం', 'అనేక సత్యాల'ను ప్రతిపాదించిన పోస్టుమాడ్నరిజం, ద్రవాధునికతల దిశగా గడ్డకట్టుకునేపోయేలా చేసిందని అనిపిస్తుంది. ఇక రెండో అంశం వస్తు, శిల్పాల పట్ల విమర్శకుల అవగాహన.

వస్తు, శిల్పాల మధ్య ఉన్న అభిన్నత వారికి అందలేదో లేక అప్పటి సామాజిక ఉద్విగ్నతలో వారూ కలిసిపోయారో గానీ.. 1970-80 మధ్య కవిత్వ విమర్శ ప్రధానంగా వస్తు ప్రమాణంగానే జరిగిందని అనిపిస్తుంది. ఈ పదేళ్లు విరసం దశాబ్దం అన్నవాళ్లు ఉన్నారు. 70ల

తొలి ఐదేళ్లు, లేదంటే మలి ఐదేళ్లు మాత్రమే విరసం ఖాతాలోకి చేరతాయని లెక్కలు కట్టిన వాళ్లు ఉన్నారు. ఇలాంటి పనికి ఎవరైనా పూనుకోవడం ఎంతవరకూ సరయిందనే చర్చను అలా ఉంచితే.. కేవలం వస్తు ప్రమాణంగా ఏ కవిత్వాన్ని అయిన ఎలా తూస్తారనేది ప్రశ్న. ఆ దశాబ్ద కాలంలో అడవి అంటే ఊగిపోయిన కవులు ఉన్నారు. ఇప్పుడు దండకారణ్యంతో మనం పెంచుకుంటున్న ఉద్వేగ సంబంధం లాంటిదే ఇది. ఆయుధానికి, వర్గ శత్రు నిర్మూలనకి విలువ, ఆరాధన ఉన్న కాలమది. తెలుగు సమాజ వాతావరణంలో జ్వర పీడన స్థితి ఉండేది. కవులను వివశులను చేసిన ఈ వాతావరణం.. కవిత్వ విమర్శకులనూ బలంగా తాకింది. బహుశా ఇలాంటి స్థితిలోనే వస్తు ప్రమాణాలకు మొగ్గు పెరిగినట్టు కనిపిస్తుంది. ఆ స్థితిలో 'విరసం దశాబ్దం' అంటూ వారిచ్చిన స్టేట్మెంట్లకు విలువ ఇవ్వాల్సిన పని లేదు. ఇదే సమస్య 1980ల తరువాత మరోరూపంలో ముందుకొచ్చింది. ఈ దశలో కవిత్వ విమర్శకులు శిల్ప ప్రమాణాల గురించి ఆలోచించడం మొదలుపెట్టారు. అంటే అప్పటికి పూనకాలు, ఊగడాలు పోయి.. క్రమ గమనం, నిర్మాణం దిశగా విప్లవోద్యమం నడకను పెంచింది. కాబట్టి, మునుపటి సంచలనాలను మునుపటంత వేగంగా సమాజంలో ఆశించలేం. విప్లవోద్యమ నడకలో పెరిగిన నిర్మాణ, విస్తరణ చైతన్యం.. అప్పటిదాకా ప్రబలంగా ఉన్న పాట, కవితా రూపాల కన్నా.. కథ, నవల వంటి ప్రక్రియల్లోనే ఎక్కువ వ్యక్తీకరణను పొందటం మొదలయింది. విప్లవ కవిత్వంలో ఊపు తగ్గినట్టు కనిపించడం ఈ దశలో సహజమే. దాంతో కవిత్వ విమర్శకుల చూపు.. శిల్ప ప్రమాణాలపై పడింది. అంటే వ్యక్తీకరణలు, పరిభాష, ప్రయోగశీలతలను పట్టించుకోవడం

మొదలుపెట్టింది. విప్లవ కవిత్వం వెనకబడిపోయిందనే విమర్శను ప్రకటించారు. విమర్శకులు వెనుకబాటు అంటున్నది విప్లవ కవిత పరిమితిగానే చూడకూడదనేది పై పరిణామాలను బట్టి మనకు అర్థం అవుతున్నది. ఈ పరిమితిని అధిగమించేందుకు నిజానికి విప్లవ కవిత్వం ప్రయత్నించింది. ఈ క్రమంలో దీర్ఘ కవిత ప్రక్రియపై దృష్టి పెట్టింది. జీ కల్యాణరావు 'కాలం', వరవరరావు 'సముద్రం', ఎన్‌కే 'లాల్ బనో గులామీ ఛోడో బోలో వందేమాతరం' తదితర దీర్ఘ కవితలు ఇంచుమించు ఈ కాలంలోనే వచ్చాయి. కానీ, విమర్శకులు మాత్రం విప్లవ కవిత్వానికి కాలం విధించిన పరిమితినే కాదు, దాన్ని అధిగమించేందుకు విరసం చేస్తున్న ప్రయత్నాలనూ చూడలేదు. ముఖ్యంగా సామాజిక సందర్భంలో వచ్చే మార్పులు.. సాహిత్య వ్యక్తీకరణ పద్ధతిని ఎలా మార్చివేస్తాయనేది అంటే ఏ ప్రక్రియలో, ఏ శిల్ప నిర్మాణంలో సాహిత్య విషయాలు పలకాలనేది అంతిమంగా సామాజిక వస్తువే నిర్ణయిస్తుందనే అవగాహనకు దూరం అయిపోయారు.

గులాబీలో అందం తప్ప / ఎరుపు కనిపించదు నీకు / సంగీతంలో సొగసు తప్ప / కసి కనిపించదు నీకు / స్త్రీలో సోయగం తప్ప / మనసు కనపడదు నీకు.. .(ఎగసిపడే ఉప్పెనగా చెమట, అరుణతార, 1985 జనవరి) వీరిని దారి తప్పించిన అంశమే మనల్నీ తాకే అవకాశం ఎక్కువగా ఉంది. కాబట్టి.. స్థూలంగానైనా వస్తు, శిల్ప అభిన్నతను పరిచయం చేసుకోవాలి.

ప్రతిదీ వస్తు నిర్దేశమే..

నిజానికి, వస్తువు గురించి మాట్లాడుతున్నామంటే శిల్పం గురించి కూడా మాట్లాడుతున్నామన్నట్టే. ఎందుకంటే, ఎంతటి ఉదాత్తమైన సామాజిక వస్తువు అయినా కవిత్వం అయిందా లేదా అనేది శిల్పం ద్వారానే గుర్తించగలుగుతాం. ఇది శిల్ప సామర్థ్యానికి సంబంధించిన అంశం కాదు. భౌతిక రూపం లేక వ్యక్తీకరణ జరిగిన పద్ధతిని సూచించే అంశం. కాబట్టి, అది వేరు విషయం కాదు. వస్తువులో అంతర్భాగం. కవిత్వంలో శిల్పం సహా ప్రతి భాగమూ వస్తు నిర్దేశమే. ఇలా అంటున్నామంటే.. శిల్పం పట్ల చిన్నచూపో, వస్తువు పట్ల మొగ్గో ఉండటం వల్ల అంటున్నది కాదు. రైతుల ఆత్మహత్యలు కావచ్చు, స్త్రీలపై అత్యాచారాలు, చితికిపోతున్న చేతి వృత్తులు, మేధో పరాయీకరణ, పోరాడే ప్రపంచాలపై సామ్రాజ్యవాద దాడులు, మిత్రుడి మరణం, దూరమయిన బంధాలు, వదిలివచ్చిన ఊరు.. ఇలా ఏ వస్తువునైనా తీసుకోండి. దానిదైన తాత్వికత ఉండి తీరుతుంది. ఆ తాత్వికతకే మనం కళారూపం ఇస్తుంటాం. ఆ తాత్వికత నేరుగా కవిత్వంలోకి రాదు. రాకూడదు. మన స్వీయాత్మక అనుభవం ద్వారానే అది వ్యక్తం అవుతుంది. అవ్వాలి కూడా. మన స్వీయాత్మక అనుభవం.. ఆ వస్తువు పట్ల ఎంత గాఢతరంగా ఉంటే అంత గాఢమైన కవిత్వాన్ని రాయగలుగుతాం. సామాజిక వస్తువుకుండే తాత్వికతే కవిత్వానికి అసలైన బలం అంటున్నాం కదా! అసలు దానికంత బలం ఎలా వచ్చిందో పరిశీలిద్దాం.

వస్తు వాస్తవికత

ఉత్పత్తిలో పాల్గొనే శక్తుల పొందికే సామాజిక సంబంధాలను నిర్ణయిస్తాయి. ప్రధాన ఉత్పత్తిలో పాల్గొనే శక్తులకు ఉత్పత్తి సాధనాలపైగానీ, అవి సృష్టించే సంపదలపైగానీ ఎలాంటి హక్కు లేకపోతే.. అలాంటి సంబంధాలను దోపిడీ సంబంధాలు అంటున్నాం. అలాంటి సంబంధాలను కలిగిన సమాజాన్ని వ్యక్తిగత ఆస్తి పోగుపడిన సమాజం అంటున్నాం. ఉత్పత్తి సాధనాలూ, సంపదలూ కోల్పోయిన ఈ శక్తుల స్థితిని శ్రమ పరాయీకరణ అంటున్నాం. శ్రమ క్రమంలో సంపదలు మాత్రమే పోగు పడవు. వాటితోపాటు కళలు, సాహిత్యం, విజ్ఞానం వంటి చైతన్యరూపాలూ రూపొందుతాయి. సంపదలు ఎవరికి చెందుతాయో ఈ చైతన్య రూపాలూ అంతిమంగా వారి స్వాధీనంలోనే ఉంటాయి. ఆ సంపదలను అనుభవించేవారినే పాలకవర్గాలు అంటున్నాం. వారి స్వాధీనంలోని చైతన్య రూపాలకు ఉండేదే పాలకవర్గ భావజాలం, పాలకవర్గ సంస్కృతి అని పిలుస్తున్నాం. అంటే సంపదలాగే ఈ కళా రూపాలూ, విజ్ఞాన శాస్త్రాలూ పరాయీకరణకు లోనయి, సామాజిక సంబంధాల్లో ఘనీభవించాయన్నమాట. మనిషి సహా సమాజంలోని ప్రతి వస్తువూ ఈ సంబంధంలో ఎక్కడో ఒక దగ్గర భాగమవుతుంది. ఇలా మనం ఏ వస్తువుని తీసుకున్నా అది పరాయీకరించబడిన స్థితిలోనే పరిచయం అవుతుంది. అది తానున్న వ్యవస్థ తాలూకూ భావజాలాన్ని, తాత్వికతని సంతరించుకొని ఉంటుంది. అంటే.. ప్రతిదీ శ్రమ నుంచి పుట్టి.. శ్రమజీవితోపాటుగా పరాయీకరణకు గురవుతున్నదన్నమాట. ఈ ఎరుకని, అవగాహనని పొందటమే వర్గ వాస్తవికత అంటున్నాం. అంటే.. మనమున్న సామాజిక సంబంధాల నిజస్థితిని గ్రహించడం. ఈ గ్రహింపు అనేది పరాయీకరణను రద్దు చేసే దిశగా మనల్ని నడిపిస్తుంది. విరసం పతాక గీతికలో చెప్పుకున్నట్టు సమత పంటని శ్రమగూటికి నడిపించేదాకా, ఇంకా చెప్పాలంటే తలకిందుల ప్రపంచాన్ని సరిచేసే దిశగా ప్రయత్నాలు సాగించడమే విప్లవం. వర్గ వాస్తవికతని, తద్వారా తాము కవిత్వం చేస్తున్న వస్తు నిజస్థితిని గ్రహించిన కవులు, రచయితలు ఈ ప్రయత్నంలో అవశ్యంగా భాగస్వాములవుతారు. వారు రచించేదే విప్లవ కవిత అవుతుంది.

ప్రియ శత్రువా! నువ్వేం దిగాలుపడకు / నీ భ్రమల విచ్ఛిత్తి కోసమే / నే బతికి బట్టకడతా / నాపై నువ్వెన్ని గాయాలకైనా పాల్పడు / నీలో మూల మానవుడు అంతరించడు / గాయానికి గాయానికి నడుమ / కాసింత తెరిపి / నాకే కాదు నీకూ కావాలి. (కిటికి పిట్ట, జూన్ 2006). ఈ పాదాల్లోని 'మూల మానవుడు' అతడి నిజస్థితికి సూచన. పాలకవర్గాల చేతుల్లో కర్కశమైన ఆయుధంగా రూపొందిన పోలీసు విషయంలో విప్లవ కవిత్వం అంచనా విస్తరిస్తూ ఉంది. తొలి దశలో సామాజిక నేపథ్యాన్ని గుర్తింపజేసి పోలీసుతో వర్గ స్నేహం కోసం విప్లవ కవి/ విప్లవ కార్యకర్త ప్రయత్నించాడు.. 'అతడు మనిషి' కూడా అన్నదాకా తరువాతి దశలో అవగాహన కొనసాగింది. పొట్టకూటికి పోలీసు నౌకరీలో చేరగానే / అతని పేరు లాఠీ, జైలు, వ్యాను, తుపాకీ /.. .. ./ పాదాలు నేలను / నిజ శరీరం గాలిని తాకినప్పుడు / అతడు మనిషి (అవును అతడు మనిషే, ఈ తరం యుద్ధ కవిత, 1980). అనంతర కాలంలో పోలీసు పట్ల విప్లవ కవిత్వం అంచనా మరింత పరిణితి చెందింది. ఆ పరిణామ శీలతనంతా 'కిటికీపిట్ట'లో చూడవచ్చు. పోలీసు పరాయీకరణ స్థితిని హింస, అమానవీయ, వికృత చర్యల్లో కూరుకుపోయిన అతని మానసిక తలంలోంచి కవి / విప్లవ కార్యకర్త గ్రహిస్తున్నాడు. అంతేకాదు, అందరితోపాటు అతడిని కూడా విముక్తి చేసే పనిని చేతుల్లోకి తీసుకుంటున్నాడు. 'నీ భ్రమల విచ్ఛితి కోసమే' అనే చరణం

మొత్తం కవితకు కాంతిని ఇస్తున్నది. ఏమిటీ భ్రమ? పోలీసుల మానసిక స్థితి మనకు తెలిసిందే. సమాజాన్ని ఎంత భయపెడితే, హింసకు గురిచేస్తే అంతగా తమకు గౌరవం దొరుకుతుందని వారు భావిస్తారు. ఇది నిజానికి భ్రమ, అవాస్తవం. కానీ, అందరిలాగే పోలీసు కూడా సామాజిక గౌరవం పొందేందుకు అర్హుడే. ఇది సత్యం. ఈ సత్యాన్ని నిలబెట్టేందుకు గాయాలను, కన్నీటిని సైతం మోయడానికి కవి / విప్లవకారుడు సిద్ధమవుతున్నాడు.

కన్నీటి కన్నా తొందరగా / ఘనీభవించేదేముంది? / యుద్ధంలో ఒలికిన నెత్తురు కన్నా తొందరగా / పునర్జీవించేదేముంది? (లెజెండ్, 2010 మే). సంబంధాల్లోని పరాయీకరణను గుర్తించిన చైతన్యం వల్ల కలుగుతున్న దుఃఖం ఇది. తరువాతి పాదాల్లో.. ఈ పరాయీకరణను రద్దుచేసే 'యుద్ధాన్ని' కవి సూచిస్తున్నాడు. గాయం, కన్నీరు, మరణం అనే భావనలను భిన్న తాత్విక వాతావరణాల్లోంచి కవిత్వంలో చూడవచ్చు. పరాయీకరణ స్థితిని అనుభవిస్తూ, దానివల్ల కలిగే ఒంటరితనం, భయం, అభద్రత, ఓటమిభావం, బాధలోంచి పెల్లుబుకే నైరాశ్య, శూన్య భావనకు గురికావడం అందులో ఒకటి. ఇలాంటి కవుల కవిత్వంలో చీకటి, దిసమొలలు, రాతిగుహలు, నిషా, పానశాలలు, సమాధి, నీడలు వంటి ప్రతీకలను విరివిగా గమనించవచ్చు. ఇక పరాయీకరణకు లోనయిన సంబంధాల, మనుషుల పెనుగులాటని దర్శించడం వల్ల కలిగే వ్యధ మరొక అంశం. అయితే, కవి అన్నట్టు ఈ వ్యధ ఆ వెంటనే ఘనీభవించి అంటే సంఘటిత చైతన్యం పొంది.. యుద్ధారావంగా మారుతుంది. అలా మారడమే.. అలా మారేందుకు దోహదం చేయడమే స్థూలంగా కవిత్వం లేక సాహిత్య రచన సాధించాల్సిన ప్రయోజనం. ఈ దశలో సూర్యుడు, సులోచనాలు, సముద్రం వంటివి అత్యున్నత సామాజిక సంబంధాలను అంటే సోషలిస్టు సామాజిక సంబంధాలను సాధించేందుకు సాగే సామూహిక ప్రయత్నాలను ప్రతీకిస్తాయి.

ఈ చారిత్రక, సామాజిక క్రమం పట్ల కనీస అవగాహన ఉన్నా మన విమర్శకులు ఇలా ఉండేవారు కాదేమో! అయితే, సామాజిక సంచలనాలకు లొంగిపోవడమో, లేదంటే 'పద్యాన్ని అందం దాచేస్తుంది' అని (ఫోర్త్‌పర్సన్ సింగ్యులర్, 1990) కవి అన్నట్టు సామాజిక సందర్భానికి గల నిర్దేశన గుణాన్ని నిరాకరించడమో అనే పద్ధతుల్లో సాహిత్య విమర్శ శాస్త్రాన్ని అభివృద్ధి చేసేవారు కాదనిపిస్తుంది. ఈ విమర్శకుల అంచనాలకు ప్రభావితం అయిన కొంతమంది 'కవిత్వం కావాలి కవిత్వం' అంటూ శుద్ధ శిల్పవాదం వైపు మొగ్గారు. విరసం స్థాపించిన కవితా సంప్రదాయాలపై పెద్దెత్తున దాడులకు దిగారు. అయితే, తాత్విక పరిమితి ఉన్నదన్న కారణంగా, వీరి అంచనాలను పూర్తిగా తోసిపుచ్చేద్దామా? వారు అన్నారని కాదుగానీ, మనలో పరిహరించుకోవాల్సిన అంశాలేవీ లేవా? ఒక ఉదాత్తమైన, బలమైన సిద్ధాంతాన్ని విశ్వసించడం, ఆ విశ్వాసాన్ని వీలుని బట్టి ప్రకటించుకోవడం విప్లవ కవులంగా మనం ఆవశ్యం చేయాల్సిందే. అయితే, మన స్థితి ఎప్పటికీ విశ్వాసం దగ్గరే ఉండిపోకూడదు. ఎందుకంటే అన్నివేళలా మనల్ని, మన కవిత్వాన్ని రక్షించే శక్తి ఆ విశ్వాసానికి ఉండదు. ఆ శక్తిని పెంచుకోవాలంటే విశ్వాసం తప్పనిసరిగా చారిత్రక సత్యంగా ఆవిష్కరించబడాలి. ఆ వేదిక మీద మాత్రమే మన విశ్వాసాలు ప్రకాశమానమవుతాయి. ఈ క్రమం నిరంతరం కొనసాగాలి. అలాగే విప్లవ కవులంగా మనం నమ్మే రాజకీయాలు బలమైన వ్యక్తీకరణను పొందేది కళా వేదిక మీదే. కాబట్టి, కళకు సంబంధించిన ఏ ఒక్క అంశమూ, అది ఏ వేదిక, ఏ వ్యక్తి ద్వారా ప్రతిపాదించబడినా.. మన కన్ను దాటి పోకూడదు. ఈ అవగాహనతోనే తాత్వికలోతు పెద్దగా లేకుండా విమర్శకులు వేస్తున్న అంచనాలను సైతం విరసం గమనంలోకి తీసుకుంటున్నది. విప్లవ కవిత్వ నిర్మాణంలో, ఇంకా ముఖ్యంగా విప్లవ కవిత్వ తత్వాన్ని సారంలోకి ఇంకించుకోవడంలో ఈనాటికీ ఇబ్బంది పడుతున్నామనే విషయాన్ని గుర్తిస్తున్నది. ఈ లోటుని తీర్చుకునేందుకే వర్క్‌షాపులు.. అంటే క్రమ సాధన పద్ధతిని కవిత్వం సహా అన్ని సాహిత్య ప్రక్రియల్లో ప్రవేశపెడుతున్నది.

'అర్థవంతం' కావడమే కవిత్వం..

విప్లవ కవులు (అజ్ఞాత కవులు, విరసం సభ్యులు, విరసం మిత్రులు) రాస్తున్న కవిత్వంపై మనలోనే రెండు భిన్నమైన చర్చలు జరుగుతున్నాయనిపిస్తున్నది. కవిత్వ నిర్మాణంపై శ్రద్ధే ఉండటం లేదనేది అందులో ఒకటి. అస్సలు అర్థం కాకుండా రాస్తున్నారనేది మరో అంశం. కళాత్మకం కానిది కవిత్వమే కాదనే అవగాహన మొదటి తరహా కవిత్వంపై విమర్శగా కొనసాగుతున్నది. సామాజిక ప్రయోజనం సాధించని కళకు ఇసుమంత విలువా ఉండదనే మౌలిక భావన రెండో రకం కవిత్వంపై అంచనాను ప్రభావితం చేస్తూ ఉంది. మిగతా పత్రికలను అలాఉంచి, విరసం సాహిత్య సాంస్కృతికోద్యమ మాస పత్రిక 'అరుణతార'ను మాత్రమే పరిశీలించినా.. ఈ రెండు తరహాల కవిత్వాన్ని మనం గమనించవచ్చు. ఈ అంశంపై పరిశీలన విప్లవ కవులను, వారి కవిత్వాన్నే కాదు; అరుణతార ప్రమాణాలను కూడా చర్చలోకి తీసుకొస్తున్న సందర్భం మనం చూస్తున్నాం. అరుణతార అనేకాదు, విరసం నుంచి ప్రాతినిధ్య సంకలనాలుగా వస్తున్న కవిత్వాన్ని పరిశీలించినా, ప్రత్యేక సందర్భాల్లో విరసం కవిత్వ వర్క్‌షాప్ టీమ్ రూపొందిస్తున్న పొయిట్రీ పోల్డర్‌లను చూసినా.. వస్తు నిష్ఠ మొదలు ప్రమాణాల దాకా నిరాశని కలిగించే అంశాలే ఎక్కువగా ఉంటున్నాయి. విరసం వరంగల్ మహాసభల సందర్భంలో ఒకసారి, ఐక్య విప్లవోద్యమానికి పదేళ్లు నిండిన సందర్భంలో మరోసారి కవిత్వ వర్క్‌షాపు టీమ్.. పోయిట్రీ పోల్డర్ తీసుకురావాలని ప్రయత్నించింది. ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం, ఒక స్థాయిలో కూడా కవిత్వం లేకపోవడం వల్ల ఆ ప్రయత్నాలను విరమించాల్సి వచ్చింది. ఈ అనుభవం కొన్ని ప్రశ్నలను ముందుకు తెస్తోంది. కళాత్మకతని సాధించడానికి సామాజిక ప్రయోజనాన్ని బలిపెట్టాలా? లేక సామాజిక ప్రయోజనం కోసం కళాత్మక విలువలతో రాజీపడాలా అనేది అందులో ఒక ద్వంద్వం. మనమంతా సామాజిక జీవులం. అందరమూ సా మాజిక కార్యాచరణలో చురుగ్గా పాల్గొంటున్నవాళ్లం. విరసం సభ్యులు, విప్లవ కార్యకర్తలుగా ఈ బాధ్యత మన మీద మరింత ఎక్కువ. అ లాగని ప్రతిదాన్ని కవిత్వంగా మలచాలనే ఆలోచన మంచిదేనా? ప్రతి సందర్భం కవిత్వంలో పలకాలనడం, ప్రతి సంఘటననీ నమోదు చేయాలనడం సరి అయినదా? కవి 'గుమ్మం'లోకి అంటే స్వీయాత్మక అనుభవంలోకి రాని విషయాలను సైతం కవిత్వంగా రాయాల్సిందేనా? అలా రాయమని విప్లవ కవిత్వం లేక విప్లవ సాహిత్యోద్యమం మనల్ని నిర్దేశిస్తున్నాయా? ఉదాహరణకు గాజాపై దాడులకు, ఇరాక్‌పై

పుస్తక సమీక్ష

'మూలింటామె' విషాదానికి వెనక

- వరలక్ష్మి

గ్రామీణ సమాజ విధ్వంసం మీద తెలుగు సాహిత్యంలో అసంఖ్యాక రచనలు వచ్చాయి. మార్కెట్ మాయలో చిక్కుకొని ఊబిలో దిగబడిపోతున్న వ్యవసాయం వల్ల పంటనూ, పొలాన్నీ, తనను తాను కూడా రద్దు చేసుకుంటున్న రైతు పదే పదే చిత్రితమైన ఎడతెగని సంక్షోభమది. ఇంత మాత్రమే కాదు, సోకాల్డ్ పట్టణ నాగరికత, సరుకుల వ్యామోహం, విలువల విధ్వంసం ప్రపంచాన్ని చుట్టుముట్టినట్టే పల్లెల్నీ కుదిపివేస్తున్నాయి. సమాజపు లోపలి పొరల్నుండి మార్పులు కొట్టొచ్చినట్లుగా కనపడుతున్నాయి. ఈ మార్పుల స్వభావాన్ని, సంక్షోభ మూలాలనూ అనేక సంక్లిష్టతల నుండి పట్టుకొని మానవ జీవితం నుండి విశ్లేషించే పని సాహిత్యం చేయగలగాలి.

నామిని మూలింటామె గ్రామీణ సమాజంలో వస్తున్న మార్పులపై కొన్ని పరిశీలనలు చేసింది. మానవ సంబంధాల్లో హింసను, కపటత్వాన్ని, అవకాశవాదాన్ని విప్పి చూపించింది. ఆత్మహత్యల రూపంలో మనుషుల అసహజ మరణాలకు సంఘాన్ని దోషిగా నిలబెట్టింది. అయితే ఇవన్నీ చేయగలిగినా రచయిత ఎక్కడో వీటి మూలాలను గుర్తించలేక విపరీతమైన అసహనం ప్రదర్శిస్తాడు. పాత్రల భావోద్వేగాలతో కలసిపోయి సంయమనం కోల్పోతాడు. స్త్రీ పాత్రల ప్రధానంగా, స్త్రీపురుష సంబంధాల నైతికత చుట్టూ కథను నడిపించడం వల్ల అది మరింత సమస్యాత్మకం అయింది. సమాజంలో విలువల పతనానికి ప్రతీకగా స్త్రీ లైంగిక నీతిని తీసుకుని దాన్ని చర్చించిన మేరా రచయిత సృష్టించిన సన్నివేశాల్లో, పాత్రల్లోనే కాక ఆయన కంఠస్వరంలో కూడా విపరీత ధోరణి కనపడింది. సమాజంలో నీతి సూత్రాల డొల్లతనాన్ని చెబుతూనే అనేకసార్లు ఆడవాళ్ళ ప్రవర్తనను తిట్టిపోస్తాడు. వ్యంగ్య బాణాలు విసురుతాడు. వాటి కోసమే సన్నివేశాల్ని సృష్టిస్తాడు. ఈ నవలలో వ్యక్తీకరణ పొందిన విభిన్న అంశాలు విభిన్న కోణాల నుండి సాహిత్యలోకంలో కొంత చర్చకు వచ్చాయి. ఒక సమీక్షలో రచయిత మీద తీవ్ర అసహనం ప్రదర్శించి ఖదీర్‌బాబు చేసిన వ్యాఖ్యలు రచయితలు ఖండన ప్రకటనలు ఇచ్చేదాకా పోయాయి. అందువల్లనే కాక సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పులను, ముఖ్యంగా దాని విలువల్లో వస్తున్న మార్పులను పట్టించుకున్న రచనగా మూలింటామె ఆసక్తిని పెంచింది.

మూలింటామె నవలలో పందొసంత పాత్ర భర్తతో "ఇది పంతొమ్మిది వందలా ఎనపై నాలుగో సమ్మచ్చరం. యీ కాలంలో కూడా అంత అగచాట్లు పడాల్నా, ఎకరా నేల దున్నేదానికి, ఎర్రటి ఎండలో?... ఏమిటికా ఎద్దులు అమ్మి పారీక" అని ట్రాక్టరుతో సేద్యం చేయించమంటుంది. ఇంటి చుట్టూ ఉండే చెట్లను నరికి, వాటిని అమ్మేసి ఆ పెట్టుబడితో అంగడి పెడుతుంది. అప్పటిదాకా మూలిల్లు, మూలింటోళ్ళు అని ఊర్లో ఉన్న పేర్లు అంగడోళ్ళిళ్లు, అంగడోళ్ళు అయిపోతాయి. క్రమంగా ఆ కుటుంబం పొలం కూడా అమ్మేసి వడ్డీ వ్యాపారానికి మారిపోతుంది. ఇది చాలా ఊర్లలో, ముఖ్యంగా మధ్యతరగతి రైతు కుటుంబాలలో జరుగుతున్నదే. గిట్టుబాటు గాని వ్యవసాయాంతో తెగదెంపులు చేసుకుని ఎంతో కొంత అవకాశం

యుద్ధానికి నిరసనలు, గ్రీన్‌హంట్ వ్యతిరేక ధ్వనులు మన కవిత్వంలో పలికి తీరాలా? పైపైన చూస్తే 'నిజమే కదా. ఇవన్నీ రాయాలా' అనిపిస్తుంది. అంతర్జాతీయవాదులుగా, ప్రజా పోరాటాలను ఎత్తిపట్టే చారిత్రక కర్తవ్యం మోస్తున్నవారిగా, 'రాయకుండా ఎలా ఉంటామ'నే భావనా కలుగుతుంది. ఇలాంటప్పుడు స్వీయాత్మక అనుభవానికి ఏదో పరిమితి ఉందని తోస్తుంది. సామాజిక బాధ్యతల నిర్వహణకు ఈ పరిమితి ప్రధాన అడ్డంకిగా మారిందని అనిపిస్తుంది. అది శిల్పంపై అక్కరలేని కోపంగానూ మారుతూ ఉంటుంది. అయితే, నిజానికి వస్తు ప్రపంచానికి, స్వీయాత్మక అనుభవానికి మధ్య ఉన్నది అభిన్నతే. ఆ ప్రపంచంలో లేనిదేమీ మన అనుభవంలోకి రావడం లేదని ఇంతకుముందే మనం చెప్పుకున్నాం. "ఇప్పటిదాకా అందరూ ప్రపంచాన్ని గురించి వ్యాఖ్యానించారు. కానీ, ఇప్పుడు ఆలోచించాల్సింది ప్రపంచాన్ని మార్చడం ఎలాగనేది" అని కారల్ మార్క్స్ అంటారు. ఈ పని రెండు పద్ధతుల్లో సాగాల్సి ఉంటుంది. వస్తు ప్రపంచానికి సంబంధించి పోగుపడి మనిషి అనుభవాల నుంచి సాధారణ సూత్రాలను వెలికితీసి సిద్ధాంత రూపం ఇవ్వడం అందులో ఒకటి. ఆ పనిని మార్క్స్, ఎంగెల్స్ చేశారు. ఇక వస్తు ప్రపంచాన్ని గురించిన జ్ఞానాన్ని అవగాహనకే పరిమితం చేయకుండా, వ్యక్తిగత జీవిత ఆచరణలో ప్రధాన భాగం చేసుకోవడం రెండో పద్ధతి. స్థూలంగా చెప్పాలంటే జ్ఞానం చైతన్యంగా మారే క్రమమిదే. ఈ చైతన్యం ఎంతగా పెరిగితే, అంతగా మనుషులు ప్రపంచాన్ని మార్చే పనిలో భాగస్వాములు అవుతారు. ఈ క్రమంలో వారికి సిద్ధాంతం కరదీపిక అవుతుంది. అంటే స్వీయాత్మక అనుభవ పరిమితిగా కనిపిస్తున్నది నిజానికి, మన సామాజిక ఆచరణలోని పరిమితి అన్నమాట. పత్రికల్లో, మన సందర్భం అరుణతార కాబట్టి, అందులో కనిపించే లో క్వాలిటీ కవిత్వం.. తగ్గువ స్థాయి కవిత్వానికి సంబంధించిన సమస్యలకు కవి కర్తవ్యం లేక కవి స్వేచ్ఛ అనే పద్ధతుల్లో పరిష్కారాన్ని ఎన్నటికీ కనుగొనలేం. సామాజిక, స్వీయాత్మక అంశాల మధ్య ఉన్న గతితార్కిక క్రమాన్ని అర్థం చేసుకోవడంలో, కవిత్వానికి అన్వయించడంలో కవి వైఫల్యంగానే ఇలాంటి కవిత్వాన్ని చూడాలి. ఈ అవగాహన నుంచి అరుణతారలో కనిపిస్తున్న రెండు రకాల కవిత్వాన్ని పరిశీలిద్దాం

(మిగతా వచ్చే సంచికలో)

(గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో 2014 నవంబర్ 1, 2 తేదీల్లో జరిగిన విప్లవ రచయితల సంఘం కవిత్వం వర్క్‌షాపు ప్రసంగ పాఠం)

ఉన్నోళ్ళు ఉద్యోగాల్లోకి, వ్యాపారాల్లోకి మారిపోతున్నాయి. అయితే ఈ మార్పు పైకి కనిపించేంత సాఫీగా జరగదు. సమాజంలో పాత, కొత్త జీవన విధానాల మధ్య సంఘర్షణ ఒక్కోసారి హింసాత్మకంగా ఉంటుంది. చెట్లు కూలిపోయినట్లు మనుషులు కూలిపోతారు. అభాగ్యులను పీడించిన ఫ్యూడల్ సాంఘిక విలువలపై సమాజం సరికొత్త విలువల పైపొరను తొడుక్కుంటుంది. ఏం చేసైనా డబ్బు సంపాదించడమే జీవిత పరమార్థమనే విలువ మనుషుల్ని ఉన్న చోట ఉండనివ్వక అంతు తెలియని దారుల వెంట పరిగెత్తిస్తుంది. జీవితమంటే ఎత్తుగడలు, గెలుపోటములు మాత్రమే అని బోధిస్తుంది. ఒడుపుగా ఆడిన వాళ్లు గెలుస్తారు, బతక నేర్వని వాళ్ళు ఓడిపోతారు. ఇక్కడ ఓడిపోయిన వాళ్ల పక్షం తీసుకుని ఈ 'సత్యాన్ని' చెప్తాడు నామిని. ఈ సంఘర్షణలో ఉన్న హింసనంతా కథనంలోకి తీసుకొచ్చి పాఠకుల్ని కల్లోలపరుస్తాడు. అయితే సమస్య ఏమిటంటే రచయిత కూడా ఆ కల్లోలంలో పడి రాగద్వేషాలతో కొట్టుకునిపోతాడు.

నవల మూడు తరాల మనుషులను పరిచయం చేస్తుంది. ఇందులో ప్రధాన పాత్రలన్నీ స్త్రీలు కావడం విశేషం. తెలుగు పాఠక లోకానికి నామిని ముచ్చటగా పరిచయం చేసిన మిట్టూరే ఈ నవలలో 1980ల కాలపు మార్పులకు లోనవుతూ కనపడుతుంది. మిట్టూరులో పడమటి పక్క మూలనున్న ఇంటి వాళ్ళను మూలింటోళ్ళని ఆ ఇంట్లో మూడు తరాలకు చెందిన ఆడవాళ్ళను వరుసగా మూలింటి మొదుటామె, మూలింటి నడిపామె, మూలింటి కొనామె అంటుంటారు. మొదుటామెనే మూలింటామె అని కుడా అంటారు. ఇద్దరు పిల్లల్ని కన్న వెంటనే భర్త చనిపోతే మూలింటామె ఒక్కతే సేద్యం చేసి వాళ్ళను పెంచి పెద్ద చేస్తుంది. కూతురికి పెళ్ళి చేస్తే ఒక బిడ్డ కలిగిన వెంటనే అమె భర్త కూడా చనిపోయి పుట్టింటికే వచ్చేస్తుంది. మనవరాలిని పెంచి పెద్ద జేసి తన కొడుక్కే (నారాయుడు) ఇచ్చి పెళ్ళి చేసి ఇంట్లోనే ఉంచుకుంటుంది మొదుటామె. తల్లి కన్నా ఏడాదిన్నర పెద్దవాడైన మేనమామను పెళ్ళిచేసుకుని ఇద్దరు బిడ్డల్ని కంటుంది కొనామె అనబడే రూపావతి. ఒకానొక సాయంకాలం రూపావతి అరవ మాదిగవాడితో ఊరి విడిచి వెళ్ళిపోతుంది. కమ్మ కులానికి చెందిన మూలింటి కొనామె అరవ మాదిగోడితో లేచిపోవడం ఆ ఊరిలో చర్చనీయంశం అవుతుంది. చుట్టుపక్కల ఆడవాళ్ళు ఆ ఇంటివాళ్ళను తలోమాట అని హింసించి ఆనందిస్తారు. తర్వాత నారాయుడుకి వసంతతో మళ్ళీ పెళ్ళిచేస్తారు. (లావుగా ఉంటుందని వసంతను అటు ఆమె ఊరి వాళ్ళు, ఇటు మిట్టూరు వాళ్ళు (రచయిత కూడా) పందొసంత అంటారు). వచ్చీ రాగానే ఇంటిని తన చేతుల్లోకి తీసుకుంటుంది పందొసంత. బతకనేర్చినతనం ఆమె నీతి. కట్టుబాట్లను బహిరంగంగా కాలదన్నినా ఆమెకు ఊర్లో ఆమోదం ఉంటుంది. తన కన్నా వయసులో రెండింతలు పెద్దవాడిని, ఇద్దరు పిల్లల తండ్రిని పెళ్ళిచేసుకోవలసి వచ్చినా చాకచక్యంగా తనకనువైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోగలుగుతుంది. ఆ ఇంటి కోడలు మాదిగవాడితో లేచిపోయిందనే లోకువను వాడుకుని అందరి నోళ్ళూ కట్టేస్తుంది. నారాయుడి దాయాది (రంగబిళ్ళ)తో సంబంధం పెట్టుకుంటుంది. ఆ తర్వాత అతన్ని వదిలేసి గాజలమండ్యం రెడ్డి (గుడుగుడు చెంద్రుడు)తో సంబంధం పెట్టుకుని, అతన్ని వాటంగా ఉపయోగించుకుని వ్యాపారంలోకి దిగుతుంది.

అటు భర్తనూ చెప్పుచేతుల్లో పెట్టుకుని ఇంటి రూపు రేఖల్ని మార్చేస్తుంది. ఆర్థికంగా పైపైకి ఎదుగుతుంది. ఇట్లా బతకడం చేతకాని రూపావతి నాశనమైపోతుంది. మనవరాలి మీద బెంగతోనూ, ఈ ఘోరాలు భరించలేకనూ మూలింటామె కుమిలి కుమిలి చివరికి ఆత్మహత్య చేసుకుంటుంది. నడిపామె పందొసంతను వ్యతిరేకించలేక, ఆమోదించనూ లేక నిరామయం అయిపోతుంది.

కథ మొదలవడంతోనే రూపావతి అరవ మాదిగవాడితో లేచిపోయిన వైనాన్ని ఊరంతా ఉత్సాహంగా చర్చించుకుంటుంది. రంజకం, మొలకమ్మ వంటి వాళ్ళు మూలింటికి పోయి నానామాటలు అని మానసికానందం పొందుతారు. రూపావతి భర్త దాయాది కమ్మవాళ్ళ పరువు తీసిందని మనుషులను తోడ్కొని ఆమె మీద దండయాత్రకు పోతాడు. వాళ్ళవెంట పోయిన రూపావతి తల్లి రూపావతిని తిట్టే తిట్లు తిట్టి, వేసే దెబ్బలు వేసాక ఇంటికి తిరిగి రమ్మంటుంది. ఇక ఆ ఇంటి వచ్చి నా మొకం చూపించలేనంటుంది రూపావతి. రూపావతి మీద, ఆమె కారణంగా ఆ ఇంటివాళ్ళ మీద చెలరేగిపోయిన ఆ ఊరి ఆడవాళ్ళు, పందొసంత వచ్చీ రాగానే రంగబిళ్ళ వీపెక్కి ఆడితే బావామరదళ్ళ సరసాలు అంటూ ముచ్చటపడతారు. మొలకామె అయితే వాళ్ళిద్దరికీ తన ఇంట్లోనే గది కూడా ఇస్తుంది. రూపావతి భర్తను, సంసారాన్ని కాలదన్నింది. కులాన్ని కాలదన్నింది. ఈ పరిధుల్లోపల ఉండి పందొసంత తప్పు చేస్తే ఊరి నీతి దండిచకుండా ఊరకే ఉండిపోతుంది. రంగబిళ్ళ ఊర్లో రాజకీయ పరపతి ఉన్న వాడు కావడం వల్ల సమర్థనతో పాటు సహకారం కూడా దొరుకుంది. తర్వాత గాజలమండ్యం చెంద్రారెడ్డి(గుడుగుడు చెంద్రుడు)తో వసంత సంబంధం పెట్టుకున్నా అది కూడా అట్లాగే నడుస్తుంది. రూపావతి మాదిగవాడితో లేచిపోతే కమ్మోళ్ళ పరుపు పోయిందనుకున్న ఊరు, రెడ్ల ముందు తలెత్తుకు తిరగలేం అని కూడా వాపోయిన పెద్దమనుషులు, వసంత గాజలమండ్యం రెడ్డితో తన ఇంట్లోనే భర్త ముందరే కట్టు తప్పినా భర్తగాని, నీతి అని గోల చేసిన ఊర్లో జనం కాని ఏమీ అనరు. పైగా భార్య ఎదుగుదలలో భర్త నిశ్చింతగా ఉంటాడు. మొదటి భార్య మాదిగవాడితో లేచిపోయినందు వల్ల కూడా అతని అస్త్రాలు మొద్దుబారి ఉంటాయేమో (రచయిత దృష్టిలో), లేక భర్తనూ, కుటుంబాన్నంతటినీ చెప్పుచేతల్లోకి తీసుకునే బలమైన స్త్రీ పాత్రల్ని (ఈ నవల్లో దాదాపు అన్ని స్త్రీ పాత్రలు అట్లాగే ఉంటాయి) రచయిత వ్యూహాత్మంగా సృషించాడా? అత్యంత సహజంగా ఊరు వసంత చుట్టూ చేరుతుంది. ఇక్కడ నీతిని కాదని అవకాశవాద ప్రయోజనాలు పనిచేస్తాయి. నిజానికి కుటుంబ వ్యవస్థలోనే ఇటువంటి సర్దుబాటు ఎక్కడో ఉంటూనే విపరీతమైన ఘర్షణ కూడా ఉంటుంది. స్త్రీ పురుష సంబంధాలు ఎన్నో హత్యలకు, ఆత్మహత్యలకు దారి తీస్తుంటాయి. రచయిత చెప్పాలనుకున్నది నైతిక విలువల డొల్లతనమే అయితే ఆయన టోన్ వ్యంగ్యాన్ని పలకడంలో సమస్య లేదు. "వొకటి మూలింటోళ్ళకు తొంపులు తెచ్చి దాని దోవ అది చూసుకుంటే, ఇంగొక పున్నాత్ముర్రాలొచ్చి వాళ్ళ నెత్తిన కిరీటం పెట్టింది" అని ఊర్లోవాళ్ళు మూలింటోళ్ళ మీద కుళ్ళుకున్నారు అంటాడు రచయిత.

కాని ఆయా సన్నివేశాల్లో రచయిత మాటల్లో పలికిన ఐరనీ చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. "వూళ్ళో ఆడవాటికి బజిని గుడి చేరేదాకా వొంటి మీద కోకలు నిలవలా... . మొగోళ్ళందరూ గుడిలోనూ, గుడి చుట్టూతా వుండే బండరాళ్ళ మిందా కూర్చోనుంటే ఆడవి మాత్రం గోడలకు యాపులారించుకోని, మూతుల మింద చేతులేస్కోని నిలబడుకోనుండాయి... . గంగెద్దులాట జరగతా

వున్నప్పుడు గానీ, ఎలుంగొడ్డును ఆడించే వోడొచ్చి ఆడిరచేటప్పుడు గానీ, యివే ఆడివి యిదే వాటంతో గోడకు యీపులానించుకోని నిలబడి చూస్తుంటాయి" (పేజీ 40, రూపావతి చేసిన తప్పు మీద పంచాయితీ సందర్భం).

వీళ్ళ అత్యుత్సాహం, శాడిజం చూసి సుకుమార అనే పాత్ర "యీ వూళ్ళో ఆడవి మొగుళ్ల దాపున చేరుకోని ఏపే వాటంతో లంజరికాలు జేసి పత్తిత్తులుగా చెలామణీ అవతుండాయో ఒక పుస్కం రాసి చూపిస్తా నుండండి.." అంటాడు. అందరూ తప్పు చేసే వాళ్లే. అయితే ఎవరో ఒకరి దగ్గర బైటపడ్డప్పుడు ఆ తప్పు పట్ల సాధ్యమైనంత ఆగ్రహం ప్రదర్శించి నీతివంతులనిపించుకోవాలనే ఆరాటం లోకులకు ఉంటుంది, నిజమే. అయితే లైంగిక నీతిని ఆడవాళ్ళ చుట్టూ తిప్పడంలో సమాజానికుండే భావజాలం తెలిసిందే. మరి రచయిత చైతన్యం ఏమిటి?

వసంతకు ఊర్లో ఆడవాళ్ళంతా లోబడిపోతారు. "... పందొసంత బేగ్గులు మోసేదానికి వూళ్ళో ఆడోళ్ళు ఎవ్వరైనా సరే ముందుకొచ్చేవోళ్ళు. శార్జీలు పెడితే బస్సులో పాయ్ బస్సులో వొచ్చేదానికి, బేగ్గులు మోసేదానికి ఏం గసనా! నెత్తిన పేడ తట్టలు మోసే ఆడవాటికి యీ సామానం బేగ్గులొక లెక్కనా!" రజకం అయితే అనేక సందర్భాల్లో ఫీలయినట్లుగానే పందొసంత, ఆమె భర్త నారాయుడూ, గుడుగుడు చెంద్రుడూ ముగ్గురూ తాగుతుంటే చూసి ముచ్చటపడుతుంది. ఈ భాగ్యాన్ని కాలదన్నిందని రూపావతిని తిట్టుకుంటుంది.

వసంతకు పుట్టిన బిడ్డ గుడుగుడు చెంద్రున్ని పోలి ఉంటాడు. "పందొసంతకు ఊళ్ళో మంచి మెరిట్టు వుండాది గదా, తల్లీ బిడ్డీ ఆస్పత్రిలో వుండంగానే చూడాల్సిన ఆడివన్నీ చూసేసి వచ్చినాయి... .ఎవునికి పుట్టినా గూడా బిడ్డి వుయ్యాల్లో వూగేది నారాయుడిరట్లోనే గదా అని వూళ్ళో ముక్కాలు వాశి ఆడవి కడుపుల్లో పెట్టుకున్నాయే గానీ వో అని బొక్కలాడ లేదు."

వసంత కారణంగా మూలింటామె ఆత్మహత్య చేసుకుంటుంది. "పందొసంత అత్త పీనిగ మింద పడి చక్కలిగిలి పెడుతుంటే వూళ్ళో ఆడవి ఆ గోష్ట చూడలేక బోరోమని ఏడ్చేసినాయి." ఇట్లా సాగుతుంటుంది కథనం. 'మొగోళ్ళు'అన్న చోట కూడా 'ఆడోళ్ళు' అనకుండా 'అడివి' అనడంలో రచయిత వైఖరి ఏమిటి? రచయితగా ఈ తరహా వ్యాఖ్యానాలు చేయడానికి తగిన పాత్రల్ని సృష్టించుకున్నా అవి సమాధానం కాలేవు. రచయిత తీసుకున్న సెట్ ఆఫ్ క్యారెక్టర్స్ వసంత నమ్మి ఆచరించే విలువకు ప్రతీకలు. ఈ విలువల్ని అడుగడుగునా రచయిత నిరసిస్తాడు. వ్యంగ్య బాణాలు విసురుతాడు. ఆడవాళ్ళు ఇట్లా ఉన్నారు. లేదా ఆడవాళ్ళే ఇట్లా తయారైతే ఇంకేమన్నా ఉందా అని వాపోయే స్వరం ఇక్కడ వినిపిస్తూ ఉంటుంది.

రచయిత అటూ, ఇటూ రెండు జీవన విలువలకు ప్రతీకలుగా స్త్రీ పాత్రల్నే ఎంచుకున్నాడు. వీళ్ళందరూ కూడా నిర్ణాయక స్థానాల్లో ఉండటం ఆసక్తికరంగా ఉంటుంది. కొన్ని సార్లు అతిశయంగా ఉంటుంది. గుడుగుడు చెంద్రుడు భార్యాబాధితుడిగా ఉంటే, ఇటు నారాయుడు భార్య చెప్పుచేతల్లో ఉంటాడు. వసంతకు పుట్టిన బిడ్డ గుడుగుడు చెంద్రుడి పోలికతో ఉన్నాడని తెలిసి ఆమె మీద ఆపేక్ష చావని రంగబిళ్ళ ఆత్మహత్య చేసుకుంటాడు.

నవలకు మూలం మూలింటామె. గతిస్తున్న పల్లె సంస్కృతికి ఆమె ప్రతీక. ఆమె వ్యవసాయం చేస్తుంది. చెట్లను ప్రేమిస్తుంది. ఇంటి చుట్టూ వనంలా పెంచిన చెట్లను వసంత నరికేయిస్తుంటే నన్ను నరికేసి, మళ్ళ నా చెట్లను నరకండని అడ్డం పడుతుంది. పశువుల్ని ప్రేమిస్తుంది. ఒక గాటన ఉండే ఎడ్లను తలోదిక్కు అమ్మి విడదీయకూడదనే సెంటిమెంటతో వసంతను శాపించిన దుడ్డుకట్టి ముసలాయన వంటి పాతకాలం మనిషి మూలింటామె. అయితే ఊర్లో మరికొందరు మాత్రం 'తెలివిగా అమ్ముకుంది, యింగ రెండేళ్ళుంటే వాటిని కోతకు తోలుండాలి' అనుకుంటారు. మూలింటామె ఏడెనిమిది పిల్లుల్ని కన్న పిల్లల్లా పెంచుకుంటూ ఉంటుంది. పిల్లుల్ని చిన్నామున్నల్లారా అని గారాబం చేస్తుంటుంది. వాటితో గాఢమైన బంధం ఏర్పరచుకుంటుంది. అట్లాంటి మూలింటామెకు ఇళ్ళొదిలేసి పోయిన మనవరాలు మీద తీరని బెంగ. కన్న తల్లితో సహా అందరూ అసహ్యించుకునే రూపావతిని గుండెల్లో పెట్టుకోవడమే కాదు, రహస్యంగా ఆమెకు శనిగ్గింజలూ, మునగాకు, వుప్పుడు బియ్యం పంపిస్తూ ఉంటుంది. మూలింటామె బాధను పంచుకునే చీమంతమ్మ, మాలపల్లి గురివి, అప్పుడప్పుడూ పందొసంత పోకడల్ని చూసి తిట్టిపోసే దుడ్డుకట్టి ముసలాయనా పాతకాలం మనుషులు. నీతి తప్పినా నిజాయితీ ఉన్న అమాయకురాలు రూపావతి మీద, మూలింటామె మీద రచయితకు సానుభూతి ఉంది. రూపావతిని సమర్థించడానికి ఈ లోకంలో నీతి తప్పని వాళ్ళెవరున్నారు అంటుంది మూలింటామె. భర్త చనిపోయాక తాను కూడా 'తప్పులు' చేశానంటుంది. రూపావతిని మన్నించి కడుపులో దాచు కోవాలంటుంది. నిజానికి రచయితకు దీనితో పేచీ లేదు. కపట నీతి పట్లనే ఆయన కోపమంతా. ఈ దుర్మార్గమైన లోకంలో మూలింటామె, రూపావతి వంటి సున్నిత మనస్కులు బతకలేరు అని నిరూపిస్తాడు రచయిత. వసంత పొలం బేరానికి పెట్టి పత్రాల్లో వేలి ముద్ర వేయమని అడిగితే మూలింటామె నా ముక్కులో ఊపిరున్నంత వరకు వేలి ముద్ర వెయ్యనంటుంది. రెండు పిల్లుల్ని విషం పెట్టి చంపి మిగతా పిల్లుల్ని కూడా ఇట్లాగే చంపుతానని బెదిరిస్తుంది. సున్నితమైన వాటిపట్ల వ్యాపార విలువలు అట్లా నిర్దాక్షిణ్యంగానే ఉంటాయి. ఇక ఈ ప్రపంచంలో తమవంటి వారికి చోటులేదని మూలింటామె వొడిశాకు తిని ఆత్మహత్య చేసుకుంటుంది. ఉన్న ఒకే ఒక బంధం తెగిపోయాక మనవరాలు కూడా కొండ మీద నుండి దూకి చనిపోతుంది. రూపొందుతున్న కొత్త సమాజపు విలువలు పాత వాటిని తొక్కుకుంటూ ముందుకు సాగుతాయి. మూలింటామె, రూపావతి వంటి వాళ్ళు వాటి కింద పడి నలిగిపోతారు. ఇవి ఈ నవలలో ఎస్టాబ్లిష్ అయినా ముందు చెప్పినట్లు ఇందులో చాలా సమస్యలు కూడా ఉన్నాయి.

గతిస్తున్న సమాజపు విలువల గురించి బాధపడిపోయిన రచయిత సామాజిక సంబంధాల్లో నైతికత వెనక విలువల వెనక ఆధిపత్య వ్యవస్థ మూలాలను గుర్తించలేదు లేదా గుర్తించ నిరాకరించాడు. అట్లాగే మార్కెట్ శక్తులు ఏ విలువల్ని విచ్ఛిన్నం చేస్తూ, ఏ విలువల్ని బలోపేతం చేస్తున్నాయో తెలిపే సామాజిక చలనాలను పట్టుకుంటే వ్యవస్థపై సమగ్ర దృష్టి సారించే అవకాశం ఉంటుంది. కనిపించే కల్లోలాల వెనక కనిపించని శక్తుల్ని గుర్తింపజేసే రచన పాఠకుల మానసిక చైతన్యాన్ని ఉన్నతీకరిస్తుంది. మూలింటామెలో మార్పుల పట్ల సమగ్ర దృష్టి లేని రచయిత అసహనం, ఎత్తిపొడుపు, వెటకారం, బాధ కనిపిస్తాయి. ఒక సామాజిక నవలలో ఉండవలసింది అంత మాత్రమే కాదు కదా.

కామ్రేడ్ రాంజీ అరుణారుణ స్మృతిలో

- వింధ్య

అది ఎనభయ్యవ దశకం. 1980 నుండి 1984 వరకు ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రం మొత్తం మన పార్టీ ప్రచార గాలి హోరుగా సాగిందని చెప్పుకోవచ్చు. రోడ్ల పైన, సినిమా థియేటర్ల ముందు, పెద్ద చౌరస్తాలలో కార్మికవాడలలో, ఫ్యాక్టరీ గేట్‌ల ముందూ - అక్కడ ఇక్కడని కాదు, ఎక్కడ చూసినా మన జెఎన్నెం పాటల హోరే. జెఎన్నెం కళాకారులు, రాడికల్ విద్యార్థులు, రాడికల్ యువజనులు ప్రచార హోరులో కలిసిపోయి ప్రజల్లో మంచి ప్రచారం పొందారు. విప్లవోద్యమం అంటేనే రాడికల్స్‌గా ప్రజల్లో గుర్తింపు వుండింది. పాటలు స్టేషన్‌లో, చౌరస్తాలో పాడితే జెఎన్నెం పాటలు అనేవారు. చివరికి చౌరస్తాలో ప్రజలు పోగై గుమిగూడే సమయానికి అక్కడికి వెళ్లిపోయి పాడితే అదే సమయంలో డ్యూటీ పై వచ్చే ట్రాఫిక్ పోలీసు నవ్వుతూ "మీది నాది ఒకే సమయంలో డ్యూటీ మొదలవుతుంది, మీది గొంతు ద్వారా అవుతే నాది చేతుల సైగలు అంతే, మీది రాగం బయటికి వినబడితే నాది మూగ భాషల చేతులతో పాట మొదలవుతది" అని నవ్వుతుండె. ఆ సమయం అలా వుండె. ఒక్కోసారి బస్సులో, ట్రెయిన్‌లో డప్పులను, డోలక్‌ను చూసి గుర్తుపట్టి ప్రజలు మాకు కూర్చోవడానికి సీటు ఇచ్చేవారు.

అలా ప్రచారం, ప్రదర్శనాలు కొనసాగుతున్న సమయం. కొంతమందిమి కళాకారులం జెఎన్నెం సభ్యులం పూర్తికాలం పని చెయ్యడంతో జెఎన్నెం ఇన్‌స్టిట్యూట్ అనేది వుండె. పూర్తికాలంగా వచ్చిన కళాకారులు అందులోనే వుండేవారు. మాకు మన పార్టీ కొరియర్‌ల ద్వారా ప్రోగ్రాం సమాచారం ఉత్తరాల ద్వారా పంపిస్తుండె పార్టీ. ఇలా ఉత్తరాలు పట్టుకొచ్చిన వారిలో గుర్తున్న వరకు మల్లన్న (అమరుడు కా.అప్పారావు), కా.ప్రభాకర్ - సుభాష్ నగర్ (అమరుడు) సహా మరి కొందరు కామ్రేడ్స్ ఉన్నారు. వీళ్లు ఎవ్వరైనా మా దగ్గరికి వచ్చారంటే రాష్ట్రంలో ఏదో ఒక జిల్లాలో ప్రదర్శణ వచ్చింది అనుకునేవాళ్లం. కొన్ని రోజులు ప్రదర్శనాలు లేకుంటే పైన పేర్కొన్న వారి కోసం ఎదురు చూసేవాళ్లం. అలా రాష్ట్రంలో ప్రదర్శనాలు ఇస్తున్న కాలం. డబ్బులు వుండపోతుండె. కొరియర్స్‌గా వచ్చేవారు ఒక్కోసారి ఉత్తరంతో చార్జి డబ్బులు తెచ్చేవారు. ఒక్కోసారి ఉత్తరం మాత్రమే తెచ్చి ప్రోగ్రాం ఇచ్చిన దగ్గర చార్జీ డబ్బులు వసూలు చేసుకోమన్నారు అనేవారు. గద్దర్ వాళ్ల ఇంటి సామాను తెచ్చుకునే దుకాణం వుండె. ప్రోగ్రాం చోటుకు పోవడానికి డబ్బులు అక్కడికి వెళ్లి ఆయన పేరు చెప్పి అడిగి తెచ్చేవాళ్లం. ప్రదర్శన నుండి వచ్చిన తర్వాత ఇచ్చేవాళ్లం. అయితే ఆ దుకాణందారుడు ఒక ఒప్పందంతో డబ్బులు ఇస్తుండె. మీరు తెచ్చిన డబ్బులు చిల్లర పైసలు ఇవ్వాలె అనేవాడు. చిల్లర బరువు కదా, మనకే బరువు తగ్గుతది అని సంతోషించేవాళ్లం. అయితే దుకాణదారునికి మాత్రం మంచి లాభం, చిల్లర నూరు రూపాయలు ఇస్తే బయట ఐదు రూపాయలు ఇస్తుండేవారు. తర్వాత తెలిసింది అసలు విషయం చిల్లర ఎందుకు అడుగుతడో.

అలా అది ప్రదర్శనలు విపరీతంగా జరుగుతున్న సమయం. ఒక రోజు నేను బాధ్యునిగా జెఎన్నెం ప్రదర్శన ఇవ్వడానికి బయలుదేరాం. డబ్బులు వుండవు కాబట్టి వున్నవాటిని జాగ్రత్తగా వాడుకునేవాళ్లం. బస్సులో, ట్రెయిన్‌లో వెళ్లాలన్నా, ప్యాసెంజర్ లాంటి వాటిలో వెళ్తే చార్జీ తక్కువ. లారీలో వెళితే ఇంకా తక్కువ అని అలా వెళ్లేవాళ్లం. అలా బయలుదేరి సికింద్రాబాద్ స్టేషన్‌లో కొత్తగూడెం పోయే ప్యాసెంజర్‌లో కూర్చున్నాం. బహుశ అది రాత్రి 9.30 నిమిషాలకు బయలుదేరి పొద్దున్న కొత్తగూడెం చేరుతుంది. అక్కడ కాలేజి ఫంక్షన్‌లో ప్రోగ్రాం. మా టీం ఏడెనిమిది మందిమి వున్నామనుకుంటా. అమరుడు దయ, పద్మ (అమరురాలు), శారద అనే కామ్రేడ్, కుమార్, రాజు, నర్సింహ ఇలా. సరైన సమయానికే ట్రెయిన్ బయలుదేరింది. గంట గడిచుండొచ్చు. రాత్రి 10,11 గంటల ప్రాంతంలో చీకట్లో ఏ స్టేషన్‌లో ఎక్కారో కూడా తెలవదు గానీ ఇద్దరు వ్యక్తులు తెల్ల బట్టలు వేసుకున్నవారు ఎక్కారు. చేతిలో చిన్న బ్యాగులు. వాళ్లను చూస్తే ఏదో ఆఫీసులో క్లర్కుల్లాగ అగుపించారు. మేం సాధారణ డబ్బాలో సీట్లల్లో కూర్చొనే కూర్చుపాట్లు పడుతున్నం. క్లర్కుల్లాగ వున్న ఆ వ్యక్తులు బోగీ తలుపు దగ్గర ఏదో మాట్లాడుకుంటూ నిల్చున్నారు. ప్యాసెంజర్ ట్రెయిన్ కాబట్టి అంత స్పీడ్ లేదు. నెమ్మదిగానే వెళుతోంది.

ఇంత రాత్రిలో ఎక్కిన వీళ్లు టిసిలా అని అనుమానం వచ్చి వారి వైపు చూశాను. అందులో ఒకతను పరిచయం వున్న వ్యక్తి అమరుడు కా.పులి అంజన్న. ఇంకో అతను ఎవ్వరో తెలువదు. మీసాలున్నవి. మంచి పర్సనాల్టితో మిల్ట్రిమ్యాన్‌లాగ అగుపించాడు. నేను లేచి అంజన్నను చూసి చేయి చాపడంతో ఆయన నా చెయ్యి పట్టుకోని దగ్గరికి తీసుకోని పక్కకు అదుముకోని "క్యాభయ్ ఎటు ప్రయాణం" అని అన్నాడు. మేం వెళ్లేది చెప్పి ఆయనను నిద్రలో వుండే టీం వారికి పరిచయం చేశాను. వారు నిద్రలో వుండె. అర్ధరాత్రి ఎవరిని పరిచయాలు చేస్తున్నాడా అనుకుంటూ మళ్లీ కునుకడంలో మునిగిపోయారు. అంజన్న ఇంకో వ్యక్తిని నాకు పరిచయం చేస్తూ పేరు చెప్పాడు 'ప్రహ్లాద్' అని. అదే ఆయన్ని మొదటిసారి చూడడం, అదే మొదటి పరిచయం. ప్రహ్లాదే రాంజీ అని తర్వాత అర్థం అయ్యింది. ఇక్కడ ఒక్క విషయం చెప్పాలె. సిటిలో వుండే యూత్ చాలా ఫ్రెండ్‌షిప్‌గా వుండేవాళ్లను ఎక్కువగా 'అలో మామ్' అని సంబోధిస్తరు. నేను కూడా పులి అంజన్నను 'అలో మామ్' అనే అంటుండేవాన్ని. ఆయన ఒకసారి జెఎన్నెం సమావేశానికి వచ్చి ఈ

విషయాన్ని గుర్తు చేశాడు. 'ఇదుగో ఈ కామ్రేడ్స్ నన్ను 'మామ్' అంటుండె. అది సిటీలో మామూలుగా వాడే పదం, దాన్ని మనం అలా అర్థం చేసుకోవాలె' అని సంస్కృతిపై చర్చ వచ్చినప్పుడు చెప్పాడు. అలా గంటనో, అరగంటనో ఆ ట్రెయిన్‌లోనే రాంజీ పరిచయం. 12 గంటలకు జనగాం దగ్గరనో ఎక్కడనో బహుశా వరంగల్ ప్రాంతంలో దిగిపోయారు.

మరో రోజు కొరియర్ వచ్చి చిన్న చిట్టీ ఇచ్చి వెళ్లాడు. అందులో తేదీ, సమయం, స్థలం తప్ప వేరే ఏం లేదు. సమయం పొద్దున్న 10,11 గంటలు అనుకుంటా. స్థలం కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్. ప్లాట్‌ఫామ్ టికెట్ తీసుకుని వెళ్లాను. బుక్‌స్టాల్‌కు కొద్దిదూరంలో బక్కపల్చని మనిషి సిగరేట్ పొగ ఎంజాయ్ చేస్తూ నిల్చొని ఎటో చూస్తున్నడు. ఇద్దరం చేతులు కలిపి విష్ చేసుకున్నం. ఆయన పరిచయం వున్న కామ్రేడ్ కాబట్టి ఇద్దరం తొందరగానే కలిసిపోయాం. ఆ కామ్రేడ్ అమరుడు శ్యామన్న. 10 నిమిషాలు మాత్రం మాట్లాడాడు. అజ్ఞాతంలో వుండే కామ్రేడ్స్ మాతో ఎక్కడైనా అనుకోకుండా కలిస్తే ఎక్కువసేపు మాట్లాడేవారు కాదు. 'మీరుంటే ఎర్రజెండా పట్టుకున్నట్లే కదా, మీరు ప్రజల్లోనూ, శత్రువుకూ ఫుల్ ఎక్స్‌పోజ్' అని నవ్వుతూ అనేవారు. 5,10 నిమిషాలకంటే ఎక్కువ వుండకపోవడానికి అది కారణం అని తర్వాత అర్థం అయ్యింది. ఆ పది నిమిషాల్లో శ్యామన్న మాట్లాడిన విషయాలు తేది, స్థలం, సమయం అంతే. అలా చెప్పిన స్థలంకు (తిరుపతిలో) కొన్ని రోజుల తర్వాత వెళ్లాను. అక్కడ ఒక మనిషి రిసీవ్ చేసుకొని ఒక ఇంటికి తీసుకెళ్లాడు. 10 రోజుల తర్వాతగానీ ఆ ఇంటి నుండి మళ్లీ బయటి ప్రపంచంలోకి రాలేకపోయాను.

ఆ ఇంట్లోనే క్లాసులు. మాస్టర్‌జీలు సత్యమూర్తి, రాంజీ. రాంజీని చూడడం రెండవసారి. అప్పుడే ఎక్కువ రోజులు కలిసి వున్నం. అయితే అంతగా పరిచయం లేదు కాబట్టి మట్లాడుకున్నది తక్కువ. సిటీ నుండి ఇంకో కామ్రేడ్ బెంజమిన్ (అమరుడు) రావడంతో ఇద్దరం ఎక్కువ కలిసి వుండేవాళ్లం. అప్పుడు కా.రాంజీ ఆయుధాల గురించి, మిల్ట్రి విషయాలపై బహుశ మూడు రోజులు క్లాసు చెప్పినట్లు గుర్తు. ఒక విషయంలో నాకు ఆయన గుర్తుండిపోయాడు. ఆయన 'నేను పడుకుంటాను, కరెక్టుగా పది నిమిషాలకు లేవకపోతే లేపండి' అని చెప్పి పడుకోని ఒక్క నిమిషం లోపలే కొద్ది గుర్రుతో నిద్రలోకి జారిపోయాడు. పది నిమిషాల తర్వాత ఎప్పటిలాగే చురుకుగా లేచి తయారయ్యాడు. పది నిమిషాల్లో అది ఎలా సాధ్యం అని ఆశ్చర్యపోయాను. వెళ్లేటప్పుడు చేతులు కలిపిపోయాడు. మళ్లీ 15-16 సం॥ల తర్వాత డికెలో పీపుల్స్‌వార్ పార్టీ ఆలిండియా స్పెషల్ కాన్ఫరెన్స్ దగ్గర కలిశాడు. అయితే సమయం లేక ఎక్కువ మట్లాడలేదు అనిపించింది.

ఆ తర్వాత మళ్లీ 2005 డికెఎస్‌జెడ్‌సి సమావేశం దగ్గర చాలా విషయాలు మాట్లాడాడు. సాహిత్యపరంగా ఉపన్యాసం ఇవ్వాలంటే యిచ్చాడు. అందరినీ కూచోబెట్టి ప్రపంచ రాజకీయ పరిస్థితి, మన దేశంలో ఇతర పార్టీలతో సంబంధాలు, నేపాల్ పార్టీ పరిస్థితి ఇలా యెన్నో విషయాలు క్లుప్తంగా, సూటిగా అర్థం అయ్యేలా వివరంగా చెప్పాడు. నాకు ఎప్పుడూ యెక్కువగా ఆశ్చర్యం వేస్తుండిన విషయం ఏంటంటే ఆయన రాసుకోవడం గానీ, చూసి చెప్పడం గానీ అరుదుగా వుండేది. అన్ని విషయాలు నిర్దిష్టంగా, వివరంగా తేదిలతో సహా పాజిటివ్, నెగటివ్ కోణాలను వెలికితీస్తూ గతితార్కిక దృష్టితో చెప్పడం, చర్చించడం ఆయన విశిష్టత.

అక్కడ నన్ను ఆకట్టుకున్న మరో విషయం ఈ సందర్భంగా గుర్తు చెయ్యడం సరిగ్గా ఉంటుందనిపిస్తుంది. అమరుల ఆదర్శాలను, వారి రాజకీయ సైద్ధాంతిక విలక్షణతలను గుర్తుచేసుకోవడమంటే వాటిని కొనసాగించడానికి నేర్చుకోవడం అనేదే.

ఒక రోజు ప్రెస్ దగ్గర కుర్చీలో కూర్చుని వున్నాను. కా.రాంజీ ఏదో కంప్యూటర్ పనిపై వచ్చాడు రాగానే నేను కుర్చీపై నుంచి లేచి 'కూర్చో' అని చెప్పి వెళ్లిపోవడానికి అడుగులేసాను. ఇది గమనించి ఆయన నన్ను రెండు భుజాలు పట్టుకోని నిలబెట్టి, "నేను రాగానే నీవు వెళ్లిపోతున్నావు అంటే పై నాయకత్వానికీ, కింది నాయకత్వనికీ గ్యాప్ ఎంత వుందో చూడు. ఒకరికి ఒకరు భావాలు ఇచ్చిపుచ్చుకోని మనసు ఇప్పి మాట్లాడుకోవాలె, అది ప్రధానంగా మానుండె జరగాలె' అని మాట్లాడడంతో ఇక నేను అక్కడి నుండి వెళ్లలేకపోయాను. ఆ తర్వాత మళ్లీ ఆయన ఎప్పుడు కల్సినా నవ్వుతూ మాట్లాడుకునేవాళ్లం. అలా ఆ కామ్రేడ్ చిన్న-పెద్ద, తక్కువ-ఎక్కువ అనకుండా అందరితో కలిసిపోతూ, విషయాలను అడిగినప్పుడు వివరంగా చెప్పేవాడు.

చివరిగా 2011 ఫిబ్రవరిలో కలిశాడు. బహుశ డికెలో వుండే చాలా మందికి ఆయనను చూడడం అదే చివరిసారి అనుకోవచ్చు. ఎస్‌జెడ్‌సి సమావేశంలో లాల్‌గఢ్ పైన అడిగిన ప్రశ్నలకు ఓపికతో జవాబు చెప్పాడు. తప్పును సూటిగా ఒప్పుకోవడం అనేది ఆయన నుండి నేర్చుకోవలసిన అంశం. ఆ సమావేశం క్యాంపులో ఫిబ్రవరి 10 భుంకాల్ దివస్, అలాగే డికె ఉద్యమం 30 సంవత్సరాల్లోకి అడుగిడిన సందర్భంగా జరిపిన సభకు అధ్యక్షత వహించింది నేను. చివరి ఉపన్యాసం కా.రాంజీది.

ఇక ఆయన పోయేటప్పుడు కలుద్దాం, కలుద్దాం మళ్లీ, మళ్లీ అంటూ కౌగిలించుకోని చేతిలో చేయి వేసి వీడ్కోలు తీసుకొని వెళ్లిపోతుంటే కన్నీళ్లతో కలుద్దాం. కలుద్దాం అని మనసులోనే అనుకున్నాం. కాని శత్రువు ఇంత తొందరగా ఆయననిక కలువకుండా చేస్తాడని ఊహించలేకపోయాం.

ముగించే ముందర మరొక్క జ్ఞాపకాన్ని పంచుకుంటాను.

1995 ఆలిండియా స్పెషల్ కాన్ఫరెన్స్‌కు నేను బయట నుండి వచ్చాను. పోయేటప్పుడు ప్రయాణంలో ఒక చోట ఆగినపుడు కామ్రేడ్స్ రాంజీ, మైన (కా.రాంజీ, సహచరి) ఇద్దరూ ఓపికతో లడ్డూలు చేశారు. కా.రాంజీ, కా.మైనల ఆదర్శమైన సహజీవనం నాకు వుత్తేజంగా వుండేది. వాళ్లు చేతులు కలిపి విడిపోతుంటే వారి చూపుల్లోని భావాలనూ, మళ్లీ ఎప్పుడు కలుస్తామో అన్న ఆవేదననూ చూసి 'కలుద్దాం, కలుద్దాం మళ్లీ మళ్లీ' అనే పాట రాయడం జరిగింది.

మన ప్రియతమ నేత, రాజకీయ గురువు, సైనిక కమాండర్, లాల్‌గఢ్ ప్రజాపోరు బావుటా కా.రాంజీ ఆదర్శాలను ఎత్తిపడుతూ, అనేక లాల్‌గఢ్‌లను సృష్టిస్తూ శత్రువులకు ధీటైన జవాబు చెపుతూ, ఆయన స్వప్నాలను సాకారం చేద్దాం అని ప్రతిజ్ఞ చేస్తూ కామ్రేడ్ రాంజీకి జోహార్లు అర్పిద్దాం.

కా.రాంజీ అమర్‌రహే!

అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం!

విప్లవ కవితా వికాసానికి ఒరవడి దిద్దిన శిక్షణశాల

నవంబర్1,2 తేదీల్లో గుంటూరు విరసం యూనిట్ ఆధ్వర్యంలో మంగళగిరిలో కవిత్వం వర్క్‌షాప్ జరిగింది. ఇటీవల గత కొన్నేళ్లుగా వివిధ సాహిత్య ప్రక్రియల్లో విరసం నిర్వహిస్తున్న వర్క్‌షాపుల పరంపరలో భాగంగా హైదరాబాదు, నిజాంపట్నం, విజయవాడ, తిరిగి హైదరాబాదులో జరిగాక మంగళగిరిలో విరసం యువ కవుల కోసం ఈ సమావేశాలు జరిగాయి. విప్లవోద్యమ భావజాలంతో కవితా రంగంలోకి ప్రవేశిస్తున్న యువ కవులకు వస్తువు, శిల్పం, దృక్పథంలో అవగాహన అందివ్వడమే ఈ వర్క్‌షాపుల ఉద్దేశం.

సుమారు పాతిక మంది కవులతో మొదటి రోజు ఉదయం 11 గంటలకు తొలి తరం విప్లవ సాహిత్యోద్యమ నాయకులు కామ్రేడ్ ఎంటి ఖాన్, విద్యుల్లత విజయ్‌కుమార్‌లకు సమావేశం నివాళి ప్రకటించింది. తర్వాత విరసం కార్యదర్శి ఈ వర్క్‌షాపుల నుంచి ఆశిస్తున్న ప్రయోజనం, దాని పరిమితులు, నిర్వహణ పద్ధతి గురించి క్లుప్తంగా వివరించారు.

తర్వాత విరసం గుంటూరు యూనిట్ కన్వీనర్ కామ్రేడ్ సంగ్రాం జిల్లా కవిత్వ చరిత్ర గురించి స్థూల పరిచయం చేశారు. జాషువా తదితర ప్రగతిశీల, విప్లవ కవుల ఒరవడిని గుర్తు చేశారు. తర్వాత చలసాని ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు కవిత్వంలో విరసం సాధించిన ప్రమాణాలను ప్రస్తావిస్తూ, వాటిని మరింత అభివృద్ధి చేయవలసిన బాధ్యత ఈ తరం యువ విప్లవ కవులకు ఉన్నదని అన్నారు. రాయకుండా ఉండలేని స్థితిలోనే అచ్చమైన కవిత్వం వస్తుందని, ఫీలింగ్ కవిత్వంలో ముఖ్యమని అన్నారు. కవిత్వానికి ఉండే ఉద్యమ ప్రయోజనం నెరవేరాలంటే పాఠకులను కదిలించేలా ఉండాలని అన్నారు. వివిధ కవిత్వ ధోరణుల్లో నేర్చుకోవాల్సినవి ఉన్నాయని, వాటిని స్వీకరిస్తూ విప్లవ లక్ష్యం కోసం మనం కవిత్వం రాయాలన్నారు. కవి నిజాయితీ తప్పక కవిత్వంలో ప్రస్ఫుటం అవుతుందని, నిజాయితీ లేనప్పుడు కేవలం భాష గారడిగా ఎట్లా మిగిలిపోతుందో రెండు కవితలను ఉదాహరణగా తీసుకొని వివరించారు. నిజాయితీ కవి దృక్పథానికి సంబంధించిన అతి ముఖ్యమైన గీటురాయిగా నిలుస్తుందని అన్నారు.

చలసాని ప్రసంగానికి కొనసాగింపుగా కవి నిజాయితీకి దృక్పథానికి, నిజాయితీకి శిల్పానికి ఉన్న సంబంధం గురించి చాలా ఆసక్తికరమైన చర్చ జరిగింది.

ఆ తర్వాత కవితా పఠనం, విశ్లేషణ రాత్రి పదకొండు దాకా సాగింది. ఇందులో ఇప్పుడే తమ తొలి కవిత రాసిన వారు పాల్గొన్నారు. రెండు దశాబ్దాలుగా రాస్తున్న కవులూ తమ కవిత్వం వినిపించారు. అన్నిటి మీద లోతైన విశ్లేషణ జరిగింది. వైవిధ్య భరితమైన ఇతివృత్తాల మీద వచ్చిన కవితలు చదివారు. వాటిలో ప్రధానంగా దృక్పథం, శిల్ప సంబంధ చర్చ జరిగింది. ఒక రకంగా విప్లవ కవితా దృక్పథం ఈ దశకంల్లో కూడా ఎలా విస్తరిస్తున్నదో ఈ వర్క్‌షాపులో వచ్చిన కొన్ని కవితలు ఉదాహరణగా నిలిచాయి. అట్లాగే వేర్వేరు శిల్ప ప్రయోగాలతో రాసిన కవితలు కూడా ఈ కార్యక్రమంలోకి వచ్చాయి. నేరుగా విప్లవోద్యమ ఇతివృత్తం, అమరత్వంతోపాటు సమాజంలోని సకల ఆధిక్యాల మీద, పీడనల మీద, మానవ సంక్షోభాల మీద విప్లవ కవిత్వం ఎలా రాయవచ్చునో కవితా పఠనం, విశ్లేషణలో భాగంగా విస్తృతమైన చర్చ జరిగింది. ముఖ్యంగా కవిత్వ ప్రక్రియకు ఉన్న ప్రత్యేకతలను దృష్టిలో పెట్టుకొని దానితో వ్యవహరించాల్సిన తీరు, కవిత్వంలో భాష ఉపయోగించే నైపుణ్యం, శిల్పంలో వైవిధ్యం గురించి చర్చ జరిగింది. ఎప్పటికప్పుడు భాషను శక్తివంతంగా, నైపుణ్యంగా, వైవిధ్యభరితంగా వాడుకోలేకపోతే కవిత్వంలో తాజాదనం రాదని, ఉద్యమ ప్రయోజనాలు తీర్చేలా కవిత్వాన్ని తీర్చిదిద్దలేమనే అభిప్రాయాలు వచ్చాయి. సమావేశంలో చదివిన కవితల్లో దృక్పథ పరంగా ఉన్న లోపాలు, అలాంటి వ్యక్తీకరణల గురించి లోతైన చర్చ జరిగింది. ప్రజానుకూల ఇతివృత్తం తీసుకున్నా వ్యక్తీకరణలో, భాషలో అభ్యంతరకమైన భాష, వ్యక్తీకరణ పొడసూపే ప్రమాదం ఎలా ఉంటుందో చర్చ జరిగింది. అట్లాగే అస్పష్టత, సంక్లిష్టతల గురించి ఆసక్తికరమైన విశ్లేషణ సాగింది.

మరునటి రోజు కామ్రేడ్ రివేరా ఇటీవలి విప్లవ కవిత్వం..నిర్మాణ అవగాహన సమస్యలు అనే అంశం మీద ప్రసంగం చేశారు. విప్లవ కవిత్వం నాలుగైదు దశాబ్దాల ప్రయాణాన్ని సైతం స్థూలంగా పరిచయం చేస్తూ ఇవ్వాల్టి కవిత్వ వికాసం గురించి, లోటుపాట్ల గురించి విశ్లేషించారు. ఆయన ప్రసంగం మీద కూడా చర్చ జరిగింది.

ఆ తర్వాత ప్రముఖ కవి ఖాదర్‌మొహియుద్దీన్ మాట్లాడుతూ– మనం వివిధ సాహిత్య ప్రక్రియల మధ్య సరిహద్దులు చెరిగిపోతున్న తరుణంలో కవిత్వ నిర్మాణం గురించి మాట్లాడుకుంటున్నాం. సోవియట్ యూనియన్‌లో నేరుగా మార్క్సిజం నుంచి సాహిత్యాన్ని నిర్దేశించే ప్రయత్నంలో తలెత్తిన పెడ ధోరణుల వల్ల రూపవాదమనేది తలెత్తింది. నిజానికి వాళ్లు తమను తాము రూపవాదులని అని చెప్పుకోలేదు. ఈ విషయాలను ఇప్పుడు మళ్లీ కొత్తగా చూడవచ్చు.

కవులు పిల్లల భాష నేర్చుకోవాలి. తనదైన కొత్త చూపును, వ్యక్తీకరణను కవులు సొంతం చేసుకోవాలి. ప్రపంచంలో ఇంత దాకా ఉన్నవేవీ నచ్చనప్పుడే తనదైన సొంత సృజన కోసం కవి, కళాకారుడు ప్రయత్నిస్తారు. అమృతాప్రీతం ఉనికిలో ఉన్న రూపాలన్నిటి మీద అసంతృప్తితోనే రచన ప్రారంభించానని అంటుంది. భాషను ఉపయోగించే నైపుణ్యం పెంచుకోకపోతే కవిత్వం రాద్దామనే ఆలోచన నుంచి విరమించుకోవడం మంచిది. ఒక మాటకు ఒకే అర్థం ఉంటే అది కవిత్వం కాదు. ఏమీ శ్రమ చేయకుండా కవిత్వం రాయడం

కరపత్రం

తొలితరం నక్సల్బరీ విప్లవ మేధావులు

కామ్రేడ్ ఎం.టి.ఖాన్, కామ్రేడ్ విజయ్‌కుమార్‌లను స్మరించుకుందాం

నక్సల్బరీ రాజకీయాలను నవ యవ్వన దశలో గుండెల నిండా నింపుకుని ఉద్యమంతో పాటు ఉరకలెత్తి జీవితమంతా ఆ వెలుగుల్ని ప్రసరించిన తొలితరం కామ్రేడ్స్ ఒక్కొక్కరే సెలవంటూ వెళ్ళిపోతున్నారు. అట్లా విప్లవోద్యమంతో నడిచి విప్లవ సాహిత్యోద్యమంలో భాగమై విరసం వ్యవస్థాపక సభ్యులైన కామ్రేడ్ ఎం.టి.ఖాన్, కామ్రేడ్ భాగ్యనగర్ విజయ్‌కుమార్‌లు ఇటీవలే అమరులైనారు. ఒకరు హైదరాబాద్ తెహజీబ్ అయితే మరొకరు కరీంనగర్ విద్యుల్లత.

ఖాన్ సాబ్ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి నేటి మావోయిస్టు ఉద్యమం దాకా జీవితమంతా విప్లవోద్యమం పక్షాన నిలిచారు. చిన్నతనంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తిని మఖ్దూం మొహియుద్దీన్ ప్రభావాన్ని తనపై గాఢంగా ముద్రించుకున్నారు. మొదట ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో, ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్‌లో ఆ తర్వాత సిపిఎంలో పని చేసి నక్సల్బరీ పిలుపునందుకుని అటు నుండి మావోయిస్టు రాజకీయాలకు అంకితమయ్యారు. శ్రీకాకుళ ఉద్యమాన్ని ప్రభుత్వం నెత్తుటిలో ముంచిన తరువాత విప్లవోద్యమాన్ని మళ్ళీ నిర్మించే సన్నాహాలు సాగుతున్న దశలో కా.కొండపల్లి సీతారామయ్య ప్రేరణతో "పిలుపు" పత్రిక వెలువడింది. ఆ పత్రికకు ఖాన్‌సాబ్ ప్రచురణకర్తగా ఉన్నారు. విప్లవ రచయితల సంఘం ఆవిర్భావ కాలం నుండి ఆయన సంస్థలో కొనసాగుతున్నారు. విరసం ఆవిర్భావానికి కర్టన్ రైజర్ లాంటి అంటార్కిటికా పోస్టర్ కవిత్వం వెలువరించడం దగ్గరి నుండి ఈ ఏడాది వరంగల్‌లో జరిగిన 24వ మహాసభల్లో తీవ్ర అనారోగ్యంలోనూ పాల్గొన్నంత వరకు ఆయన శ్వాస, ధ్యాస విప్లవమే. ఉర్దూ, ఇంగ్లీషు, హిందీలో కవిత్వం, వ్యాసాలు రాశారు. అనువాదాలు చేశారు. అఖిల భారత విప్లవ సాహిత్య సాంస్కృతిక సమితి (ఏఐఎల్ఆర్‌సి) స్థాపనలో ఆయన భాగస్వామ్యం ఉంది. 1974లో పౌరహక్కుల సంఘం (ఎపిసిఎల్‌సి) ఏర్పాటులోనూ ఖాన్‌సాబ్ ఉన్నారు. 1993లో ఎపిసిఎల్‌సి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. చివరి దాకా పౌరహక్కుల ఉద్యమంతో కొనసాగారు. 1973లో మీసా కింద, ఆ వెంటనే సికింద్రాబాదు కుట్ర కేసులో, తర్వాత ఎమర్జెన్సీ కాలం మొత్తం రాజ్యం ఆయనను నిర్బంధంలో ఉంచగలిగింది కాని ఆయన ఆశయాలను, విశ్వాసాలను ఏ మాత్రం సడలించలేకపోయింది. జీవితాంతం ప్రజాఉద్యమాలకు కొండంత అండగా నిలిచి, దగ్గరైన ప్రతి ఒక్కరికీ మానవత్వ పరిమళాలు వెదజల్లిన ఎం.టి.ఖాన్ ఆగస్టు 20వ తేదీన అమరుడైనారు.

శ్రీకాకుళ ఉద్యమం తెలుగు సమాజాన్ని కదలబారుస్తున్న కాలంలో ఆ రాజకీయాలతో తెలంగాణను రగిలించిన వారిలో విజయ్‌కుమార్ ఒకరు. 1969 నుండి కరీంనగర్ కేంద్రంగా విద్యుల్లత పత్రికను వెలువరిస్తూ విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపకుల్లో ఒకరయ్యారు. విప్లవ సాహిత్యాన్ని ప్రచురించి, ప్రచారం చేసి, నిషేధాలను, నిర్బంధాలను ఎదుర్కొని కరీంనగర్‌లో మరెంతో మంది ప్రజాఉద్యమకార్యకర్తలకు స్ఫూర్తినిచ్చారు. ఉద్యమ సాహితి ప్రచురణల పేరుతో ఆయన ప్రచురించిన "బద్‌లా" కథా సంకలనం నిషేధానికి గురైంది. ప్రభుత్వానికి కన్నెర్ర చేసి నిషేధానికి గురైన విరసం కవితా సంకలనం "మార్చ్"ను ప్రచురించింది కూడా ఈయనే. శ్రీకాకుళ పోరాట అమరురాలు పంచాది నిర్మల పేరు మీద నిర్మల ప్రింటింగ్ ప్రెస్‌ను స్థాపించి విప్లవ సాహిత్యానికి దానిని కేంద్రం చేశారు.

సాధ్యం కాదు. కవిత శీర్షికే ఆకట్టుకొనేలా ఉండాలి. లేకపోతే పాఠకులు చదవరు.

కలలు నా మాతృభాలో రావడం లేదంటూ. నా పుట్టుమచ్చ కవిత మొదలవుతుంది... అంటూ ఆ కవిత నేపథ్యం వివరించారు. ఆయన చివరగా తెలుగు సాహిత్యంలో ఒక శూన్యం ఏర్పడిందని, దీన్ని విరసం పూరించాలని అన్నారు. అయితే విప్లవోద్యమంతో అభేదంగా ఉండటం వల్ల ఇది సాధ్యం కాదు.. విరసమే పోషించగల పాత్ర ఈ సమాజంలో చాలా ఉందని అన్నారు.

ఆ తర్వాత కామ్రేడ్ కల్యాణరావు మాట్లాడుతూ... విప్లవ కవిత్వం కూడా అర్థం కావడం లేదనే అభిప్రాయం వినిపిస్తోంది. దాన్ని అధిగమించడానికి ప్రయత్నించాలి. జానపదుల పాటల్లో, పదాల్లో ఎన్నో గొప్ప వ్యక్తీకరణలు ఉన్నాయి. అవి వాళ్ల జీవితం నుంచి వచ్చాయి. అందులో వాళ్ల వ్యక్తిత్వం, ధిక్కారం ఉన్నాయి. వాటిని విప్లవ కవులు అందుకోవాలి. ప్రజల నుడికారంలో కవిత్వం రాయడం వల్ల విప్లవ ప్రయోజనం నెరవేరుతుంది అని అనేక జానపదాలను ఉదహరిస్తూ ప్రజా సాహిత్య సంప్రదాయాన్ని వివరించారు.

సాయంకాలం చివరగా కామ్రేడ్ అరసవెల్లి క్రిష్ణ ప్రముఖ కవి కొప్పర్తి కవిత్వాన్ని పరిచయం చేశారు. మూడు దశాబ్దాలుగా కొప్పర్తి కవితా వస్తు శిల్ప వికాసాన్ని విశ్లేషించారు. విషాద మోహనం, ఒక యాభై ఏళ్ల వాన అనే సంపుటాల్లోని కవితలను చదివి వినిపిస్తూ కొప్పర్తి కవిగా విస్తరించిన తీరు వివరించారు. ఆయన కవితా నిర్మాణ పద్ధతులతోపాటు దృక్పథ పరంగా కూడా అత్యంత ప్రజాస్వామికంగా ఎట్లా రూపొందిందీ చెప్పారు.

చివరిగా వర్క్‌షాపుకు హాజరైన కవులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపు ద్వారా తమకు స్ఫూర్తి కలిగిందని, కవితా రచనలో అనేక మెలకువలు తెలశాయని, ముఖ్యంగా దృక్పథపరంగా కొంత అవగాహన పెరిగిందని అన్నారు. అట్లాగే నిర్వహణ మరింత బాగా ఉండేందుకు సూచనలు ఇచ్చారు.

తేది : 07.11.2014 (శుక్రవారం)
సమయం : సాయంత్రం 5 గంటలకు
స్థలం : సారస్వత పరిషత్,
బొగ్గులకుంట, హైదరాబాద్.

అధ్యక్షత :
వరలక్ష్మి, కార్యదర్శి, విరసం;
ఎం. రంగనాథం,"పిలుపు" సంపాదకులు; జహీద్ అలీఖాన్, సియాసత్ ఎడిటర్; నవాబ్ ఫరీద్ జువాయీ, జనరల్ సెక్రటరీ యునైటెడ్ రైటర్స్ ఫోరమ్; రోహితాశ్వ, హిందీ రచయిత; నగ్నముని; నిఖిలేశ్వర్; సురేష్ సిఎల్‌సి; జీవన్ కుమార్, హెచ్ఆర్ఎఫ్; వరవరరావు, విరసం.
ఖాన్ సాబ్‌పై డాక్యుమెంటరీని నిఖిలేశ్వర్, ఎం. రంగనాథం ఆవిష్కరిస్తారు.
అనంతరం ప్రదర్శన ఉంటుంది.

విప్లవ రచయితల సంఘం

భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్ష రద్దు కోసం జరిగిన ఉద్యమంలోనే కాదు, ఆ కుటుంబాలకు అండగా నిలబడ్డవారు విజయ్‌కుమార్. కరీంనగర్‌లో అన్ని కదలికలు, సంచలనాల్లో విజయ్‌కుమార్ భాగమై ఎమర్జెన్సీ కాలంలోనూ ఆ తర్వాత కూడా విపరీతమైన రాజ్యహింసనెదుర్కొన్నారు. టార్చర్ సెల్స్‌లో నెలల తరబడి చిత్రహింసలననుభవించారు. 1980లలో మొదట "కోరస్" అనే పత్రికను కొంతకాలం నడిపారు. తర్వాత "జీవగడ్డ" సాయంకాలం పత్రికను వెలువరించారు.కరీంనగర్ జిల్లా వర్కింగ్ జర్నలిస్టు యూనియన్‌ను స్థాపించారు. పత్రికా రంగంలో ప్రమాణాలనే కాదు విలువల్నీ నిలబెట్టిన విజయ్‌కుమార్ ఉన్నత విలువల కోసం రాజీలేని జీవితాన్ని గడిపారు. నిరుపేదగా జీవిస్తూ సుసంపన్నమైన ప్రజాఉద్యమాల పక్షాన నడిచిన కామ్రేడ్ విజయ్‌కుమార్ అక్టోబరు 11న అమరుడైనారు.

ఈ ఇద్దరు కామ్రేడ్స్‌దీ నిరాడంబర జీవితం. మహోన్నత వ్యక్తిత్వం. విప్లవోద్యమం అందించిన విలువలకు నమూనాలైన వారి జీవితాన్ని, పోరాటాన్ని నేటి తరం అందుకోవాలి. వారి స్ఫూర్తిని, ఆశయాలను కొనసాగించాలి. అందు కోసం విప్లవోద్యమ నేపథ్యం నుండి ఆ ఇరువురి జీవితాచరణను స్మరించుకుందాం రండి.

25వ పేజీ తరువాయి...

సర్వనాశనం గావాలకుంటున్నారు వాళ్ళు." అడుక్కుంటున్నట్టు ఉంది చౌధురీ నాథూ గొంతు.

చూడు చౌధురీ నాథూ, ఒక సారి నువ్వు ఎవరినైనా శత్రువని ప్రకటించాక, ఇక వాడు నిన్ను పస్తులతో చంపాలనుకుంటున్నాడని, నీ వచ్చని పొలాలు బీళ్ళు చేయాలనుకుంటున్నాడని మొత్తుకోవడమెందుకు? వాడి నుండి నువ్వు ఆశించేదేమిటి? నీ కోసం విందు భోజనం ఏర్పాటు చేయాలనా?

"నీవన్నీ అర్థం లేని మాటలు." అంతే అనగలిగాడా పెద్ద మనిషి కరీం దాద్‌తో.

కానీ కరీం దాద్ ఇంకా పూర్తి చేయలేదు. భారతీయులు మన నీళ్ళను మన నుండి తీసుకెళ్ళగలిగే స్థాయిలో ఉన్నారు. కాబట్టి మనమూ చేతనైనదేమైనా చేద్దాం. ఊరికే వాళ్ళను తిట్టుకుంటూ కూర్చోకుండా. శత్రువు నీ కోసం కాలువలు తవ్వి వాటిని పాలు, తేనెతో నింపుతారని ఆశించొద్దు. నువ్వు తాగే నీళ్ళలో విషం కలిపేసి నిన్ను చంపేయగలరని అనుకుంటే మంచిది. నువ్వు దాన్ని అనాగరిక చర్య అనొచ్చు. నేనవను. యుద్ధమంటే యుద్ధమే. ముందస్తు షరతులు పెట్టి చేసుకోడానికి ఇదేమీ పెళ్ళి ఒప్పందం కాదు. మేం యుద్ధం చేస్తాం సరే, అయితే నువ్వు మాకు తిండి లేకుండా చేసి మా పొట్ట కొట్టకు అనగలవా? లేకపోతే నువ్వు మాపైన కాల్పులు జరపొచ్చు కాని ఫలానా రకం తుపాకులే వాడాలని అనగలవా? కొంచెం ఆలోచించవయ్యా."

"మరైతే ఏం చెయామంటావు?"

చౌధురీ నాథూ ప్రశ్నకు జవాబివ్వకుండా కరీం దాద్ లేచి వెళ్ళిపోయిడు.

వీధి తలుపు దాటి లోపలికి పోతూ అతను భక్తోను దాదాపు గుద్దుకోబోయాడు. ఆమె చిరునవ్వుతో అంది "అబ్బాయి పున్నమి చంద్రుడిలా ఉన్నాడు. వాడికేదైనా పేరు ఆలోచించావా?"

"ఓ, ఆలోచించా. యాజిద్. అదే వాడి పేరు"

భక్తో ముఖం పాలిపోయింది. క్రైస్తవులు ఎట్లైతే జుడాస్ అని పేరు పెట్టుకోరో, ఏ ముస్లిం తన పిల్లవాడిని యాజిద్ అని పిలవాలనుకోడు. అది ఒక దుష్టుడి పేరు. యాజిద్ ఆజ్ఞల వల్లే ప్రవక్త మనవడు హుస్సేన్, అతని అనుచరులు నీళ్ళు దొరకక చివరికి ఊచకోతకు గురైనారు.

కరీం దాద్ ఇంట్లోకి పరిగెత్తాడు. జీనా నిస్సత్తువగా మంచంపై పడుకొని ఉంది. ఆమె పక్కన లేలేత ఎర్రుపు రంగులో బుజ్జి పిల్లవాడు బొటనవేలు నోట్లో వేసుకుని ఉన్నాడు. కరీం దాద్ అతని చెంపను తాకాడు. "నా చిన్ని యాజిద్," అన్నాడు గర్వంగా.

"యాజిద్!" జీనా కెవ్వుమంది.

"అవును యాజిద్... అదే వాడి పేరు," బిడ్డను చూస్తూ అన్నాడు కరీం దాద్.

"ఏమంటున్నావు నువ్వు?" షాక్ తగిలిన స్వరంతో అడిగిందామె.

కరీం దాద్ చిరునవ్వు నవ్వాడు. "అవునదే. అందులో ఏముంది. అదీ ఒక పేరే కదా."

"అది ఎవరి పేరో తెలీదా"

"ఈ చిన్నోడు అదే యాజిద్ కావాలనేముంది. ఆ యాజిద్ నీళ్ళను అడ్డుకున్నాడు. ఈ యాజిద్ వాటిని మళ్ళీ పారిస్తాడు."

(మొహర్రం ప్రవక్త ప్రియమైన మనుమడు హుస్సేన్, అతని సహచరుల అమరత్వాన్ని స్మరించుకునే రోజు. హుస్సేన్, అతని సహచరులు యాజిద్ అన్యాయంగా చేజిక్కించుకున్న అధికారాన్ని అంగీకరించక అతనికి లోబడక పోరాడి ప్రాణత్యాగం చేశారు.)

పత్రికా ప్రకటన

తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రభుత్వం నిర్వహించిన గిరిజనుల ధర్నా

పోలీసు ఆధ్వర్యంలో వచ్చి విరసం సభ్యుణ్ని ప్రాణ రక్షణ కోరిన గిరిజనులు

నిన్న బుధవారం 19 నవంబర్ 2014 ఉదయం 8:30 గంటల ప్రాంతంలో డెబ్బై, ఎనభ్బై మంది గిరిజనులను విశాఖ జిల్లా, బలపం మండలం, వీరవరం గ్రామస్తులని చెప్పి ఒక బస్సులో పోలీసులు జవహర్‌నగర్, అశోక్‌నగర్‌లో ఉన్న మా అపార్ట్‌మెంట్ ముందుకు తీసుక వచ్చారు. వాళ్లు చాలా సేపు రోడ్డు బ్లాక్ చేసి, మా అపార్ట్‌వెంట్ గేట్ కూడా బ్లాక్ చేసి మఫ్టీలోను, యూనిఫామ్‌లోను ఉన్న పోలీసుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పోలీసులే తయారు చేసిన బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. వెళ్లిపోయే ముందు 11:30 గంటల ప్రాంతంలో వాళ్లలో సంజీవరావు భార్య, తమ్ముడు, అన్న వచ్చి ఇచ్చిన విజ్ఞాపన పత్రం చూస్తే ఈ భాషలోని తేడా స్పష్టంగా అర్థమవుతుంది. తర్వాత నెట్‌లో చూసినపుడు మఫ్టీలో ఉన్న పోలీసులు గిరిజనులను ఆటోల్లో ఎక్కించడం స్పష్టంగా పోల్చుకోవచ్చు. అట్లే ప్ల కార్డులు 'మావోయిస్టులారా లొంగిపోండి, మీకు వెంటనే పునరావాసం కల్పిస్తాం' 'రాంబాబు, రామమోహన్‌ల హత్యలు మావోయిస్టు తీవ్రవాదులపై ప్రతీకారం తీసుకోవడానికి చేసినవే' 'మావోయిస్టులారా లొంగిపోవడమంటే లక్షల రూపాయల ఆదాయమే. శాశ్వత పునరావాసం ప్రభుత్వ విధానం' అని ఉన్నాయి. మా ఫ్లాట్‌కు సంజీవరావు కుటుంబాన్ని తీసుక వచ్చింది కూడా పోలీసులే.

2014 అక్టోబర్ 19న వీరవరం గ్రామానికి చెందిన సంజీవరావును మావోయిస్టులు చంపారని, కనుక తమకు మావోయిస్టుల నుంచి ప్రాణ రక్షణ కావాలన్నది 39 మంది సంతకాలతో ఇచ్చిన విజ్ఞప్తి పత్రం సారాంశం.

ఎవరి నుంచయినా, చివరకు పోలీసుల నుంచయినా పౌరులకు ప్రాణ రక్షణ కల్పించవలసిన ప్రభుత్వం - ఈ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అంతదూరం విశాఖపట్నం నుంచి బస్సు ఏర్పాటు చేసి పోలీసుల రక్షణలో ఇంతదూరం తెలంగాణ ప్రభుత్వ సహకారం కూడా తీసుకొని నా దగ్గరకి ప్రాణ రక్షణ కోసం పంపించడం చాలా క్రూరమైన, దురుద్దేశ పూర్వకమైన, కుట్రపూరితమైన అసహాయత ప్రదర్శన తప్ప మరేమీ కాదు. ఈ దేశంలో గిరిజనులను ప్రభుత్వాలు కాపాడలేవనడానికి ఇంతకన్నా దాఖలా అక్కర్లేదు. అంతేకాదు, గిరిజనుల గురించి పోరాడుతున్న వాళ్లను, మాట్లాడుతున్న వాళ్లను కూడా బతకనివ్వదలుచుకోలేదీ ప్రభుత్వాలు. సంజీవరావును మావోయిస్టులు చంపగానే సంత దగ్గర పోలీసులు మావోయిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు శరత్‌ను, ఆయనతో మరో ఇద్దరు సహచర కామ్రేడ్స్‌ను కూడ చంపారు. ఒకరి శవం ఇప్పటికీ దొరకలేదు. మరొక వైపు అక్టోబర్ నెలలోనే విశాఖపట్నంలో పౌరహక్కుల సంఘానికి చెందిన న్యాయవాదులు అన్నపూర్ణ, రఘురామ్‌ల ఇళ్ల ముందు, సిఎల్‌సి విశాఖ జిల్లా అధ్యక్షుడు శ్రీరామమూర్తి ఇంటి ముందు గిరిజనులను తీసుకవచ్చి ఇటువంటి ధర్నానే నిర్వహించారు.

నెలరోజుల తర్వాత మరి ఇప్పుడు ఇంత దూరం మరొక రాష్ట్రానికి కూడ ఎందుకు వచ్చినట్లు? తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం పైననా? 'మూడు రోజుల క్రితమే ఆంధ్రప్రదేశ్ పోలీసులు హైదరాబాద్‌కు గిరిజనులను తీసుకురావడానికి మా అనుమతి కోరారు. మేమిచ్చామ'ని మీడియాకు పోలీసు ఉన్నతాధికారి ఒకాయన చెప్పాడట. నిన్న ఆంధ్ర పోలీసులకు తెలంగాణ పోలీసులు ఇచ్చిన సహకారంతో కూడ అది స్పష్టమవుతున్నది.


నక్సల్బరీ, శ్రీకాకుళ ఆదివాసీ రైతాంగ పోరాటాలు మొదలు ఈనాటి వరకు మావోయిస్టు నాయకత్వంలోను, అండతోనూ దేశవ్యాప్తంగా జల్ జంగల్ జమీన్ కొరకు మాత్రమే కాదు ప్రత్యామ్నాయ రాజకీయాధికారం కోసం కూడ పోరాడుతున్న ఆదివాసీ పోరాటాలను విప్లవ రచయితల సంఘం సాహిత్య, సాంస్కృతిక, తాత్విక రంగాల్లో సమర్థించడమే ఈ కక్షకు కారణం. ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక సదస్సును సెప్టెంబర్ 21న తెలంగాణ ప్రభుత్వం భగ్నంచేసి ఏడు వందల మందిని అరెస్టు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన సహకారానికి కృతజ్ఞతగా ఇపుడీ సహకారాన్ని తెలంగాణ ప్రభుత్వం అందించింది.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేసితీరుతామన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం అంగీకరించడమే కాకుండా, భద్రాచలం మండలంలోని ఏడు మండలాలను కట్టబెట్టడానికి సిద్ధపడిన సిగ్గులేని రాజీధోరణిని విరసం ప్రతిఘటించడం కూడ ఈ కక్షకు కారణం. ఒక్క మాటలో ఇతర పీడిత ప్రజలతో పాటు ఆదివాసీల న్యాయమైన పోరాటాలకు విరసం గత నలభై నాలుగు ఏళ్లుగా తాత్విక, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో అండగా నిలవడమే ఈ కక్షకు కారణం. గిరిజనులను ముందుపెట్టి ఒక పథకం ప్రకారం రెండు రాష్ట్రాల పోలీసులు మా ఇంటిపై దాడి వంటి ధర్నా నిర్వహించడాన్ని రచయితలు, ప్రజాస్వామ్యవాదులు ఖండిస్తారని ఆశిస్తున్నాను.

- వరవరరావు

హైదరాబాద్
20-11-2014

-: స్వీకారం :-




ఉద్యమమే ఊపిరిగా...

చల్లపల్లి శ్రీనివాసరావు

ప్రచురణ :
సాహితీ మిత్రులు,
విజయవాడ

వెల : రు. 100/-

పేజీలు : 211




కొండా... కోనల్లో...
ఆదివాసీ కథలు

డా॥ దిలావర్

ప్రచురణ :
సమతా ప్రచురణలు

వెల : రు. 100/-

పేజీలు : 153




తెగిపడ్డ ఆ చెయ్యి
కారుమంచి దళితుల ధిక్కార చరిత్ర

పి.ఎస్. సాగర్

ప్రచురణ :
సిపిఐ (ఎం.ఎల్) -
న్యూడెమోక్రసీ

వెల : రు. 100/-

పేజీలు : 110




ఆదాబ్ హైదరాబాద్
తెలంగాణ ఉద్యమ కవిత్వం

లోచన్

ప్రచురణ :
తెలంగాణ కవుల వేదిక

వెల : రు. 40/-

పేజీలు : 72



అప్రజ్ఞాత యజ్ఞం
కాళీపట్నపు రామారావు

ప్రచురణ :
కావ్య పబ్లిషింగ్ హౌస్

వెల : రు. 60/-

పేజీలు : 88




చిగురించే మనుషులు
కథలు (2009-2014)

పలమనేరు బాలాజి

ప్రచురణ :
పవిత్ర & ప్రణీత
ప్రచురణలు

వెల : రు. 100/-

పేజీలు : 167




మావో రచనలు
మొదటి సంపుటి

ప్రచురణ :
విరసం

వెల : రు. 170/-

పేజీలు : 448




మావో రచనలు
రెండవ సంపుటి

ప్రచురణ :
విరసం

వెల : రు. 220/-

పేజీలు : 584



నక్సల్బరీ వెలుగులో...
(భారతదేశ నక్సలైట్ ఉద్యమ చరిత్ర)

సమంతా బెనర్జీ

ప్రచురణ :
విరసం

వెల : రు. 180/-

పేజీలు : 448

గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో 2014 నవంబర్ 1, 2 తేదీల్లో సిపిఐ కార్యాలయంలో జరిగిన విప్లవ రచయితల సంఘం కవిత్వం వర్క్‌షాపు-5 దృశ్యాలు



జి. కళ్యాణరావు, ఖాదర్‌మోహియుద్దీన్, నల్లూరి రుక్మిణి, చలసాని ప్రసాద్



వడ్డెబోయిన శ్రీనివాస్, రివేరా, కాశీం, తదితరులు

ARUNATARA onthly Journal of Revolutionary Writers' Association (VIRASAM)
• RNI Regn.No.21152/72 • Published on 26/11/2014 308 - November, 2014



Edited, printed, published and owned by Chalasani Prasad, H.No. 33-13-3, Seetharampuram, Vijayawada - 520 002
Printed at Nagendra Printing Press, Vijayawada - 520 002.
Editor : Chalasani Prasad

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M172
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	45
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Y.V. Bhanu
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Afsar
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good